# అధ్యాయం III

## నియమపాలనపై తనిఖీ

### 3.1 మోసాలు , మోసాలను కనుగొనడం

పాఠశాల విద్యాశాఖ

### 3.1.1 మోసపూరితంగా పొందిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లు

**తొమ్మిది జిల్లాల్లో పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన 162 కేసుల్లో మోసపూరితమైన మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ల ద్వారా రూ2.29 కోట్ల చెల్లింపులు జరిగినట్లు ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.**

ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న ప్రభుత్వ ఉత్తర్వుల్లోనూ, తాజాగా 2005 మార్చిలో జారీచేసిన ఉత్తర్వుల్లోనూ ఇరవై ఐదు వేల రూపాయల్లోపు విలువైన వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంటు క్లెయిమ్‌లను మంజూరు చేసే అధికారాన్ని రాష్ట్రంలోని అన్ని శాఖల్లోనూ జిల్లాస్థాయి అధికార్లందరికీ కల్పించడం జరిగింది. వీరు చేసే మంజూరీ జిల్లా వైద్య బోర్డు/జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంటు/బోధనా ఆసుపత్రి సూపరింటెండెంటు పరిశీలనకు లోబడి ఉంటుంది. ఇరవై ఐదు వేల రూపాయాలకు మించిన క్లెయిమ్‌లను సంబంధిత జిల్లా అధికార్లు వైద్య విద్యాసంచాలకుల (డి.ఎమ్.ఇ) పరిశీలన కోసం పంపాలి.

మెడికల్ రీయింబర్స్‌మెంటు క్లెయిమ్‌ల వోచర్లను[1] మచ్చుకు తనిఖీ చేస్తున్నప్పుడు, తొమ్మిది జిల్లాలకు[2] సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఉద్యోగులకు 2009 ఏప్రిల్ - 2010 మార్చి మధ్య కాలంలో చెల్లించిన 162 క్లెయిమ్‌ల వాస్తవికతను నిర్ధారించుకోవడానికి సంబంధిత ఆసుపత్రులకు పంపించడమైంది. ఇరవై ఐదు వేల రూపాయలకు మించిన క్లెయిమ్‌లలో ఆ కేసులను డి.ఎమ్.ఇ తనిఖీ చేసారని నిర్ధారించడానికి వాటిని డి.ఎమ్.ఇ. కి పంపించడమైంది. ఆడిటులో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి:

(i) ఆసుపత్రులకు ఆడిటు పంపిన మొత్తం 162 కేసూల్లోనూ క్లెయిమ్‌లు నకీలివి/కల్పితమైనవి/ఫోర్జరీవేనని ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి

(ii) డి.ఎమ్.ఇ.కి పంపిన 149 కేసులకు[3] గాను 34 కేసుల్లో డి.ఎమ్.ఇ. కార్యాలయం నుండి జారీచేసినట్లుగా చూపుతున్న పత్రాలు వాస్తవానికి తాము జారీ చేసినవి కాదనీ, అవి ఫోర్జరీ పత్రాలేననీ డి.ఎమ్.ఇ. ధృవీకరించారు.

మొత్తం రూ2.29 కోట్ల చెల్లింపులు జరిగిన 162 కేసులకు సంబంధించి డి.డి.ఓ. వారీగా మోసపూరిత క్లెయిమ్‌ల వివరాలు *అనుబంధం - 3.1* లో ఉన్నాయి.

ఉద్యోగులు సమర్పించిన వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంటు క్లెయిమ్‌లను ఆమోదించేటప్పుడు నిబంధనల[4] ప్రకారం డి.డి.ఓ.లు/ నియంత్రణాధికార్లు వాటిని పూర్తిగా పరిశీలించాల్సి ఉంది. డి.ఎమ్.ఇ. అప్పుడప్పుడు కొన్ని క్లెయిమ్‌లను ఆసుపత్రులతో సంప్రదించి, మచ్చుకు తనిఖీ చేసి ఉంటే పైన పేర్కొన్న మొదటి రకం క్లెయిమ్ లలో మోసపూరితమైనవి వెల్లడయ్యేవి. రెండవ రకం క్లెయిమ్‌లలో మోసపూరితమైన వాటిని డి.డి.ఓ.లు తమంతట తామే కనిపెట్టవచ్చు. క్లెయిమ్‌లను ఆమోదించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని దీనివలన తెలుస్తోంది.

---

1 సెంట్రల్ ఆడిటులో

2 ఆదిలాబాదు, ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, విజయనగరం, వరంగల్

3 పదమూడు కేసుల్లో క్లెయిమ్‌లు ఇరవై ఐదు వేల రూపాయల్లోపువి కాబట్టి ధృవీకరణ కోసం వాటిని డి.ఎమ్.ఇ. కి పంప లేదు

4 ఆంధ్రప్రదేశ్ సమగ్ర వైద్య సహాయ నియమావళి - 1972

ఆ విధంగా, తగిన పరిశీలనలు జరపడంలో డి.డి.ఓ.లు/డి.ఎమ్.ఇ. ల వైఫల్యం రూ2.29 కోట్ల మోసపూరితమైన క్లెయిమ్‌ల చెల్లింపునకు దారి తీసింది.

మోసపూరిత క్లెయిమ్‌లను సమర్పించిన ఆ కేసుల్లో చెల్లించిన మొత్తాలను ఉపాధ్యాయులు/ఉద్యోగుల నుండి రికవరీ చేయాలనీ, టీచర్లను సస్పెన్షన్‌లో ఉంచాలనీ, సంబంధిత జిల్లా విద్యాధికార్లను ఆదేశించినట్లు పాఠశాల విద్యా శాఖ కమీషనరు - డైరెక్టరు తెలిపారు (2010 డిసెంబరు). ఈ అంశాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ చేపట్టడానికి తగిన ఆదేశాలు జారీచేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరామని కూడా కమీషనరు తెలిపారు. ఐతే, ప్రభుత్వ సమాధానం ఇంకా రాలేదు (2010 నవంబరు).

క్లెయిమ్ లతో జతచేసే అన్ని పత్రాల పైనా వాటిని సమర్పించే వారి సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని ఆడిటు సిఫార్సు చేస్తోంది. అంతేకాకుండా, ఆసుపత్రులు ఇచ్చే బిల్లులపై సంతకాలు చేయడానికి ఎవరికైతే అధికారం కల్పించారో వారి నమూనా సంతకాలను సంబంధిత ప్రభుత్వ అధికార్లు తమ వద్ద ఉంచుకునే పద్ధతిని కూడా ప్రవేశ పెట్టాల్సి ఉంది.

పాఠశాల విద్య, గిరిజన సంక్షేమం, ఆర్థిక శాఖలు

### 3.1.2 మోసపూరితంగా పొందిన లీవ్‌ట్రావెల్ కన్సెషన్ (ఎల్.టి.సి.) క్లెయిమ్ లు

**ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాల విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించిన 994 కేసుల్లో మోసపూరితమైన ఎల్.టి.సి. క్లెయిమ్‌ల ద్వారా మొత్తం రూ84.91 లక్షల చెల్లింపులు జరిగాయని ఆడిటు కనుగొంది.**

ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాల విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించి 2008 సెప్టెంబరు - 2009 డిసెంబరు మధ్యకాలానికి చెందిన ఎల్.టి.సి. వోచర్లను[5] తనిఖీ చేయగా (2010 జనవరి) 994 కేసుల్లో మోసపూరితమైన ఎల్.టి.సి. క్లెయిమ్ ల ద్వారా రూ84.91 లక్షల చెల్లింపులు జరిగాయని వెల్లడైంది.

ఈ క్లెయిమ్ లలో పాల్పడిన మోసాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

- జెరాక్సు కాపీల సహాయంతో కంప్యూటరీకరించిన నకిలీ రైల్వే టికెట్లను సృష్టించి ప్రయాణ వివరాలు, ఇతర అంకెల్ని మార్పు చేయడం
- రద్దు చేసిన టికెట్లతో క్లెయిమ్ లను సమర్పించడం
- నకిలీ టికెట్లను ముద్రించి సమర్పించడం

ఈ కింది అంశాలను ఆడిటు గమనించింది :

(i) మొత్తం 994 కేసులకు గాను, 611 కేసుల్లో క్లెయిమ్‌లతో సమర్పించిన టికెట్లలో ప్యాసింజరు నేమ్ రికార్డు (పి.ఎన్.ఆర్. - రైల్వేరిజర్వేషను టికెట్టు మీద ముద్రించే పది అంకెల విశిష్ట సంఖ్య) పునరావృతమయ్యింది.

(ii) 348 కేసుల్లోని క్లెయిమ్‌లలో టికెట్ నంబర్లు ఒకే విధంగా ఉన్నాయి.

(iii) 28 కేసుల్లో రద్దు చేసిన టికెట్లతో క్లెయిమ్‌లను సమర్పించారు.

(iv) ఏడు కేసుల్లో ముద్రించిన నకిలీ టికెట్లతో క్లెయిమ్ లను సమర్పించారు.

డి.డి.ఓ. వారీగానూ/శాఖల వారీగానూ మోసపూరితమైనవిగా ఒప్పుకున్న క్లెయిమ్‌ల వివరాలు *అనుబంధం - 3.2* లో ఉన్నాయి.

---

[5] సెంట్రల్ ఆడిటులో

అంతేకాకుండా, ప్రయాణపు తేదీలు, కుటుంబ సభ్యుల వివరాలు, చెల్లించిన ప్రయాణ భత్యం మొత్తం వంటి వివరాలతో సహా ఆంధ్రప్రదేశ్ ప్రయాణ భత్యం నియమావళి కింద మంజూరైన ఆర్థిక సహాయం వివరాలను సంబంధిత ఉద్యోగి సర్వీసు పుస్తకంలో నమోదు చేయాలని నియమావళి లోని నియమం - 92 (1) కింద ఇచ్చిన అనుబంధం - VII లోని పేరా 12 (ఇ) నిర్దేశిస్తోంది. మొత్తం 994 కేసులకు గాను, 138 కేసుల్లో (14 శాతం) డి.ఇ.ఓ.[6] ఆడిటుకి సమర్పించిన సర్వీసు రిజిస్టర్లను తనిఖీ చేయగా (2010 మే) ఆ రిజిస్టర్లలో ఈ కింది వివరాలు నమోదు చేయలేదని వెల్లడైంది :

(ఎ) కుటుంబ సభ్యుల ధృవీకరణ
(బి) ఎల్.టి.సి. ని వాడుకోవడానికి సంబంధిత అధికారి ఇచ్చిన అనుమతి
(సి) సొంత ఊరు/పర్యటించే ప్రదేశం వెల్లడించటం
(డి) ఎల్.టి.సి. ని వినియోగించుకోవడానికి తీసుకున్న సెలవు, ఇంకా లీవ్ అకౌంటు నుండి ఆ మేరకు సెలవును తగ్గించిన వైనం
(ఇ) ఎల్.టి.సి. క్లెయిమ్ చేసిన మొత్తం, ఆ మొత్తాన్ని చెల్లించిన తేది

పైన పేర్కొన్న లోపాలను అంగీకరిస్తూ, ప్రకటించిన ప్రదేశానికి వాస్తవంగా ప్రయాణం చేయకుండానే ఆయా వ్యక్తులు క్లెయిమ్ లను సమర్పించారని డి.ఇ.ఓ. ధృవీకరించారు (2010 మే).

ఉద్యోగుల ఎల్.టి.సి. క్లెయిమ్‌లను ఆమోదించేటప్పుడు డ్రాయింగ్ - డిస్బర్సింగ్ అధికార్లు (డి.డి.ఓ.లు)/ నియంత్రణాధికార్లు నిబంధనల[7] ప్రకారం, వాటిని పూర్తిగా పరిశీలించాలి.[8] అంతేకాకుండా, ట్రెజరీల్లో బిల్లులనూ, ఇతర వోచర్లనూ ఆమోదించేటప్పుడు ట్రెజరీ అధికార్లు నిర్దేశిత తనిఖీలు చేయాలనీ, మోసం, నిధుల దుర్వినియోగం, ఆమోదనార్హత లేని క్లెయిమ్‌ల రూపేణా ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా ఉండేట్లుగా తగిన జాగ్రత్తలు పాటించాలనీ ట్రెజరీ నియమాలు నిర్దేశిస్తున్నాయి. క్లెయిమ్‌లలో ఆమోదనార్హత లేని, సందేహాస్పద అంశాలకు సంబంధించిన మొత్తాల చెల్లింపులను ట్రెజరీ అధికార్లు తిరస్కరించాలి.

కాబట్టి, పైన (i), (ii), (iv) వర్గాలలో పేర్కొన్న క్లెయిమ్‌లలోని మోసాలను డి.డి.ఓ.లు/ ట్రెజరీ అధికార్లు సులభంగానే కనిపెట్టవచ్చు. క్లెయిమ్‌లను ఆమోదించేటప్పుడు వారు తగు జాగ్రత్తలు పాటించలేదని దీన్ని బట్టి తెలుస్తోంది. డి.డి.ఓ.లు/ట్రెజరీ అధికార్లు నిఘా పెట్టి, రైల్వే అధికార్లతో సంప్రదించి అప్పుడప్పుడు కొన్ని క్లెయిమ్‌లను మచ్చుకు తనిఖీ చేసి ఉంటే, (iii) వ వర్గంలో పేర్కొన్న క్లెయిమ్‌లలోని మోసాన్ని కూడా కనుగొనవచ్చు.

ఐతే, డి.డి.ఓ.లు/ట్రెజరీ అధికార్లు పైన పేర్కొన్న తనిఖీలను నిర్వహించడంలో విఫలమయ్యారు. ఫలితంగా మోసపూరితమైన క్లెయిమ్‌ల ద్వారా రూ84.91 లక్షల చెల్లింపు జరిగింది (పాఠశాల విద్య : 942 కేసులు/ రూ80.50 లక్షలు; గిరిజన సంక్షేమం : 52 కేసులు/రూ4.41 లక్షలు).

పైన పేర్కొన్న ఆడిటు పరిశీలనలను గిరిజన సంక్షేమ శాఖలోని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అంగీకరించారు (2010 మే). మోసపూరితమైన ఎల్.టి.సి. క్లెయిమ్‌ల ద్వారా పొందిన మొత్తాలను సంబంధిత ఉద్యోగుల జీతాల నుండి రికవరీ చేయడానికీ, సంబంధిత ఉద్యోగులు/డి.డి.ఓ.లపై క్రమశిక్షణా చర్యలను తీసుకోవడానికీ ఆదేశాలిచ్చారు. పాఠశాల విద్యా శాఖకు సంబంధించి సమాధానం రాలేదు (2010 నవంబరు).

[6] క్షేత్ర స్థాయిలో ఆడిటు చేసినప్పుడు

[7] ఆంధ్రప్రదేశ్ ప్రయాణ భత్యం నియమావళిలోని నియమం 92 (1) కింద ఇచ్చిన అనుబంధం - VII లోని పేరా 12 (డి)

[8] 1981 సెప్టెంబరు, 1982 సెప్టెంబరు, 1986 ఆగస్టులో ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం

## 3.2 ఆర్థిక పరమైన ఔచిత్యం పై తనిఖీ; తగిన సమర్థనీయత లేకుండా చేసిన ఖర్చులు

### వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ

### 3.2.1 వెనుకబడిన తరగతుల సంక్షేమ హాస్టళ్లు

**వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం 2003-08 మధ్య కాలంలో 112 హాస్టల్ భవనాలు మంజూరు కాగా, అందులో 70 హాస్టల్ భవనాల నిర్మాణం నిర్దేశించిన రెండేళ్ల గడువును మించి ఆలస్యమైంది (2010 సెప్టెంబరు). దీని వలన లక్షిత విద్యార్థులకు హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాల ప్రయోజనం అందకపోవడమే కాకుండా నిర్మాణపు ఖర్చు రూ16.72 కోట్ల మేర పెరిగిపోయింది. అదేవిధంగా, పనికి ఆహారం పథకం కింద మంజూరైన 31 హాస్టల్ భవనాలు కూడా అసంపూర్తిగా ఉన్నాయి. చాలామటుకు హాస్టళ్లలో కనీస సౌకర్యాలు లేవు.**

రాష్ట్రంలో 1,422 వెనుకబడిన తరగతుల (బి.సి.) సంక్షేమ హాస్టళ్లున్నాయి. ఇవి 1.79 లక్షల మందికి వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. ఇందులో 807 హాస్టళ్లు ప్రభుత్వ భవనాల్లోనూ, మిగిలిన 615 హాస్టళ్లు అద్దె భవనాల్లోనూ ఉన్నాయి. బి.సి. సంక్షేమ కమీషనరు (కమీషనరు) కార్యాలయం, ఐదు[9] జిల్లాల్లోని జిల్లా బి.సి. సంక్షేమ అధికార్ల కార్యాలయాల తనిఖీ (2009 డిసెంబరు - 2010 ఫిబ్రవరి) లో భాగంగా, హాస్టల్ భవనాల నిర్మాణం, ఇదివరకే నిర్మించిన హాస్టళ్ల నిర్వహణ, హాస్టళ్లలో కనీస వసతుల కల్పనలకు సంబంధించిన కార్యకలాపాలను ఆడిటు మదింపు చేసింది. ఐదు జిల్లాల్లోని మొత్తం 331 హాస్టళ్లకు గాను 223 హాస్టళ్లను[10] (ప్రభుత్వ భవనాలు : 137 ; అద్దె భవనాలు : 86) ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసింది. తనిఖీలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి:

#### హాస్టల్ భవనాల నిర్మాణం

**కేంద్ర ప్రాయోజిత పథకం కింద హాస్టల్ భవనాలు**

రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల[11] ఆధారంగా ఇతర వెనుకబడిన తరగతులకు (ఓ.బి.సి.) చెందిన బాలురు, బాలికల కోసం హాస్టళ్ల నిర్మాణం అనే కేంద్ర ప్రాయోజిత పథకం కింద భారత ప్రభుత్వం హాస్టల్ భవనాల నిర్మాణాలను మంజూరు చేస్తుంది. ఐతే, ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులకు చెందిన అద్దె భవనాలలో కొనసాగుతున్న హాస్టళ్లు గల ప్రాంతాలకు ప్రాధాన్యతనిస్తారు. ఈ ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. 2003 - 09 మధ్య గల ఆరేళ్ల కాలంలో భారత ప్రభుత్వం 143 హాస్టల్ భవనాల నిర్మాణానికి మంజూరీనిచ్చింది (అంచనా విలువ : రూ36.15 కోట్లు). భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, మంజూరైన హాస్టళ్ల నిర్మాణం రెండేళ్లలోపు పూర్తవ్వాలి. దీని ప్రకారం, 2003-08 మధ్య కాలంలో మంజూరైన హాస్టల్ భవనాల నిర్మాణాలు ఏ మేరకు పూర్తయ్యాయనే విషయాన్ని ఆడిటు పరిశీలించింది. ఆడిట్ గమనించిన విషయాలు ఇలా ఉన్నాయి :

**నిర్మాణానికి స్థలాలను గుర్తించకపోవడం :**

భారత ప్రభుత్వం మంజూరీ నివ్వడానికి ముందుగా, హాస్టల్ భవనాల నిర్మాణానికి స్థలాలు అందుబాటులో ఉన్నాయని కమీషనరు ధృవీకరించాల్సి ఉంటుంది. హాస్టల్ భవనాల మంజూరీ కోసం ప్రతిపాదనలు పంపుతూ స్థలాల లభ్యత విషయాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ధృవీకరించింది. ఐతే, 2004-05 నుండి

---

9 అనంతపురం, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, ప్రకాశం

10 ఆదిలాబాద్:22, అనంతపురం : 79, మెదక్: 39, నిజామాబాద్ :14, ప్రకాశం: 69

11 ఓ.బి.సి.ల జనాభా సాంద్రత, విద్యా సౌకర్యాలు తగినంతగా లేకపోవడం, నిర్మాణానికి స్థలాల లభ్యత, మొదలైన అంశాలతో పాటు, అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రతిపాదనలను రూపొందిస్తారు.

2008-09 వరకు మంజూరైన 123 భవనాలకు గాను 26 భవనాలకు[12] సంబంధించిన పనులు స్థలాలను గుర్తించకపోవడం/ స్థలాలు అందుబాటులో లేకపోవడం వలన 2009 ఏప్రిల్ నాటికి మొదలు కాలేదు. ప్రభుత్వం తన సమాధానం (2010 నవంబరు) లో కేంద్రానికి ప్రతిపాదనలను పంపడానికి ముందే స్థలాల లభ్యత విషయాన్ని జిల్లాఅధికార్లతో ధృవీకరించు కోవడమైందనీ, ఐతే వీలు కాని పరిస్థితులు, న్యాయపరమైన సమస్యల కారణంగా కొన్ని స్థలాలను మార్చవలసి వచ్చిందనీ, దీంతో నిర్మాణాలు ఆలస్యమయ్యాయనీ తెలిపింది. పైన పెర్కొన్న కేసుల్లో కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు లోపభూయిష్టమైనవని దీన్ని బట్టి తెలుస్తోంది.

### పరిపాలనా పరమైన మంజూరీలు ఇవ్వడంలో జాప్యం

2003-09 మధ్య కాలంలో భారత ప్రభుత్వం మంజూరు చేసిన హాస్టళ్లకు పరిపాలన పరమైన మంజూరీ నివ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నుండి పన్నెండు నెలల వరకు జాప్యం చేసిందని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది. 2008-09 లో భారత ప్రభుత్వం మంజూరు చేసిన 31 హాస్టల్ భవనాలకు గాను 12 భవనాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం 2010 మార్చిలో మాత్రమే పరిపాలనాపరమైన మంజూరీనిచ్చింది. స్థలాలు అందుబాటులో లేకపోవడం, నిధులలేమి వలన ఈ జాప్యం జరిగింది. జరిగిన జాప్యానికి విచారం వ్యక్తం చేస్తూ, ఇలాంటివి మళ్లీ పునరావృతం కావని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ హామీ ఇచ్చింది.

### నిధుల విడుదల

చాలినంత నిధులు ముందే అందుబాటులో ఉంటే కాంట్రాక్టర్లకు సత్వరమే చెల్లింపులు చేయడానికీ, పనులు సాఫీగా జరిగేందుకూ వీలవుతుంది. సరిపడా నిధులు అందుబాటులో ఉండేలా చూడకుండానే హాస్టల్ భవనాల నిర్మాణాలను చేపట్టారని ఆడిటు గమనించింది. రాష్ట్రప్రభుత్వం తన వాటా నిధులను పూర్తిగా విడుదల చేయలేదు. 2003-09 మధ్య కాలంలో మంజూరైన హాస్టల్ భవనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా రూ18.07 కోట్ల మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉండగా, రూ7.15 కోట్లు[13] మాత్రమే విడుదల చేసింది. అంటే, రూ10.92 కోట్లు తక్కువగా విడుదల చేసింది.

మచ్చుకు తనిఖీ చేసిన ఐదు జిల్లాల్లో మొత్తం 223 హాస్టల్ భవనాలకు గాను సమయానికి నిధులు విడుదల కాకపోవడం వలన 16 భవనాల[14] నిర్మాణం పూర్తి కాలేదు. ఫలితంగా, 2007-08 వరకు మంజూరైన కిరాయి భవనాల పైనే రూ13.16 లక్షల అద్దె చెల్లించాల్సి వచ్చింది. ఇది నివారించదగ్గది.

### భారత ప్రభుత్వానికి వినియోగ ధృవపత్రాలను తప్పుగా సమర్పించడం

2005-06 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ4.40 కోట్ల కేంద్ర సాయం అందింది. ఇందులో రూ3.40 కోట్లను మాత్రమే రాష్ట్రప్రభుత్వం విడుదల చేసింది. అదేవిధంగా 2008-09 లో వచ్చిన రూ5.42 కోట్ల కేంద్ర సాయానికిగాను, రూ3.32 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. అంటే, కేంద్ర సాయంగా వచ్చిన రూ3.10 కోట్ల మొత్తాన్ని రాష్ట్రప్రభుత్వం, కమీషనరుకు ఇంకా విడుదల చేయవలసి ఉంది. కానీ, పై రెండేళ్లలో మొత్తం రూ9.82 కోట్ల కేంద్ర సాయాన్ని పూర్తిగా వినియోగించినట్లుగా భారత ప్రభుత్వానికి తప్పుడు వినియోగ ధృవపత్రాలను సమర్పించారు. భారత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వినియోగించకపోవడం వలన హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తి కాలేదు.

---

[12] ఆదిలాబాద్ :1; అనంతపురం :1; చిత్తూరు:1; తూర్పు గోదావరి:2; గుంటూరు:2; క్రిష్ణా:1; కర్నూలు:1; మెదక్ :1 ; నల్గొండ:2; నిజామాబాద్ :1; ప్రకాశం :2; రంగారెడ్డి:3; ఎస్.పి.ఎస్.నెల్లూరు:1; శ్రీకాకుళం:2; విశాఖపట్నం :1; పశ్చిమ గోదావరి:4 (2004-05 :1; 2005-06:2; 2007-08:13; 2008-09:10)

[13] 2003-04 : రూ2.20 కోట్లు: 2004-05 : రూ3.30 కోట్లు: 2005-06 : రూ1.65 కోట్లు

[14] ఆదిలాబాద్ :2 ; అనంతపురం : 5 ; మెదక్ : 4 ; నిజామాబాద్ :2 ; ప్రకాశం :3

### కేంద్రీకృత డేటాబేస్ లేకపోవడం

హాస్టల్ భవనాల నిర్మాణం ఏస్థితిలో ఉందో పర్యవేక్షించేందుకు కేంద్రీకృత డేటాబేస్‌ను నిర్వహించడంలేదని ఆడిటు గమనించింది. నిర్మాణపు పనుల పురోగతిని పర్యవేక్షించడంతోపాటు అవసరాలకు అనుగుణంగా ఖర్చుల ప్రాధాన్యతలను నిర్ణయించడానికి కేంద్రీకృత డేటాబేస్ తోడ్పడి ఉండేది. కేంద్రీకృత డేటాబేస్ లేకుండా ఈ విధమైన పర్యవేక్షణ వీలుకాదు.

### పనులను నిర్వహించే సామర్థ్యం లేని సంస్థకు అత్యధిక సంఖ్యలో పనులు కట్టబెట్టడం

2003-09 లో మంజూరైన మొత్తం 143 హాస్టల్ భవనాలకు గాను, 94 భవనాల[15] నిర్మాణపు పనులను (అంచనా విలువ : రూ22.92 కోట్లు; విడుదల : రూ19.33 కోట్లు) మత్స్య శాఖ కమీషనరు కార్యాలయంలోని కార్యనిర్వాహక ఇంజనీరు (మత్స్యశాఖ- ఈ.ఈ) కు అప్పగించారు. పనులు చేపట్టాల్సిన జిల్లాల్లో మత్స్య శాఖకు చాలినంత మౌలిక వసతులు లేవని ఆడిట్ గమనించింది. మత్స్యశాఖ ఈ.ఈ కార్యాలయంలో తగిన మౌలిక సదుపాయాలు లేవన్న విషయాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టరు 2005 ఏప్రిల్ లోనే ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. ఐనప్పటికీ, 2008-09 వరకూ ప్రభుత్వం ఆ ఇంజనీరింగు డివిజనుకు పనులు అప్పగిస్తూ వచ్చింది. మత్స్యశాఖ ఈ.ఈ కి అప్పగించిన 94 పనులకు గాను 65 పనులు[16] (69 శాతం) 2010 అక్టోబరు నాటికి అసంపూర్తిగానే ఉన్నాయని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.

మత్స్యశాఖ ఈ.ఈ వద్ద నుండి హాస్టల్ భవనాల నిర్మాణం పనులను ఉపసంహరించి వాటిని పూర్తిచేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏ.పి.ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి) కు అప్పగించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). మత్స్యశాఖ ఈ.ఈ కి సంబంధించిన కేసు దర్యాప్తులో ఉందని కూడా ప్రభుత్వం తెలిపింది.

### నిర్ణీత గడువులోపు హాస్టల్ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం వలన పెరిగిన ఖర్చు

పైన పేర్కొన్న లోపాల కారణంగా 2003-04 నుండి 2007-08 వరకు మంజూరైన 112 హాస్టళ్లకు[17] గాను 70 హాస్టల్ భవనాల[18] నిర్మాణం 2010 సెప్టెంబరు నాటికి పూర్తి కాలేదు (ఇప్పటి వరకు చేసిన ఖర్చు : రూ10.84 కోట్లు). మంజూరైన 24 నెలల్లోపు హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నాయి. ఐతే, హాస్టల్ భవనాల నిర్మాణంలో అత్యధికంగా 56 నెలల వరకూ (2010 సెప్టెంబరు నాటికి) జాప్యాలు జరిగాయని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది. వివరాలు **పట్టిక-1** లో ఉన్నాయి:

[15] 2003-04 : 20; 2004-05 : 25; 2005-06 : 37; 2007-08 : 12

[16] ఆదిలాబాద్ : 3; అనంతపురం : 6; చిత్తూరు : 2; తూర్పుగోదావరి : 6; గుంటూరు : 1; హైదరాబాద్ : 2; ఖమ్మం : 1; కరీంనగర్ : 1; క్రిష్ణా : 5; కర్నూలు : 4; మెదక్ : 4; నల్గొండ : 2; నిజామాబాద్ : 6; ప్రకాశం : 4; రంగారెడ్డి : 2; శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు : 2; శ్రీకాకుళం : 3; విజయనగరం : 1; విశాఖపట్నం : 5; పశ్చిమగోదావరి : 2; వై.ఎస్.ఆర్. : 3

[17] 2003-04 : 20; 2004-05 : 30; 2005-06 : 40; 2007-08 : 22

[18] 2003-04 : 8; 2004-05 : 14; 2005-06 : 26; 2007-08 : 22

**పట్టిక-I**

| సంవత్సరం | కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన హాస్టళ్ల సంఖ్య | కేంద్ర ప్రభుత్వం మంజూరీ ఇచ్చిన నెల, సంవత్సరం | నిర్మాణం పూర్తి చేయాల్సిన గడువు | నిర్మాణం పూర్తి కాని హాస్టళ్ల సంఖ్య | అసంపూర్తిగా ఉన్న హాస్టళ్ల నిర్మాణంలో జాప్యం (2010 సెప్టెంబరు నాటికి) |
|---|---|---|---|---|---|
| 2003-04 | 20 | 2004 ఫిబ్రవరి | 2006 జనవరి | 8 | 56 నెలలు |
| 2004-05 | 30 | 2004 నవంబరు | 2006 అక్టోబరు | 14 | 47 నెలలు |
| 2005-06 | 30 | 2005 సెప్టెంబరు | 2007 ఆగస్టు | 26 | 37 నెలలు |
| | 10 | 2006 మార్చి | 2008 ఫిబ్రవరి | - | - |
| 2007-08 | 22 | 2007 డిశంబరు | 2009 నవంబరు | 22 | 10 నెలలు |

సూచన : 2006-07 లో భారత ప్రభుత్వం ఒక్క హాస్టల్ భవనాన్ని కూడా మంజూరు చేయలేదు.

హాస్టల్ భవనాలు పూర్తి కాకపోవడం వలన బి.సి. విద్యార్థులు హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు పొందే ప్రయోజనాన్ని కోల్పోయారు. అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవనాల నిర్మాణాన్ని ఏ.పి.ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి.కి అప్పగించగా (2008 డిశంబరు), ఆ సంస్థ పెండింగులో ఉన్న 70 హాస్టల్ భవనాలకోసం అదనంగా రూ23.48 కోట్ల నిధులివ్వాలని కోరింది (2009 నవంబరు). దీనిపై 2010 సెప్టెంబరు నాటికి ప్రభుత్వ అనుమతి రాలేదు. ఆ విధంగా, నిర్ణీత గడువు లోగా హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడం వలన వాటి నిర్మాణ వ్యయం రూ16.72 కోట్ల[19] మేర పెరిగింది.

**'పనికి ఆహార పథకం' కింద హాస్టళ్ల నిర్మాణం**

కేంద్ర ప్రాయోజిత పథకం కింద మంజూరైన హాస్టళ్లకు అదనంగా, రాష్ట్ర ప్రభుత్వం 2002-03 సంవత్సరంలో 'పనికి ఆహారం పథకం' కింద మరో 307 హాస్టళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. ప్రధానంగా, నిధులను కేటాయించని కారణంగా వీటిలో 31 భవనాల నిర్మాణం 2010 సెప్టెంబరు నాటికి కూడా పూర్తి కాలేదని ఆడిటు గమనించింది. దీని వలన కిరాయి భవనాలకు రూ30.56 లక్షల నివారించదగిన చెల్లింపు చెయ్యాల్సి వచ్చింది. ఆడిటు పరిశీలనలో ఈ కింది విషయాలు కూడా వెల్లడయ్యాయి:

- 'పనికి ఆహారం పథకం' కింద కేవలం 11 లక్షల అంచనా వ్యయంతో వంద మంది విద్యార్థులకు వసతి కల్పించే హాస్టళ్ల నిర్మాణానికి మంజూరీనిచ్చారు. అదే ఏడాది కేంద్రప్రాయోజిత పథకం కింద అదే రకమైన హాస్టల్ భవనానికి రూ22 లక్షలను కేటాయించారు. ప్రకాశం జిల్లాలో 'పనికి ఆహారం పథకం' కింద నిర్మించిన 10 హాస్టళ్ల విషయంలో మత్స్య శాఖ ఈ.ఈ అంచనాలను సవరించడానికి బదులు భవనం ప్లింత్ వైశాల్యాన్ని 3,869 చ.అ. నుండి 2,351 చ.అ. కు తగ్గించారు. ఫలితంగా 100 మంది విద్యార్థులకు కల్పించాల్సిన వసతిని కుదించడమే కాకుండా ఈ పథకం కింద చేపట్టిన హాస్టల్ భవనాల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడినట్లయ్యింది.
- పనికి ఆహార పథకం కింద 2002-03 లో చేపట్టిన నాలుగు హాస్టల్ భవనాలను (అనంతపురం : 3 ; రంగారెడ్డి : 1) రూ44 లక్షల ఖర్చు అయిన తర్వాత నిర్మాణపరమైన లోపాల కారణంగా నిలిపి వేయడం/కూల్చివేయడం జరిగింది. ఫలితంగా ఈ ఖర్చు వృధా అయ్యింది. ఖర్చు వృధా అయిన విషయాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కూడా ధృవీకరించింది. ఈ విషయం పై దర్యాప్తు జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది (2010 నవంబరు).

**హాస్టల్ భవనాల నిర్వహణ**

ప్రభుత్వ అధీనంలోని బి.సి. సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతులు, అదనపు వసతుల కల్పన కోసం ప్రభుత్వం 2008 మార్చిలో ' సంక్షేమ బాట' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

[19] కోరిన అదనపు నిధులు: రూ23.48 కోట్లు - (మొదటి అంచనా విలువ: రూ17.60 కోట్లు - ఖర్చు:రూ10.84 కోట్లు) = ఖర్చులో పెరుగుదల: రూ16.72 కోట్లు

ఈ కార్యక్రమం కింద ప్రభుత్వం నిధులను అస్సలు విడుదల చేయలేదని/తక్కువగా విడుదల చేసిందని ఆడిటు గమనించింది. 'సంక్షేమ బాట' కార్యక్రమం కింద 2008-09 లో ప్రభుత్వం 780 హాస్టళ్లలో రూ55.80 కోట్ల ఖర్చు కాగల 1,087 మరమ్మతు పనులను మంజూరు చేసింది. ఐతే, 2010 మార్చి నాటికి ప్రభుత్వం రూ33.07 కోట్లు[20] (59 శాతం) మాత్రమే విడుదల చేసింది. ఫలితంగా, 765 పనులు మాత్రమే పూర్తి కాగా (ఖర్చుః రూ17.94 కోట్లు) నిధుల కొరత కారణంగా 322 పనులు (32 శాతం) మధ్యలోనే నిలిచిపోయాయి. అంతేకాకుండా, పూర్తయిన పనులకు సంబంధించి, నిర్మాణ సంస్థలకు రూ16.24 కోట్ల మొత్తం ఇంకా చెల్లించాల్సి ఉంది.

హాస్టల్ భవనాలలో చేపట్టాల్సిన మరమ్మతులు, వాటికయ్యే ఖర్చుల వివరాలకు సంబంధించిన కేంద్రీకృత డేటాబేస్‌ను నిర్వహించడంలేదు. ఈ విధమైన డేటాబేస్ లేకపోవడం వలన మరమ్మతు పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరగడం లేదు.

### హాస్టళ్లలో సౌకర్యాల ఏర్పాటు

ఆడిటు మచ్చుకు తనిఖీ చేసిన 223 హాస్టళ్లలో (331 కి గాను) కనీస సదుపాయాలు ఏమేరకు ఉన్నాయో పరిశీలించగా ఈ కింది విషయాలు వెల్లడయ్యాయిః

(i) ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం, ప్రతి పదిమంది విద్యార్థులకు ఒక స్నానాల గది, ఒక మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలి. ఐతే, 223 హాస్టళ్లకుగాను 48 హాస్టళ్లలో (ప్రభుత్వ భవనాలుః 17; అద్దెభవనాలుః 31) కనీసం ఒక్క స్నానాలగది/మరుగుదొడ్డి కూడా లేదని ఆడిటు గమనించింది. మిగిలిన 175 లో కూడా 108 హాస్టళ్లలో (ప్రభుత్వ భవనాలుః 58; అద్దె భవనాలుః 50) ఒక్కో హాస్టల్ లోనూ పది స్నానాల గదులు/మరుగుదొడ్ల అవసరం ఉండగా కనీసం ఐదు కూడా లేవు.

(ii) భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, ఒక్కొక్క హాస్టల్ భవనం గరిష్ఠంగా వందమంది విద్యార్థులకు వసతి కల్పించాలి. ఐతే, ఐదు జిల్లాల్లో 223 హాస్టళ్లను ఆడిటు మచ్చుకు తనిఖీ చేయగా 140 హాస్టళ్లలో వంద కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఉంచారని వెల్లడైంది. ఇందులోని 51 హాస్టళ్లలో 150 కంటే ఎక్కువ మంది విద్యార్థులను ఇరికించారు. ఇది అసౌకర్యమైన జీవనానికి దారితీయడమే కాకుండా దీని వలన చదువుకోవడానికి అనువైన పరిస్థితులు లేకుండా పోయాయి. అనివార్య పరిస్థితుల్లో, డిమాండు మేరకు హాస్టళ్లలో వందమంది కంటే ఎక్కువ మంది విద్యార్దులకు వసతి కల్పించాల్సి వచ్చిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు),

(iii) వెనుకబడిన తరగతుల సంక్షేమానికి సంబంధించి ఏర్పాటైన సభాసంఘం (2004-06) సిఫార్సుల (2006 మార్చి) ప్రకారం, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన మొత్తం 223 హాస్టళ్లలోనూ ఫిల్టర్లను ఏర్పాటు చేయకుండా బోరుబావి నీటినే నేరుగా తాగేందుకు ఇవ్వడం జరుగుతోందని ఆడిటు గమనించింది.

(iv) భారతప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం హాస్టళ్లకు ప్రహరీ గోడ ఉండాలి. కానీ మచ్చుకు తనిఖీ చేసిన 223 హాస్టళ్లకు గాను, 97 హాస్టళ్లకు (ఇందులో ఆరు బాలికల హాస్టళ్లు ఉన్నాయి) ప్రహరీ గోడ లేదు.

ప్రభుత్వం ఈ ఆడిటు పరిశీలనలను అంగీకరిస్తూ, ఈ లోపాలపై చర్యలు తీసుకోవలసిందిగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు, ఎ.పి.ఇ.డబ్ల్యూ.ఐ.డి.సి. ముఖ్య ఇంజనీరులను కోరామని తెలిపింది. కొత్తగా చేపట్టే నిర్మాణాల్లో ఈ లోపాలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించామని కూడా ప్రభుత్వం తెలిపింది.

[20] 2010 ఫిబ్రవరి - మార్చి లలో రూ11.29 కోట్లు విడుదల చేశారు

## 3.3 పునరావృతమౌతున్న, విస్తృతమౌతున్న అక్రమాలు

**పశు సంవర్థక శాఖ**

### 3.3.1 అధిక దిగుబడినిచ్చే పాడిపశువుల పంపిణీ పథకం

**ఈ పథకం అమల్లో, లబ్ధిదార్ల ఎంపికలో పారదర్శకత, నిజాయితీలు లోపించడం, నాణ్యమైన పశువులు సరఫరా అయ్యేలా చూడకపోవడం, సరఫరా సంస్థలకు చేసే చెల్లింపుల నియంత్రణ లోపభూయిష్టంగా ఉండడం వంటి పలు లోపాలు వెల్లడయ్యాయి.**

అధిక దిగుబడినిచ్చే పాడిపశువుల పంపిణీ పథకం 2007-08 నుండి రాష్ట్రంలో అమలవుతోంది.[21] ఈ పథకం కింద దారిద్ర్య రేఖకు దిగువనున్న (బి.పి.ఎల్) ఒక్కో లబ్ధిదారునికీ ఆరు నెలల వ్యవధితో రెండు పాడి పశువులను (ఆవు/గేదె (బర్రె)/పెయ్యదూడ) సరఫరా చేయాలి. మొత్తం యూనిట్ ధర[22] (గరిష్ఠ యూనిట్ ధర రూ35,000) లో 50 శాతం మొత్తాన్ని (రూ15,000 ల పరిమితికి లోబడి) సబ్సిడీగా ఇస్తారు. పశువు ధరలో మిగతా మొత్తాన్ని బ్యాంకు రుణం ద్వారా లబ్ధిదారుడే భరించాలి. పశుగ్రాసాన్ని పండించేందుకు లబ్ధిదారుడు విడిగా 0.25 ఎకరం భూమి కలిగి ఉండాలి.

ఈ పథకం కింద 2007-09 మధ్యకాలంలో 1.03 లక్షల పశువులను సరఫరా చేసినట్లుగా (ఖర్చు: రూ141.12 కోట్లు[23]) చెబుతున్నారు. పశు సంవర్థక శాఖ సంచాలకుల రికార్డులను, 11 జిల్లాల్లో[24] ని సంయుక్త సంచాలకుల రికార్డులను ఆడిటు తనిఖీ చేయగా (2009 మే - సెప్టెంబరు) పథకం అమలులో ఈ కింది లోపాలు వెల్లడయ్యాయి.

**ప్రచారం మరియు లబ్ధిదారుల ఎంపిక**

ఈ పథకానికి సంబంధించి తగినంత ప్రచారం ఇవ్వలేదని ఆడిటు కనుగొంది. ప్రచారం ఖర్చుల కోసం ఉపసంచాలకులకు ఎలాంటి నిధులూ విడుదల చేయలేదు. దరఖాస్తుదార్ల నుండి దరఖాస్తులు తీసుకున్నట్లుగా రశీదులు ఇవ్వలేదని, వచ్చిన దరఖాస్తులన్నింటినీ నమోదు చేసే రిజిష్టర్లేవీ నిర్వహించలేదని కూడా ఆడిటు పరిశీలనలో తేలింది. ఎంపిక చేసిన/ తిరస్కరించిన దరఖాస్తుదార్ల జాబితాలను కూడా ఎక్కడా ప్రదర్శించలేదు. గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి వుండగా, గ్రామసభలను నిర్వహించిన దాఖలాలే లేవు. అనుభవం లేకపోవడం వలన మొదట్లో గ్రామసభలను నిర్వహించలేదనీ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థల (డిఆర్‌డిఎల) కింద ఉన్న స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జిలు) ద్వారానూ, సహకార సంఘాల ద్వారానూ లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందనీ ప్రభుత్వం తెలిపింది (2010 అక్టోబరు). కాబట్టి లబ్ధిదారుల ఎంపికలో అన్ని బిపిఎల్ కుటుంబాలకూ అవకాశం కల్పించలేదని స్పష్టమౌతోంది. మచ్చుకు తనిఖీ చేసిన 11 జిల్లాలలోనూ, సంబంధిత సంయుక్త సంచాలకులు (జెడిలు)/ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎమ్‌పిడిఓలు) 2007-08, 2008-09 సంవత్సరాలకు గ్రామసభలను నిర్వహించినట్లు తెలిపే రుజావులేవీ ఆడిటుకు సమర్పించ లేకపోయారు. గ్రామసభలను నిర్వహించలేకపోవడంతో పాటు రికార్డులను కూడా నిర్వహించక పోవడం వలన లబ్ధిదారుల ఎంపికలో నిజాయితీ, పారదర్శకత లోపించాయి.

---

[21] ప్రధానమంత్రి ప్యాకేజీ (పి.ఎమ్.ప్యాకేజీ), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్.కె.వి.వై), ఇంకా రాష్ట్ర పథకమైన ముఖ్యమంత్రి ప్యాకేజీ-(సి.ఎమ్.ప్యాకేజీ) ల కింద అమలవుతోంది.

[22] యూనిట్ ధరలో ఒక పశువుకు సంబంధించి మూల ధర, రవాణాచార్జీలు, ఇన్సూరెన్సు చార్జీలు కలిసి ఉంటాయి.

[23] 2007-09 లో పి.ఎమ్ ప్యాకేజీ : 36,502 పశువులు, (రూ 53.09 కోట్లు); సి.ఎమ్ ప్యాకేజీ : 64,814 పశువులు (రూ86.08 కోట్లు); ఆర్‌కెవివై : 1,442 పశువులు (రూ 1.95 కోట్లు)

[24] ఆదిలాబాదు, తూర్పుగోదావరి, గుంటూరు, కరీంనగర్, ఖమ్మం, మెదక్, నల్గొండ, నిజామాబాద్, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం

**నాణ్యమైన పశువుల సరఫరా**

ఆడిటు ఈ కింది లోటుపాట్లను గమనించింది :

- కొనుగోలు సంఘం[25] పశువులను ఎంపిక చేయడానికి ముందే పశువైద్య నిపుణుల బృందం[26] ద్వారా పశువుల పరిశీలన జరగాలని మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నప్పటికీ, నిపుణుల బృందం పశువులను పరిశీలించిందని తెలిపే నివేదికలేవీ జెడీల వద్ద కానీ వెటరినరీ అసిస్టెంట్ సర్జన్ (విఏఎస్)ల వద్ద కానీ లేవు.
- రేటు కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం, సరఫరాదారు పశువులన్నింటికీ టీకాలు వేయించి అమ్మకం సమయంలో దీనికి సంబంధించిన ధృవపత్రాన్ని సమర్పించాలి. ఐతే, ఏ ఒక్క జిల్లాలోనూ జెడీల వద్ద కానీ, విఏఎస్ లవద్ద కానీ రికార్డుల్లో వేక్సినేషను సర్టిఫికేట్లు లేవు.

పశువుల పరిశీలన, వేక్సినేషనులకు సంబంధించి ధృవీకరణ పొందామని ప్రభుత్వం తెలిపినప్పటికీ (2010 అక్టోబరు), జెడీలు/విఏఎస్‌లు దీనికి సంబంధించిన రుజువులేవీ సమర్పించలేదు.

పశువులను స్వీకరించే స్థలం వద్ద గమనించిన పాల దిగుబడి, పశువులను ప్రదర్శించినప్పటి దిగుబడిలో 25 శాతానికి మించి తక్కువగా ఉన్న పక్షంలో (అంటే రవాణా ఒత్తిడి దృష్ట్యా దిగుబడిలో 25 శాతం వరకూ ఉన్న తగ్గుదలను అంగీకరించవచ్చు) అలాంటి పశువులను తిరస్కరించి వాటి బదులుగా వేరే పశువులను తీసుకోవాలి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన 11 జిల్లాలకు గానూ, మెదక్ జిల్లా మినహా మిగిలిన 10 జిల్లాల్లోనూ పశువులను స్వీకరించేటప్పుడు పాల దిగుబడి వివరాలను నమోదు చేయలేదు. అంతేకాకుండా, తిరస్కరించిన పశువులు, వాటి బదులుగా వేరే పశువులను సరఫరా చేసిన కేసుల వివరాలను జెడీలు/విఏఎస్‌లు కూడా నమోదు చేయలేదు. తిరస్కరించిన పశువుల వివరాలను నిర్వహించలేదని అంగీకరిస్తూ, తక్కువ దిగుబడినిచ్చే పశువులను తిరస్కరించడం, వాటి బదులు వేరే పశువులను సరఫరా చేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది (2010 అక్టోబరు). పశువులను స్వీకరించే చోట పాల దిగుబడికి సంబంధించిన రికార్డులు లేకుండా పశువులను తిరస్కరించడానికీ, వాటి బదులు వేరే పశువులను సరఫరా చేయడానికీ ముందు తక్కువ పాలనిచ్చే పశువులను ఎలా గుర్తించారనే విషయంపై స్పష్టత లేదు.

**చెల్లింపుల నియంత్రణ**

సరఫరా దారులకు చెల్లింపులు జెడీలద్వారా జరుగుతాయి. చెల్లింపులకు సంబంధించి ఆడిటు పరిశీలనలో ఈ క్రింది విషయాలు వెల్లడయ్యాయి.

- చెల్లింపులను చేయడంలో జెడీలు విఏఎస్ లపై ఆధారపడుతున్నారు. చెల్లింపుల నియంత్రణ సక్రమంగా జరగడం లేదు. కనీసం విఏఎస్‌ల ద్వారా జరిగిన పొరపాట్లను[27] కూడా సరిచేయలేదు. జెడీలు చెల్లింపులు చేసే ముందు పూర్తి ఇన్‌వాయిస్ లను తీసుకోకుండా పశువుల వివరాలు, వాటి ధర, తెలుపుతూ విఏఎస్‌లు ఇచ్చిన నివేదికలపైనే ఆధారపడ్డారు.
- విఏఎస్‌లు సమర్పించిన నివేదికల్లో కొన్నింటిని మచ్చుకు తనిఖీ చేయగా వాటిలో వివరాలు తప్పుగా ఉన్నట్లు వెల్లడైంది. మొత్తం 62 పెయ్యదూడలను పరిశీలించగా (విజయనగరం:45, శ్రీకాకుళం:17), రెండేళ్ల లోపు వయసున్న 24 పెయ్య దూడలను (ధర: రూ7,800) రికార్డుల్లో 30 నెలల వయసున్న ముర్రా జాతి పెయ్య దూడలుగా (ధర: రూ14,500) చూపి అధిక ధరలను చెల్లించారు. ముప్పై నెలలు

---

[25] ఇందులో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, బ్యాంకరు, లబ్ధిదారుడు సభ్యులుగా ఉంటారు

[26] పశువైద్యశాస్త్రం (వెటర్నరీ సైన్స్)లో పోస్ట్‌గ్రాడ్యుయేట్లు

[27] చూడు ఆవును దూడతో పాటు ఉన్న ఆవుగా నమోదు చేయడం, గరిష్ఠ ధర కన్నా ఎక్కువ రేట్లతో పశువుల ధరను లెక్కించడం, రేటు కాంట్రాక్టుకి విరుద్ధంగా రవాణా చార్జీలను తప్పుగా గణించడం

లేదా అంతకన్నా ఎక్కువ వయసున్న ముర్రా జాతి పెయ్యలనే కొనుగోలు చేయాలని నిర్ణయించామనీ, జిల్లా అధికారులద్వారా టైపింగు తప్పు /పొరపాటు వల్లనే పెయ్య దూడల వయసు 24 నెలలుగా చూపడం జరిగిందనీ ప్రభుత్వం తెలిపింది (2010 అక్టోబరు). రేటు కాంట్రాక్టులో 24 నెలల వరకూ వయసున్న పెయ్య దూడల కొనుగోలు కూడా ఉంది కాబట్టి ప్రభుత్వ సమాధానం అంగీకార యోగ్యం కాదు.

అదే విధంగా, కరీంనగర్ (12 ఆవులు), శ్రీకాకుళం (32 ఆవులు) జిల్లాల్లో ప్రత్యక్ష తనిఖీ చేసిన 44 చూడు ఆవుల్లో (యూనిట్ ధరః రూ19,500) 16 ఆవులను రికార్డుల్లో దూడతో పాటుగా ఉన్న ఆవులు (ధరః రూ25,200 వరకు)గా చూపి అధిక ధరలు చెల్లించేసారు. ప్రభుత్వం ఈ అధిక చెల్లింపులను అంగీకరిస్తూ, వాటి రికవరీకి చర్యలను చేపట్టామని తెలిపింది (2010 అక్టోబరు).

- చాలా సందర్భాల్లో, వి.ఎ.ఎస్‌లు పశువుల ధరలను లెక్కించేటప్పుడు, రేటు కాంట్రాక్టు (ఆర్.సి.) లో నిర్దేశించిన ధరల కంటే అధిక ధరలను తీసుకున్నారు. జేడీలు కూడా ఆ బిల్లులను ఆర్.సి. రేట్లకు పరిమితం చేయకుండానే చెల్లించేసారు. పదకొండు జిల్లాలకు గాను ఎనిమిది జిల్లాల్లో[28] పశువుల ధరను (మొత్తం 33,911 పశువులకు గాను 4,050 పశువుల విషయంలో) ఆర్.సి. ధరలకు పరిమితం చేయకుండా సరఫరాదార్లకు చేసిన అధిక చెల్లింపులు రూ75.86 లక్షలుగా తేలింది. ఐదు జిల్లాల్లో, పశువుల ధరను మొదట్లోనే తప్పుగా తీసుకుని అధిక ధరలను అనుమతించడం ద్వారా జె.డి.లు సరఫరాదార్లకు రూ70.27 లక్షల[29] అధిక చెల్లింపులు చేసారని ఆడిటు తనిఖీలో వెల్లడైంది. ఈ విషయంపై సమీక్ష జరిపామనీ, అధిక చెల్లింపుల్లో కొంత భాగాన్ని రికవరీ చేసామనీ ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2010 అక్టోబరు). బాధ్యులను గుర్తించి, నిఘా విభాగం ద్వారా క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశామని (2010 ఏప్రిల్) కూడా ప్రభుత్వం పేర్కొంది.

  ఈ సందర్భంగా, ఆరు జిల్లాల్లో[30] 31 మంది లబ్ధిదారులను ఆడిట్ సంప్రదించగా, పాల దిగుబడి, పశువుల వయసుల ఆధారంగా వాటి ధరను లెక్కగట్టే ప్రక్రియ గురించి వారికి తెలియదని ఆడిట్ గమనించింది .

- సరఫరాదార్లతో పశుసంవర్ధక శాఖ సంచాలకులు కుదుర్చుకున్న ఆర్.సి. ప్రకారం, పశువులను కొన్న ప్రదేశం నుండి వాటిని లబ్ధిదారుని గ్రామానికి తీసుకెళ్లేందుకు వాస్తవంగా ప్రయాణించిన దూరాన్ని బట్టి రవాణా చార్జీలను నిర్దేశిత రేట్లలో చెల్లించాలి. వే బిల్లులో వాహనం నంబరు, రవాణా చేసిన తేదీ వంటి కీలక సమాచారం ఉంటుంది కాబట్టి రవాణాకి సంబంధించిన వాస్తవాలను నిర్ధారించుకోవడానికి వే బిల్లు చాలా కీలకమైన పత్రం. ఆర్.సి. ఒప్పందం ప్రకారం, చెల్లింపులను పొందాలంటే సరఫరాదారు తప్పనిసరిగా వే బిల్లులను సమర్పించాలి.

  ఆడిటు తనిఖీ చేసిన జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ రవాణా చార్జీలను చెల్లించడానికి జేడీలు సరఫరాదార్ల నుండి వే బిల్లులను పొందలేదు. పదకొండు జిల్లాలకు గానూ, ఆరు జిల్లాల్లో[31] ప్రయాణ దూరాన్ని తప్పుగా చూపడం, రేట్లను తప్పుగా లెక్కించడం వగైరాల వల్ల రవాణా చార్జీల రూపేణా

---

[28] ఆదిలాబాదు : రూ26.32లక్షలు, తూర్పుగోదావరి : రూ0.67 లక్షలు, గుంటూరు : రూ6.23 లక్షలు, కరీంనగర్ : రూ2.25 లక్షలు, మెదక్ : రూ1.00 లక్ష, నల్గొండ : రూ0.74 లక్ష, విశాఖపట్నం : రూ14.74 లక్షలు, విజయనగరం : రూ 23.91 లక్షలు

[29] ఆదిలాబాదు (రూ37.37 లక్షలు), తూర్పుగోదావరి (రూ1 లక్ష), గుంటూరు (రూ25.50 లక్షలు), కరీంనగర్ (రూ3.71 లక్షలు), మెదక్ (రూ2.69 లక్షలు)

[30] ఆదిలాబాదు, కరీంనగర్, మెదక్, నల్గొండ, శ్రీకాకుళం, విజయనగరం

[31] ఆదిలాబాదు : రూ 3.18.లక్షలు, తూర్పుగోదావరి : రూ 4.13 లక్షలు, కరీంనగర్ : రూ 6.16 లక్షలు, ఖమ్మం : రూ 7.38 లక్షలు, నల్గొండ : రూ 0.69 లక్ష, నిజామాబాద్ : రూ 0.15 లక్ష

రూ21.69 లక్షలు అధికంగా చెల్లించారని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బిల్లుల లెక్కింపులో తప్పులు జరిగాయని ప్రభుత్వం అంగీకరించింది (2010 అక్టోబరు). కేసుల వారీగా అధిక చెల్లింపులను రికవరీ చేయడానికి చర్యలు తీసుకున్నామని కూడా ప్రభుత్వం తెలిపింది. మిగిలిన జిల్లాల్లో, గూగుల్ ఎర్త్ మ్యాపులు మొదలైన వాటి ఆధారంగా ప్రయాణ దూరాలను లెక్కించి చెల్లింపులను సక్రమంగానే చేయడం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు. వే బిల్లులు లేకుండా పశువుల కొనుగోలు, రవాణాలకు సంబంధించిన వాస్తవాలు, పశువులను వాస్తవంగా కొన్న ప్రదేశం, గమ్యస్థానం, పశువులను రైలులో రవాణా చేసారా లేక ట్రక్కులో రవాణా చేసారా వంటి విషయాలను పరిశీలించడం సాధ్యం కాదు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష తనిఖీ చేసి, లబ్ధిదారులకు సరఫరా చేసిన పశువుల వివరాలను రికార్డులలోని వివరాలతో పోల్చిచూడడం ద్వారా కొన్ని కేసులనైనా జేడీలు మచ్చుకు తనిఖీ చేయలేదు.

పైన లేవనెత్తిన ఆడిట్ అభ్యంతరాల్లోని రూ1.68 కోట్ల అధిక చెల్లింపులకు గానూ, రూ43.43 లక్షల అధిక చెల్లింపులను ప్రభుత్వం అంగీకరించింది (2010 అక్టోబరు). ఇందులో రూ38.97 లక్షలను సరఫరాదార్ల నుండి రికవరీ చేసామని కూడా ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా ఆడిట్‌కు ఇచ్చిన సమాధానంలో పశువులకు సంబంధించిన మౌలిక సమాచారాన్ని పశుసంవర్ధక శాఖ మార్చి చూపింది (ప్రాథమిక రికార్డులలో తక్కువ ధర ఉన్న సూడి ఆవులకు బదులుగా ఎక్కువ ధర ఉండే దూడలతో పాటు ఉన్న ఆవులను చూపారు). ఈ శాఖ సంచాలకులు మొదట్లో (2010 నవంబరులో) సమర్పించిన సమాచారం/ వివరాలకు ఇది విరుద్ధంగా ఉంది. కాబట్టి పశుసంవర్ధక శాఖ ఇచ్చిన ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు. ఈ విషయంలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

కాబట్టి, మిగిలిన రూ1.25 కోట్ల అధిక చెల్లింపులను కూడా సరఫరాదార్లనుండి రికవరీ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. పశుసంవర్ధక శాఖ ఇలాంటి కేసులన్నింటినీ సమీక్షించి, ఆడిటు తనిఖీ చేయని మిగతా జిల్లాల్లో కూడా ఏమైనా అధిక చెల్లింపులు జరిగి ఉంటే వాటిని కూడా రికవరీ చేయాలి.

**పశువులకు విశిష్ట గుర్తింపు సంఖ్యలు**

పశువులకు కట్టే ట్యాగులు తీసివేసేందుకు వీలుగా ఉన్నాయి. కాబట్టి, పశువులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వడానికి పశుసంవర్ధక శాఖ అనుసరిస్తున్న పద్ధతిలో మోసాలకు ఆస్కారం ఉంది. దీని ఫలితంగా కొనుగోలు చేసిన పశువులన్నింటినీ మన రాష్ట్రంలోనే పంపిణీ చేయడం జరిగిందనీ, అవి లబ్ధిదార్ల వద్దే ఉన్నాయనీ భరోసా లేదు.

**లబ్ధిదార్లకు రెండో పాడి పశువును సరఫరా చేయడం**

పదకొండు జిల్లాల్లో, 2007-08 లో మొదటి పశువును సరఫరా చేసిన 19,601 మంది లబ్ధిదార్లలో కేవలం 4,824 మందికి (25 శాతం) మాత్రమే రెండో పశువును సరఫరా చేసారని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. లబ్ధిదార్లు ఋణాలను సక్రమంగా తిరిగి చెల్లించక పోవడం వలన వారికి బ్యాంకులు ఋణాలను మంజూరు చేయలేదని జెడీలు తెలిపారు. కాబట్టి లబ్ధిదార్లు నిరంతరం ఆదాయాన్ని ఆర్జించేలా చేయాలన్న లక్ష్యం నెరవేరలేదు. లబ్ధిదారులు మొదటి పశువుకి తీసుకున్న ఋణం వాయిదాలను సక్రమంగా చెల్లించడం, బ్యాంకులు లబ్ధిదార్లకు మళ్లీ ఋణాలను మంజూరు చేయడం పైనే రెండవ పశువును సరఫరా చేసే అంశం ఆధారపడి ఉంటుందని ప్రభుత్వం తెలిపింది (2010 అక్టోబరు). లబ్ధిదార్లు ఋణాలను సక్రమంగా చెల్లించకపోతే వారికి రెండో పశువును సరఫరా చేయడం సాధ్యం కాదని కూడా ప్రభుత్వం తెలిపింది. లబ్ధిదార్లు మొదటి పశువుకోసం తీసుకున్న ఋణాన్ని చెల్లించలేని కారణంగా రెండో పశువును పొందే అవకాశాన్ని వినియోగించుకో లేకపోవడంతో లబ్ధిదార్లు నిరంతరం ఆదాయాన్ని ఆర్జించాలనే లక్ష్యం నెరవేరలేదు. ఈ పథకం కొంతమేరకు మాత్రమే సఫలమయ్యిందన్న విషయాన్ని ఇది సూచిస్తోంది.

**పశుసంవర్ధక శాఖలో పేలవమైన పర్యవేక్షణ**

పశువులను సరఫరా చేసిన అనంతరం పథకం అమలును పర్యవేక్షిస్తే పాడిపరిశ్రమను వృత్తిగా చేసుకున్న లబ్ధిదార్ల ఆర్థిక స్థితి మెరుగయ్యిందా, లేక వారు పశువులను అమ్మేసారా అనే విషయం తెలిసేది. ఐతే, ఆలాంటి చర్యలు చేపట్టారని తెలిపే సమాచారమేదీ జెడీల వద్ద కానీ, సంచాలకుల వద్దకానీ లేదు. పంపిణీ చేసిన పశువుల పాల దిగుబడికి సంబంధించిన రికార్డులను కూడా చాలామంది వి.ఎ.ఎస్. లు నిర్వహించడం లేదు. అంతేకాకుండా, జిల్లా స్థాయి లేదా మండల స్థాయి కమిటీలు ఈ పథకం అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది. ఐతే, ఈ కమిటీలు సమావేశమయినట్లు తెలిపే రికార్డులేవీ జెడీలు సమర్పించ లేకపోయారు.

లోపాలకు ఆస్కారం లేకుండా, ఈ పథకాన్ని అమలు చేయడానికి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులను ఆదేశించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 అక్టోబరు). సరఫరాదార్లకు చేసిన అధిక చెల్లింపులకు బాధ్యులైన సిబ్బందిని గుర్తించి వారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని సంచాలకులను ఆదేశించామని కూడా ప్రభుత్వం తెలిపింది.

**ప్రణాళిక శాఖ**

### 3.3.2 పార్లమెంటు సభ్యుని స్థానిక ప్రాంత ఆభివృద్ధి పథకం

**పార్లమెంటు సభ్యుని స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం అమల్లో పనులు పూర్తిగాకపోవడం, అనర్హమైన పనులను చేపట్టడం, యూజర్ ఏజన్సీలకు ఆస్తులను బదిలీచేయకపోవడం, పూర్తైన పనులకు సంబంధించి మిగులు నిధులను జమచేయకపోవడం మొదలైన రూ48.92 కోట్ల మొత్తంతో ముడిపడి ఉన్న అవకతవకల వలన ఆశించిన ప్రయోజనాలు చాలావరకు ప్రజలకు అందకుండా పోయాయి.**

**ఉపోద్ఘాతం**

పార్లమెంటు సభ్యులు తమ నియోజక వర్గాల్లోని స్థానిక ఆవసరాల మేరకు త్రాగునీరు, ప్రాథమికవిద్య, ప్రజారోగ్యం, పారిశుధ్యం, రోడ్ల వంటి జాతీయ ప్రాధాన్యత కల్గి, ధీర్ఘకాలం ఉపయోగంలో ఉండే ఆస్తుల కల్పన కోసం పనులను సిఫార్సు చేసేందుకు గాను పార్లమెంటు సభ్యుని స్థానిక ప్రాంత ఆభివృది పథకం (ఎమ్.పి.లాడ్స్) ను రూపొందించడమైంది. ఈ పథకానికి నిధులను పూర్తిగా కేంద్రప్రభుత్వమే సమకూరుస్తుంది. ఈ పథకానికి జిల్లాస్థాయిలో, జిల్లా కలెక్టరు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఈ పథకం కింద పనులను జిల్లాగ్రామీణాభివృద్ధి సంస్థలు (డి.ఆర్.డి.ఎ.లు), జిల్లా నీటి నిర్వహణ సంస్థలు (డ్వామాలు), జిల్లా ముఖ్య ప్రణాళిక ఆధికారులు (సి.పి.ఒ.లు) నిర్వహిస్తారు.

రాష్ట్రంలోని 17 జిల్లాలకు సంబంధించి ఎమ్.పి.లాడ్స్ పై ఆడిటు పరిశీలనలను గత మూడేళ్ల కాగ్ నివేదికల్లో పొందుపర్చడం జరిగింది. ప్రస్తుత సమీక్షలో మిగిలిన ఆరు[32] జిల్లాల్లో (పార్లమెంటు సభ్యుల సంఖ్య[33] : 20, ఇందులో లోక్‌సభ సభ్యులు :11 మంది; రాజ్యసభ సభ్యులు : 9 మంది) ఈ పథకం అమలుపై

[32] అనంతపురం, హైదరాబాద్, కర్నూలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం, వై.ఎస్.ఆర్

[33] **లోక్‌సభ :** అనంతపురం జిల్లా : అనంతపురం, హిందూపురం; హైదరాబాద్ జిల్లా : హైదరాబాద్, సికింద్రాబాద్; కర్నూలు జిల్లా : కర్నూలు; నంధ్యాల; శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా : నెల్లూరు; శ్రీకాకుళం జిల్లా : శ్రీకాకుళం, పార్వతీపురం; వై.ఎస్.ఆర్. జిల్లా : కడప, రాజంపేట. **రాజ్యసభ :** హైదరాబాద్ జిల్లా (ఆరుగురు ఎమ్.పి.లు), వై.ఎస్.ఆర్. జిల్లా (ముగ్గురు ఎమ్.పి.లు) - (ఇందులో 2004-05 సంవత్సరానికి గాను ఒక ఎమ్.పి. కి సంబంధించి నిధుల విడుదల, ఖర్చుల సమాచారం లేదు.)

ఆడిటు పరిశీలనలున్నాయి. 2004-05 నుండి 2009-10 మధ్యకాలానికి సంబంధించి నలుగురు ముఖ్య ప్రణాళికాధికార్లు (సి.పి.ఒ.లు), ఇద్దరు డ్వామా (డి.డబ్ల్యూ.ఎమ్.ఎ.) ప్రాజెక్టు డైరక్టర్ల రికార్డులను మచ్చుకు తనిఖీ చేయడమైంది (ఆగస్టు - అక్టోబరు, 2009 మరియు అక్టోబరు 2010). 2004-05 నుండి 2009-10 మధ్యకాలంలో ఈ ఆరు జిల్లాల్లో రూ180.00 కోట్ల నిధులు ఈ పథకం కింద విడుదల కాగా, రూ159.87 కోట్లు ఖర్చు అయింది. ఈ కింది విషయాలు ఆడిటు పరిశీలనలో వెల్లడయ్యాయి.

**ఆడిటు కనుగొన్న విషయాలు :**

గతంలో 2001-02 నుంచి 2008-09 సంవత్సరాలకు నిర్వహించిన ఆడిటు సమీక్షలలో పథకం అమలులో ప్రధానంగా ఈ దిగువ లోపాలు వెలుగులోకొచ్చాయి:

(i) ఎమ్.పి.లు సిఫార్సు చేసిన పనులను అసంపూర్తి గా వదిలెయ్యడం లేదా అసలు చేపట్టకపోవడం జరిగింది.

(ii) నిధులను పూర్తి మొత్తంలో ఖర్చు చేయకపోవడం వలన పథకం కింద ఆశించిన పూర్తి ప్రయోజనాలను పొందలేదు.

(iii) నిర్వహణ సంస్థలు పథకం నిధులను అనవసరమైన పనులు/అంశాలపై ఖర్చు చేసాయి.

(iv) ఎమ్.పి.లాడ్స్ నిధులను పరిపాలనా ఖర్చులకు, ఇతర పథకాలకు మళ్లించారు.

(v) పథకం మార్గదర్శకాలకు విరుద్ధంగా, జిల్లా అధికార్లు/నిర్వాహక సంస్థలు ఎమ్.పి.లాడ్స్ నిధులను ప్రైవేటు బ్యాంకుల్లో, ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉంచారు. ఫలితంగా పనులను త్వరితంగా చేయాలనే లక్ష్యం నెరవేరలేదు.

(vi) పథకం మార్గదర్శకాలకు విరుద్ధంగా, జిల్లా అధికార్లు ట్రస్టులకు నిర్దేశిత పరిమితులకు మించి ఎమ్.పి.లాడ్స్ నిధులను విడుదల చేసారు.

(vii) పూర్తైన పనులకు సంబంధించిన మిగులు నిధులను నిర్వాహక సంస్థల నుంచి రాబట్టటంలో జిల్లా అధికార్లు విఫలమయ్యారు.

(viii) నిర్వాహక సంస్థలు, జిల్లా అధికార్లకు వినియోగ ధృవపత్రాలను సక్రమంగా సమర్పించలేదు.

(ix) జిల్లా అధికార్లు ఆస్తుల రిజిస్టర్లను నిర్వహించడం లేదు. ఈ పథకం కింద చేపట్టిన నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఆస్తులను వినియోగ సంస్థలు/లబ్ధిదారులకు బదిలీ చేసారని చూపే ఏ రికార్డునూ జిల్లా అధికార్లు నిర్వహించడం లేదు.

(x) నిర్వాహక సంస్థలు టెండర్లను పిలవకుండా నామినేషన్ పద్ధతిలోనే పనులను కట్టబెట్టారు.

(xi) జిల్లా అధికార్లు , సంబంధిత ఇతర అధికార్లు పథకం కింద చేపట్టిన పనులను తనిఖీచేయడం లేదు.

(xii) పదవీ విరమణ పొందిన రాజ్యసభ సభ్యులకు సంబంధించి ఖర్చుకాకుండా మిగిలిన నిధులను పథకం మార్గదర్శకాల ప్రకారం వారి స్థానంలో వచ్చిన ఎమ్.పి.లకు బదిలీ చేయాల్సి ఉండగా, ఈ నిబంధనను పాటించలేదు.

ఈ లోటుపాట్లను పూర్తిగా సరిదిద్దలేదని, ఇవి కొనసాగుతూనే ఉన్నాయనీ ప్రస్తుత సమీక్షలో తేలింది. వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

| సైడ్ నోట్ | అంశం | వివరణ |
|---|---|---|
| పనులను పూర్తి చేయడంలో 20 శాతం లోటు ఉంది (అంచనా విలువ : రూ47.94 కోట్లు) | పూర్తికాని పనులు | మార్గదర్శకాల్లోని పేరా 3.13 ప్రకారం, ఈ పథకం కింద చేపట్టిన పనులను సాధారణంగా ఏడాదిలోపు పూర్తి చేయాలి. ఐతే, ఈ ఆరు జిల్లాల్లో 2004-05 నుండి 2008-09 మధ్యకాలంలో 10,211 పనులు మంజూరు కాగా (అంచనా విలువ రూ166.53 కోట్లు), కేవలం 8,202 పనులు (అంచనా విలువ: రూ118.59 కోట్లు) మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 2009 పనులు (20 శాతం) (అంచనా విలువ : రూ47.94 కోట్లు) (వీటిలో 186 పనులు ఐదేళ్ల క్రితం చేపట్టినవి)ఇంకాపూర్తికాలేదు. వివరాలు ***అనుబంధం - 3.3*** లో ఉన్నాయి. అంతేకాకుండా, 2004-05 నుండి 2008-09 మధ్య మంజూరైన 247 పనులు[34] (అంచనా విలువ: రూ3.78 కోట్లు; విడుదల రూ1.15 కోట్లు) అక్టోబరు 2010 నాటికి కనీసం ప్రారంభం కూడా కాలేదు. ఫలితంగా నిర్వాహక సంస్థల వద్ద నిధులు నిరుపయోగంగా పడి ఉండటంలో అర్థం లేదు.<br><br>పనులను వెంటనే పూర్తిచేసేలా నిర్వాహక సంస్థలను సంప్రదిస్తామని హైదరాబాద్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సి.పి.ఒ.లు, కర్నూలు డ్వామా పి.డి. తెలిపారు (2010 అక్టోబరు). |
| పనులను 45 రోజుల్లోపు మంజూరు చేయాల్సి ఉండగా, అత్యధికంగా 36 నెలల అసాధారణ జాప్యం జరిగింది | పనులను మంజూరు చేయడం/ ప్రారంభించడంలో ఆలస్యం | పథకం మార్గదర్శకాల ప్రకారం, పనులను చేపట్టేందుకు అవసరమైన మంజూరీలను సాధ్యమైనంత వరకూ సంబంధిత ఎమ్.పి. ప్రతిపాదన అందిన నాటి నుండి 45 రోజుల్లోపు చేయాలి. మచ్చుకు తనిఖీ చేసిన అన్ని జిల్లాల్లోనూ (వై.ఎస్.ఆర్.జిల్లాలో తప్ప) 2,734 పనుల[35] విషయంలో (2004-10) సంబంధిత ఎమ్.పి. సిఫార్సు చేసిన తర్వాత, వాటి మంజూరీలో జాప్యం జరిగింది. ఇందులో, అత్యధికంగా జరిగిన జాప్యం 36 నెలలు.<br><br>నిర్వాహక సంస్థలు అంచనాలను తయారుచేయడంలో జాప్యం చేయడం వలనే పనుల మంజూరీలో ఆలస్యం జరుగుతోందని అనంతపురం, కర్నూలు జిల్లాల పి.డి.లు తెలిపారు (2010 అక్టోబరు). రాజ్యసభ సభ్యులు సిఫార్సు చేసిన పనుల విషయంలో, పనులు జరుగుతున్న జిల్లాల్లో సంబంధిత జిల్లా అధికార్ల మంజూరీలో జాప్యం జరుగుతోందని నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న హైదరాబాద్ జిల్లా సి.పి.ఒ. తెలిపారు (2010 అక్టోబరు). ప్రతిపాదించిన పనులు ఏడాదిలోపు పూర్తవ్వాలి. కాబట్టి, పనులను త్వరగా ప్రారంభించాలంటే అంచనాలను త్వరితంగా రూపొందించేలా నిర్వాహక సంస్థలతో సమన్వయం అవసరం. |

[34] హైదరాబాద్ 38 పనులు (అంచనా విలువ : రూ1.23 కోట్లు/ విడుదల : రూ0.79 కోట్లు); కర్నూలు : 29 పనులు (అంచనా విలువ : రూ0.43 కోట్లు/విడుదల : రూ0.21 కోట్లు); శ్రీపొట్టిశ్రీరాములునెల్లూరు 16 పనులు (అంచనా విలువ : రూ0.25 కోట్లు/విడుదల : రూ0.13 కోట్లు); వై.ఎస్.ఆర్. : 164 పనులు (అంచనా విలువ : రూ1.87 కోట్లు/ విడుదల : రూ0.02 కోట్లు)

[35] అనంతపురం 971: హైదరాబాద్ 165; కర్నూలు 511: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు 69; శ్రీకాకుళం 1018

అనర్హమైన 38 పనులను (అంచనా విలువ: రూ42.04 లక్షలు) మంజూరు చేసారు

| | |
|---|---|
| **అనర్హమైన పనులను చేపట్టడం** | మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాలకు గాను, ఐదు జిల్లాల్లో పథకం కింద నిషిద్ధమైన రోడ్ల మరమ్మత్తులు, కార్యాలయ భవనాల నిర్మాణం, స్థలాలను చదునుచేయడం వంటి 38 పనులను[36] 2004-05 నుండి 2009-10 మధ్య కాలంలో మంజూరు చేయడం జరిగింది. (*అనుబంధం - 3.4*). వీటి అంచనా విలువ రూ42.04 లక్షలు; విడుదల చేసినది రూ34.79 లక్షలు.<br><br>ఎమ్.పి.లు ప్రతిపాదించినందువలనే ఆ పనులను చేపట్టామని అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, వై.ఎస్.ఆర్. జిల్లాల అధికార్లు తెలిపారు (అక్టోబరు-2009, అక్టోబరు-2010). ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా చూసేందుకు ఈ పనులను చేపట్టామని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా అధికారి తెలిపారు (2009-అక్టోబరు). ఐతే, మంజూరీలనిచ్చేప్పుడు మార్గదర్శకాలను పాటించాల్సిన బాధ్యత సి.పి.ఒ.లు/పి.డి. లదే. |
| **వినియోగం కాకుండా ఉన్న నిధులను, వడ్డీని జమచేయకపోవడం** | మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాలకు గాను, మూడు జిల్లాల్లో, ఈ పథకం కింద పనులను నిర్వహిస్తున్న సంస్థల వద్ద పూర్తయిన పనులకు సంబంధించి ఖర్చుకాకుండా మిగిలిన రూ0.63 కోట్ల నిధులను ( హైదరాబాద్ రూ0.16 కోటి; కర్నూలు రూ0.05 కోటి[37]; శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రూ0.42 కోటి), ఆ నిధులపై వచ్చిన వడ్డీని ఆ సంస్థల వద్ద నుండి తిరిగిపొందడంలో జిల్లా అధికార్లు విఫలమయ్యారు (2010 సెప్టెంబరు).<br><br>ఖర్చుకాకుండా ఉన్న మిగుళ్లనూ, వాటిపై వచ్చిన వడ్డీతోసహా వాపసు చేయాల్సిందిగా నిర్వాహక సంస్థలను కోరతామని హైదరాబాద్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సి.పి.ఒ.లు, కర్నూలు జిల్లా డ్వామా పి.డి. తెలిపారు (2010 అక్టోబరు). |
| **ఎమ్.పి.లాడ్స్ నిధులను ప్రైవేటు బ్యాంకుల్లో ఉంచడం** | మార్గదర్శకాల ప్రకారం, ఎమ్.పి. లాడ్స్ నిధులను భారత ప్రభుత్వం నుండి పొందిన జిల్లా అధికార్లు, జిల్లా అధికార్ల నుండి ఆ నిధులను పొందిన నిర్వాహక సంస్థలు వాటిని జాతీయబ్యాంకుల్లో మాత్రమే ఉంచాలి. ఐతే, ఇందుకు విరుద్ధంగా, అనంతపురం జిల్లాలోని ఒక నిర్వాహక సంస్థ ఈ నిధులను ప్రైవేటు బ్యాంకులో పెట్టింది. 2010 సెప్టెంబరు నాటికి ప్రైవేటు బ్యాంకు ఖాతాలో రూ64 లక్షలు ఉన్నాయి.<br><br>ప్రైవేటు బ్యాంకు నుండి ఆ నిధులను తీసివేసి జాతీయ బ్యాంకుల్లో జమ చేయాలని నిర్వాహక సంస్థను కోరతామని అనంతపురం డ్వామా పి.డి. తెలిపారు (2010 అక్టోబరు). |

[36] అనంతపురం : ఒక పని (రూ2.00 లక్షలు/రూ1.00 లక్ష); వై.ఎస్.ఆర్. : 28 పనులు (రూ21.99 లక్షలు/రూ19.59 లక్షలు); కర్నూలు : ఒకపని (రూ2.00 లక్షలు/రూ1.00 లక్ష ); శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు : 5 పనులు (రూ9 లక్షలు/ రూ7.75 లక్షలు); శ్రీకాకుళం : 3 పనులు (రూ7.05 లక్షలు/రూ5.45 లక్షలు)

[37] రూ1.90 లక్షల వడ్డీతో కలిపి

ఆస్తులకూ, పనులకూ సంబంధించిన రిజిస్టర్లనూ, ఎలక్ట్రానిక్ డేటాబేస్ నూ పూర్తిస్థాయిలో నిర్వహించేలా చూడడంలో జిల్లా అధికార్లు విఫలమయ్యారు

| | |
|---|---|
| **రికార్డులనూ, రిజిస్టర్లనూ సక్రమంగా నిర్వహించకపోవడం/అసలే నిర్వహించకపోవడం; వినియోగ సంస్థలకు బదిలీచేయకపోవడం** | మార్గదర్శకాల ప్రకారం, జిల్లా అధికార్లు, నిర్వాహక సంస్థలు, పనుల రిజిస్టరు, ఆస్తుల రిజిస్టరు వంటి వివిధ రిజిస్టర్లు, ఫారమ్ లను నిర్దేశిత నమూనాలో నిర్వహించాలి. పని పూర్తయిన తర్వాత ఆస్తుల వివరాలు, వినియోగ సంస్థలకు వాటిని బదిలీచేసిన వివరాలనూ తప్పనిసరిగా ఆస్తుల రిజిస్టర్లో నమోదు చేయాలి. ఆడిటు పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :<br><br>• మచ్చుకు తనిఖీ చేసిన అన్ని జిల్లాల్లోనూ (అనంతపురం జిల్లాలో తప్ప), ఎమ్.పి.ల నుండి వచ్చిన సిఫార్సుల వివరాలతో కూడిన జాబితా లేదా ఒక సాధారణ రిజిస్టర్ మాత్రమే జిల్లా అధికార్లు నిర్వహిస్తున్నారు. రెండవసారి, ఆ తర్వాతసారి విడుదల చేసిన నిధుల వివరాలు గానీ, వినియోగ ధృవపత్రాలు, ప్రగతి నివేదికలు, పనులు పూర్తయ్యాయని తెలిపే నివేదికల వివరాలు గానీ ఆ రిజిస్టర్లలో లేవు. రిజిస్టర్లలో ఆ వివరాలను నమోదు చేసేందుకు వీలుగా కాలమ్‌లు లేవు. రిజిస్టర్ల నమూనాలోని ఈ లోపమే మార్గదర్శకాల మేరకు వివరాలను నమోదుచేయకపోవడానికి ప్రధాన కారణం. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల అధికార్లు ఈ లోపాన్ని అంగీకరించారు (2009 అక్టోబరు).<br><br>• హైదరాబాద్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో తప్ప మచ్చుకు తనిఖీ చేసిన అన్ని జిల్లాల్లోనూ సి.పి.ఒ.లు/పి.డి.లు ఆస్తుల రిజిస్టర్ ను నిర్వహించడం లేదు. ఆస్తులను వినియోగసంస్థలకు బదిలీ చేసినట్లు చూపే రికార్డు ఏదీ లేకపోవడంతో వారికి ఆస్తుల బదిలీ జరిగిందనే భరోసా లేదు. ఈ నాలుగు జిల్లాల్లో, 2004-05 నుండి 2008-09 మధ్యకాలంలో రూ87.74 కోట్ల విలువైన 7040 పనులు పూర్తయ్యాయి. అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల అధికార్లు జరిగిన లోపాన్ని అంగీకరించారు (2009 ఆగష్టు/సెప్టెంబరు).<br><br>హైదరాబాద్ జిల్లాలో, 2004-09 మధ్యకాలంలో 582 పనులు పూర్తయ్యాయి (అంచనా విలువ రూ21 కోట్లు). వివిధ రిజిస్టర్లను నిర్వహించడానికి బదులు డేటాను కంప్యూటరీకరించడం జరిగిందని హైదరాబాద్ సి.పి.ఒ. తెలిపారు. ఐతే, ఆస్తిని బదిలీచేసిన వివరాలు, నిర్మాణస్థలాన్ని/ఆస్తిని పత్యక్ష తనిఖీ చేసిన తేదీ, నిర్వాహక సంస్థలు వాపసు చేసిన మిగులు నిధుల వివరాలు, వినియోగ ధృవపత్రాలను సమర్పించిన తేదీ మొదలైన సమాచారం ప్రస్తుతం నిర్వహిస్తున్న డేటాబేస్ లో నమోదు కావడంలేదు. ఆవిధంగా, ప్రస్తుతం నిర్వహిస్తున్న డేటాబేస్, అవసరమైన నివేదికలు/సమాచారాన్ని పొందడానికి అనుకూలంగాలేదు కాబట్టి, అసంపూర్తిగా ఉన్న ఈ డేటాబేస్ భౌతికంగా నిర్వహించే పనుల రిజిస్టర్/ఆస్తుల రిజిస్టర్లకు సరియైన ప్రత్యామ్నాయం కాదు.<br><br>రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనప్పుడు పథకం అమలును ప్రతిభావంతంగా పర్యవేక్షించే వీలులేదు. కాబట్టి, ఈ పథకం కింద ఏర్పాటైన ఆస్తుల పరిశీలన సాధ్యంకాదు. దీనివలన ఇతర పథకాల కింద మంజూరైన/చేపట్టిన పనులనే మళ్లీ ఎమ్.పి.లాడ్స్ కింద చేపట్టే ప్రమాదం లేకపోలేదు. |

నిర్వాహక సంస్థలతో ఖచ్చితత్వాన్ని నిర్ధారించుకోకుండా నెలవారీ ప్రగతి నివేదికల ద్వారా భారత ప్రభుత్వానికి సమాచారాన్ని పంపారు. ఫలితంగా పూర్తైన పనులకు సంబంధించి తెలిపిన సమాచారం సరైంది కాదు

**నెలవారీ ప్రగతి నివేదికలు**

మార్గదర్శకాల ప్రకారం సిఫార్సుచేసిన, మంజూరైన, పూర్తయిన, పూర్తికాని పనులు, చేసిన ఖర్చు, మిగిలిన నిధులు వంటి వివరాలను జిల్లా అధికార్లు భారత ప్రభుత్వానికి నెలవారీ ప్రగతి నివేదికల ద్వారా తెలియజేయాలి. ఈ సమాచార ఖచ్చితత్వాన్ని నిర్వాహక సంస్థలతో నిర్ధారించుకున్న తర్వాతే పంపాలి. ఈ కింది విషయాలు ఆడిటుపరిశీలనలో వెల్లడయ్యాయి :

- జిల్లా అధికారులు నిర్వాహక సంస్థలతో సమాచారాన్ని నిర్ధారించుకోకుండానే నెలవారీ ప్రగతి నివేదికలను (ఎమ్.పి.ఆర్.లు) భారత ప్రభుత్వానికి పంపారు. **పట్టిక-2** లో చూపిన విధంగా, వీటిలో తప్పులున్నాయి.

**పట్టిక-2**

| జిల్లా పేరు | పూర్తయిన పనులు | | పూర్తికాని పనులు | |
|---|---|---|---|---|
| | రికార్డుల ప్రకారం | ఎమ్.పి.ఆర్. లలో చూపిన ప్రకారం | రికార్డుల ప్రకారం | ఎమ్.పి.ఆర్. లలో చూపిన ప్రకారం |
| హైదరాబాద్ | 582 | 1202 | 1016 | 185 |
| వై.ఎస్.ఆర్. | 2561 | 2708 | 663 | 438 |
| కర్నూలు | 913 | 883 | 272 | 142 |
| శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు | 580 | 577 | 40 | 43 |

- అదేవిధంగా, 2004-09 మధ్యకాలంలో పూర్తయిన పనులపై చేసిన ఖర్చును కూడా **పట్టిక-3** లో చూపిన విధంగా, జిల్లా అధికార్లు తప్పుగా చూపారు.

**పట్టిక-3** (రూపాయలు కోట్లలో)

| జిల్లా పేరు | రికార్డుల ప్రకారం | ఎమ్.పి.ఆర్.లలో చూపిన ప్రకారం |
|---|---|---|
| అనంతపురం | 21.72 | 28.74 |
| హైదరాబాద్ | 20.33 | 31.84 |
| వై.ఎస్.ఆర్ | 23.61 | 29.23 |
| శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు | 9.48 | 10.42 |
| శ్రీకాకుళం | 19.13 | 19.93 |

హైదరాబాద్ సి.పి.ఒ., ఆడిటు పరిశీలనలను అంగీకరిస్తూ, నిర్వాహక సంస్థలు చేపట్టిన పనులను గురించి తమకు సరిగా సమాచారం ఇవ్వరని తెలిపారు (2009 అక్టోబరు). మార్గదర్శకాల ప్రకారం భారత ప్రభుత్వానికి ఎమ్.పి.ఆర్.ల ద్వారా సమాచారం ఇచ్చే ముందే నిర్వాహక సంస్థలు పూర్తి సమాచారాన్నీ, ఖచ్చితమైన సమాచారాన్నీ ఇచ్చారని నిర్ధారించుకునే బాధ్యత సి.పి.ఒ.దే కాబట్టి, నిర్వాహక సంస్థలు సమాచారం సరిగా ఇవ్వరని సి.పి.ఒ. చేస్తున్న వాదన అంగీకారయోగ్యం కాదు. ఈ విషయంలో సి.పి.ఒ. వైఫల్యం, అంతిమంగా భారతప్రభుత్వానికి సమర్పించిన ఎమ్.పి.ఆర్.లలోని సమాచారాన్ని ప్రభావితం

| | | |
|---|---|---|
| మచ్చుకు తనిఖీచేసిన ఆరు జిల్లాలకు గాను మూడు జిల్లాల్లో పథకానికి సంబంధించిన సమాచారాన్ని వెబ్‌సైట్లో పెట్టకపోవడం వలన ప్రజలకు ఆ సమాచారం అందుబాటులో లేదు | **పథకానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం** | పథకం మార్గదర్శకాల ప్రకారం, సిఫార్సుచేసిన/మంజూరు చేసిన పనుల జాబితా/వాటి నిర్మాణ స్థితి, నిర్మించిన ఆస్తులను వినియోగ సంస్థలకు బదిలీ చేయడం మొదలైన సమాచారాన్ని జిల్లా అధికార్లు వారి కార్యాలయం వద్ద ప్రదర్శించాలి; ఇంకా సాధారణ ప్రజల సమాచారం కోసం ఈ వివరాలను వెబ్ సైట్ లో పెట్టాలి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (అనంతపురంలో తప్ప) పథకంకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు ప్రదర్శించడంలేదు. హైదరాబాద్, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో పథకంకి సంబంధించిన వెబ్ సైట్ లో సంబంధిత సమాచారం ఉంచలేదు.<br><br>ప్రజల పరిశీలనకోసం పనుల రిజిస్టర్లను తమ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని వై.ఎస్.ఆర్. జిల్లా సి.పి.ఒ. తెలిపారు (2010 అక్టోబరు). మార్గదర్శకాల ప్రకారం ఎమ్.పి.లాడ్స్ సమాచారాన్ని కార్యాలయ ప్రాంగణంలో ప్రదర్శనకు పెట్టాలి, కాబట్టి ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు.<br><br>హైదరాబాద్ జిల్లాకు సంబంధించి, పథకం సమాచారాన్ని వెబ్ సైట్లో ఉంచే ప్రక్రియ కొనసాగుతోందని సి.పి.ఒ. తెలిపారు (2010 అక్టోబరు). |
| పథకం నిధులకు సంబంధించి అంతర్గత తనిఖీని నిర్వహించలేదు | **ఇతర ఆసక్తికర అంశాలు** | (i) మార్గదర్శకాల ప్రకారం, రీకన్సీలియేషన్ చేయాల్సి ఉండగా, మచ్చుకు తనిఖీ చేసిన ఆరు జిల్లాలకుగాను, శ్రీకాకుళం జిల్లాలో పథకం నిధులకు సంబంధించి బ్యాంకు ఖాతాలతో నగదు పుస్తకాల రీకన్సిలియేషన్ నిర్వహించకపోవడం/సక్రమంగా నిర్వహించక పోవడం జరిగింది. కాబట్టి బ్యాంకులు తెలిపిన నిల్వల ఖచ్చితత్వం పై భరోసా లేదు.<br><br>(ii) పథకం పద్దులను చార్టర్డ్ అకౌంటెంట్లతో ఆడిటు చేయించాలని మార్గదర్శకాల్లో నిర్దేశించినప్పటికీ, వై.ఎస్.ఆర్. జిల్లాలో 2004-05 నుండి, శ్రీకాకుళం జిల్లాలో 2007-08 నుండి అలా చేయలేదు.<br><br>(iii) మచ్చుకు తనిఖీ చేసిన అన్ని జిల్లాల్లోనూ, పథకం నిధులకు సంబంధించిన పద్దులకు అంతర్గత తనిఖీని నిర్వహించడంలేదు. |
| రాష్ట్రస్థాయిలోనూ, జిల్లాస్థాయిలోనూ పర్యవేక్షణ చాలినంతగా లేదు | **చాలినంతగా లేని పర్యవేక్షణ** | నిర్మాణంలో ఉన్న పనుల్లో 10 శాతం పనుల్ని ప్రతిఏటా జిల్లా అధికారి సందర్శించి, తనిఖీ చేయాలని మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నాయి. ఐతే, జిల్లా అధికార్లు (అనంతపురం, కర్నూలు జిల్లాల్లోతప్ప) పనుల ప్రత్యక్ష తనిఖీ/పరిశీలనను చేయలేదు. కాబట్టి, ఈ జిల్లాల్లో సి.పి.ఒ.లు/పి.డి.ల ద్వారా పర్యవేక్షణ పేలవంగా ఉంది. ఫలితంగా, పనులు సక్రమంగానే జరిగాయనే భరోసాలేదు. పథకం పర్యవేక్షణలో భాగంగా, రాష్ట్రస్థాయి అధికారి (ఉపకార్యదర్శి/కార్యనిర్వాహక ఇంజినీరు ర్యాంకుకు తక్కువకాని అధికారి) కూడా, క్షేత్రస్థాయిలో అధికారికంగా పర్యటించేటప్పుడు పనులను తనిఖీ చేయాల్సి ఉంది. ఐతే, ఈ రాష్ట్రస్థాయి అధికార్లు ఈ నిర్దేశాన్ని పాటించలేదు. ఉపకార్యదర్శి/ఎమ్.పి.లాడ్స్ సంచాలకులకు క్షేత్రస్థాయిలో పర్యటించడానికి అధికారమివ్వడమైందని డిపార్టుమెంటు సమాధానమిచ్చింది (2010 నవంబరు). |

| | |
|---|---|
| | పనుల నిర్వహణను పర్యవేక్షించేందుకుగాను, మార్గదర్శకాల ప్రకారం, జిల్లా అధికార్లు నిర్వాహక సంస్థలతో నియమిత కాలాల్లో సమీక్షలు నిర్వహించాలి. ఈ సమీక్షలకు సంబంధిత పార్లమెంటు సభ్యులను కూడా ఆహ్వానించాలి. కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ విధమైన సమీక్షా సమావేశాలను నిర్వహించలేదు. రాష్ట్రస్థాయిలో కూడా పథకం అమలునూ, ప్రగతినీ జిల్లా అధికార్లు, ఎమ్.పి.లతో సమీక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీ ఏడాదికి కనీసం ఒకసారైనా సమావేశం కావలసి ఉండగా, 2008 లో ఈ కమిటీ ఏర్పాటైన నాటి నుండీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. |

**సారాంశం**

2004-09 మధ్యగల ఐదేళ్ల కాలంలో చేపట్టిన పనుల్లో 2010 సెప్టెంబరు నాటికి, 20 శాతం పనులు పూర్తి కాకుండా ఉన్నాయి. సంబంధిత ఎమ్.పి.లు సిఫార్సుచేసిన తర్వాత, వాటి మంజూరీకి 36 నెలల వరకూ అసాధారణ జాప్యం జరిగింది. పనులకు సంబంధించి, జిల్లా అధికార్లు నిర్వహిస్తున్న డేటాబేస్ అసంపూర్తిగా ఉంది. అనర్హమైన పనులను మంజూరీచేయడం, పనుల స్థితికి సంబంధించి భారత ప్రభుత్వానికి సమర్పించిన నెలవారీ ప్రగతి నివేదికల్లో వ్యత్యాసాలుండటం, జిల్లా అధికార్లుకానీ, రాష్ట్ర అధికార్లుకానీ పనులను ప్రత్యక్ష తనిఖీ చేయకపోవడం, ఏ జిల్లాలోనూ పనుల రిజిస్టర్, ఆస్తుల రిజిస్టర్లను పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడం వంటివి ఆడిటు తనిఖీలో వెల్లడయ్యాయి. పనుల నిర్వహణపై పర్యవేక్షణ తగినంతగా లేదు. పథకం నిధులకు సంబంధించి అంతర్గత తనిఖీని నిర్వహించడంలేదు. కాబట్టి ఈ పథకం అమల్లో, నిర్వాహక సంస్థలు నియమాలనూ, పద్ధతులనూ పాటిస్తున్నారనే భరోసా లేదు.

పై అంశాలను 2010 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి తెలియజేయడమైంది (2010 ఏప్రిల్ లో మరొకసారి గుర్తు చేయడం జరిగింది). సమాధానం ఇంకా రాలేదు (2010 నవంబరు).

## పాఠశాల విద్యా శాఖ

### 3.3.3 పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు

**ఎంపిక చేసుకున్న బడుల పనితీరును ఆడిటు తనిఖీ చేయగా తరగతి గదులు, గ్రంథాలయ గదులు, ప్రయోగశాలల ఏర్పాటులో కొరత, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, మరుగుదొడ్లు, తాగునీరు మొదలైన కనీస మౌలిక వసతులు లేకపోవడం, చాలామటుకు బడుల్లో దృశ్య - శ్రవణ పరికరాలు పనిచేయకపోవడం వంటి అంశాలు వెల్లడయ్యాయి.**

పాఠశాలల్లో తరగతిగదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు చాలినంతగా అందుబాటులో ఉన్నాయా అనే అంశాలను ఆడిటు మదింపు చేసింది. ఇందుకోసం తొమ్మిది జిల్లాల్లో[38] ఉన్న మొత్తం 4,394 బడులకు గాను 222 బడులను ఆడిటు తనిఖీ చేసింది. ఈ బడుల జాబితా ***అనుబంధం - 3.5*** లో ఉంది. 2009-10 సంవత్సరంలో జిల్లా విద్యాధికార్ల (డి.ఇ.ఓ.లు) కార్యాలయాల ఆడిటులో భాగంగా ఈ బడులను తనిఖీ చేయడమైంది.

---

[38] ప్రతి జిల్లాలోనూ ఐదు శాతం మాధ్యమిక పాఠశాలలను 'యాదృచ్ఛిక - ఎంపిక' విధానంలో ఎంపిక చేసుకోవడమైంది. అవి : అనంతపురం (25), చిత్తూరు(26), తూర్పుగోదావరి (27), కర్నూలు(25), నల్గొండ(25), రంగారెడ్డి(25), శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు(25), శ్రీకాకుళం (18), విశాఖపట్నం (26)

విద్యాప్రమాణాలు మెరుగుపడాలంటే బడుల్లో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం తోపాటు, చాలినన్ని తరగతిగదులు, గ్రంథాలయాలకు గదులు, ప్రయోగశాలలు ; ఇంకా బెంచీలు, బ్లాక్‌బోర్డుల వంటి మౌలిక వసతులు అత్యంత ఆవశ్యకాలు. ఆడిటు పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయిః

## పాఠశాల భవనాలు


తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం లో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆడిటు తనిఖీ చేసిన 222 పాఠశాలలకుగాను 89[39] పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. వీటికి అత్యవసరంగా మరమ్మతులు చేపట్టాలి. అంతే కాకుండా, వీటికి 3,754 తరగతిగదులు అవసరం కాగా కేవలం 2,422 (65 శాతం) తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. అంటే 1,332 (35 శాతం) తరగతి గదులకు కొరత ఉంది. తరగతి గదుల కొరత 20 శాతం (నల్గొండ జిల్లా) నుండి అత్యధికంగా 51 శాతం (శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా) వరకు ఉంది. చేపట్టాల్సిన మరమ్మతులు, అందుకయ్యే ఖర్చుల వివరాలతో కూడిన కేంద్రీకృత డేటాబేస్ లేదు. ఈ విధమైన డేటాబేస్ ఉండి ఉంటే రాష్ట్ర శాసన సభ నుండి బడ్జెటు ద్వారా నిధులను పొందడానికి వీలయ్యేది.

## గ్రంథాలయాలు, ప్రయోగశాలల పరికరాలు

మచ్చుకు తనిఖీ చేసిన 222 బడులకుగాను, 165 బడుల్లో గ్రంథాలయం, ప్రయోగశాలలు ఏర్పాటు చేయలేదు. అంతే కాకుండా, 161 (73 శాతం) బడుల్లో గ్రంథాలయగదులు, 145 (65 శాతం) బడుల్లో ప్రయోగశాలలు లేవు. ఇంకా 94 (42 శాతం) బడుల్లో బోధన, అధ్యయన సామగ్రి అందుబాటులో లేదు.

ఈ సందర్భంగా, గ్రంథాలయాలు, ప్రయోగశాలల్లో పరికారాల ఏర్పాటుకు ఐదు జిల్లాల్లోని[40] డి.ఇ.ఓ.లకు కేటాయించిన నిధులు, వారు వినియోగించిన నిధుల వివరాలను ఆడిటు పరిశీలించింది. 2006-07 నుండి 2008-09 మధ్య కాలంలో ఈ ఐదు జిల్లాల డి.ఇ.ఓ.లకు గ్రంథాలయాలు, ప్రయోగశాలలకు సంబంధించిన కొనుగోళ్ల కోసం రూ1.90 కోట్లు విడుదల చేయగా, కేవలం 17 శాతం నిధులను (రూ32.12 లక్షలు) మాత్రమే ఖర్చుచేయగా మిగిలిన రూ67.59 లక్షలు మురిగిపోయాయి.

ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత ప్రభుత్వనిధులను ప్రభుత్వ పద్దుల్లో కాకుండా బయట ఉంచడం నిషిద్ధమని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ కోడ్ లోని ఆర్టికల్ 39 లో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఈ నిబంధనలకు విరుద్ధంగా నాల్గు జిల్లాల్లోని డి.ఇ.ఓ.లు ఖర్చు కాకుండా మిగిలిన రూ60.70 లక్షల[41] నిధులను బ్యాంకు ఖాతాల్లో ఉంచారు. రంగారెడ్డి జిల్లాలో రూ30.06 లక్షల మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు జమ చేసారు (2007 నవంబరు). గ్రంథాలయాలకు పుస్తకాలు, పరిశోధనశాలలకు పరికరాలు అవసరమైనప్పటికీ,

[39] అనంతపురం (10), చిత్తూరు (4), తూర్పుగోదావరి (8), కర్నూలు (13), నల్గొండ (8), రంగారెడ్డి (11), శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు (15), శ్రీకాకుళం (10), విశాఖపట్నం (10)

[40] తూర్పుగోదావరి, కర్నూలు, నల్గొండ, రంగారెడ్డి, విశాఖపట్నం

[41] రూ190.47 లక్షలు (విడుదల చేసినవి) - రూ67.59 లక్షలు (మురిగిపోయినవి) - 32.12 లక్షలు (ఖర్చు చేసినవి) - రూ30.06 లక్షలు (జమ చేసినవి) - 60.70 లక్షలు (మిగిలినవి) - తూర్పుగోదావరి - రూ10.40 లక్షలు ; కర్నూలు - రూ 18.60 లక్షలు, నల్గొండ. రూ15.85 లక్షలు, విశాఖపట్నం - రూ15.85 లక్షలు

వాటికోసం విడుదల చేసిన నిధులను పూర్తి మొత్తంలో వినియోగించుకోవడంలో డి.ఇ.ఓ.లు విఫలమయ్యారు. అత్యధిక మొత్తంలో, అంటే 83 శాతం నిధులను వినియోగించుకోకపోవడం వలన అనుభవపూర్వకమైన జ్ఞానం ద్వారా విద్యార్థుల ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యం నెరవేరలేదు.

**మౌలిక వసతులు**

బడుల్లో బెంచీలు, బ్లాక్‌బోర్డులు, కుర్చీలు, శుద్ధిచేసిన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం, ఆటస్థలం, ప్రహరీగోడ మొదలైన ప్రాథమిక వసతులు ఏమేరకు ఉన్నాయనే విషయాన్నీ ఆడిటు పరిశీలించింది. ఈ పరిశీలనలో కింద వివరించిన విధంగా, బడుల్లో కనీస మౌలిక వసతులు కూడా లేవు. బడుల్లో మౌలిక వసతుల కొరతకు సంబంధించి జిల్లావారీ వివరాలను ***అనుబంధం - 3.6*** లో ఇవ్వడమైంది.

ఈ కింది అంశాలు ఆడిటు పరిశీలనలో వెల్లడయ్యాయిః

- 222 బడులకు కావలసిన బెంచీల సంఖ్య 33,629 కాగా, ఉన్నవి 15,341 మాత్రమే. అలాగే అవసరమైన కుర్చీలు 5,076, బ్లాక్‌బోర్డులు 2,584 కాగా ఈ బడుల్లో ఉన్నవి 2,675 కుర్చీలు, 1,806 బ్లాక్‌బోర్డులు మాత్రమే. ఈ కొరతను శాతాల్లో లెక్కిస్తే అవి వరుసగా 54 శాతం, 47 శాతం, 30 శాతం అనితేలింది.
- బడుల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకూ, వారు బడిలో కొనసాగేలా ప్రోత్సహించేందుకూ భవిష్యత్తులో నిర్మించతల పెట్టిన పాఠశాల భవనాల ఖర్చు అంచనాల్లో బాలురకు, బాలికలకు వేరు వేరుగా మరుగుదొడ్లను నిర్మించడానికి కూడా తప్పని సరిగా నిధులను కేటాయించాలని ప్రజాపద్దుల కమిటీ[42] (1996-97, 2000-01) సిఫార్సు చేసింది (1998 ఏప్రిల్, 2002 మార్చి). అంతేకాకుండా మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా ఉన్న బడుల్లో దశలవారీగా ఆ సౌకర్యాన్ని కల్పించాలని కూడా సిఫార్సు చేయడమైంది. ఐతే మొత్తం 222 బడులకు గాను 117 బడుల్లో మరుగుదొడ్ల వసతి లేదనీ, 55 బడుల్లో తాగునీరు లేదనీ ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.




**తూర్పుగోదావరి జిల్లా రామేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు లేక చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్న దృశ్యాలు**

- 34 బడుల్లో విద్యుత్ సౌకర్యం లేదు. ఫలితంగా, దృశ్య - శ్రవణ విద్యా బోధన వంటి వాటిని అమలు చేయడం సాధ్యం కాలేదు.
- 105 బడులకు ప్రహరీగోడలేదు. దీనివలన దొంగతనాలు జరిగి బడులకు సరఫరా చేసిన పరికరాలు పోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.
- 80 బడుల్లో ఆట స్థలాలు లేవు. దీని వలన విద్యార్థులు ఆటలు, వినోదం వంటి సౌకర్యాలను కోల్పోయారు.

---

[42] పదో శాసనసభ పదమూడవ నివేదికను 1998 ఏప్రిల్ 27న శాసనసభలో ప్రవేశపెట్టారు.11వ శాసనసభ పదో నివేదికను 2002 మార్చి 22న శాసనసభలో ప్రవేశపెట్టారు

## దృశ్య - శ్రవణ పరికరాలు

విద్యార్థులకు విషయ అవగాహన సులువు కావడానికీ, వారు పాఠాలు త్వరగా నేర్చుకోవడానికీ దృశ్యశ్రవణ పరికరాలు చాలా ప్రభావంతమైన బోధనా సాధనాలుగా ఉపయోగపడతాయి.

మచ్చుకు తనిఖీ చేసిన 222 బడులకు గాను, 172 బడులకు మాత్రమే టెలివిజన్ (టి.వి.) లు సరఫరా చేసారు. వీటిలో, కేవలం 77 బడుల్లో (45 శాతం) మాత్రమే టి.వి. లు పనిచేస్తున్నాయనీ, యాంటెన్నా విద్యుత్ సరఫరా, డిష్ కనెక్షన్లు, మొదలైనవి లేకపోవడం వలన మిగిలిన 95 బడుల్లో టి.వి. లను వినియోగించుకోవడం లేదనీ ఆడిటు పరిశీలనలో వెల్లడైంది. ఆరు జిల్లాల్లోని 27 బడులకు (జాబితా ***అనుబంధం - 3.7*** లో ఉంది) దృశ్య - శ్రవణ పరికరాలను సరఫరా చేసినప్పటికీ యాంటెన్నాలను సరఫరా చేయకపోవడం వలన ఆ టి.వి. లను ఉపయోగించుకునే వీలులేకుండాపోయింది. ఆవిధంగా, ఆడిటు తనిఖీ చేసిన బడుల్లో 65 శాతం (222 బడులకుగాను, 145) బడుల్లో దృశ్య - శ్రవణ పరికరాల వంటి ప్రభావంతమైన బోధనాసాధనాల ప్రయోజనాన్ని వినియోగించుకోలేకపోవడం జరిగింది. కాబట్టి, కేవలం టి.వి లను మాత్రమేకొనుగోలు చేసి, వాటిని ఉపయోగించడానికి అవసరమైన మౌలిక వసతులు ముందుగా చూసుకోకపోవడం వలన ఈ బడుల్లో టి.వి. ల ప్రయోజనాలను కోల్పోవడం జరిగింది.

## సిబ్బంది

మచ్చుకు తనిఖీ చేసిన 222 బడుల్లో 4,497 మంది ఉపాధ్యాయులు, 994 మంది బోధనేతర సిబ్బంది అవసరం కాగా, 1,122 (25 శాతం) మంది ఉపాధ్యాయులు[43] 483 (49 శాతం) మంది బోధనేతర సిబ్బంది తక్కువగా ఉన్నారు. బోధనేతర సిబ్బంది కొరత వలన అరకొరగా ఉన్న బోధనా సిబ్బంది మీద అదనపు భారం పడి విద్యా ప్రమాణాల పై దుష్ప్రభావం ఏర్పడుతుంది.

## తనిఖీలు - పర్యవేక్షణ

బడులకూ, ప్రభుత్వానికీ మధ్య డి.ఇ.ఓ.లు అనుసంధాన కర్తలు కాబట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా విద్యాసంబంధిత విషయాల్లో ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలను అమలు చేయడానికి పాఠశాలల వార్షిక తనిఖీని వారు చేపట్టాలి. ఐతే, డి.ఇ.ఓ. లు, డిప్యూటీ డి.ఇ.ఓ.లు చేయాల్సిన తనిఖీల్లో భారీగా లోటు ఉందని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది. 2007-08 నుండి 2009-10 మధ్య గల మూడేళ్ల కాలంలో (2009 సెప్టెంబరు వరకు) ఈ లోటు 72 నుండి 93 శాతం వరకూ ఉంది.

### సారాంశం

రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా పలు పథకాలను అమలు చేస్తున్నప్పటికీ తరగతి గదులు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఆశించిన స్థాయిలో లేవు. వారికి విడుదల చేసిన నిధులను డి.ఇ.ఓ. లు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడంలో విఫలం కావడమే దీనికి ప్రధాన కారణం. బడుల్లో చేసట్టాల్సిన మరమ్మతులు, అందుకయ్యే ఖర్చుల వివరాలతో కూడిన కేంద్రీకృత డేటాబేస్ లేదు. ఉపాధ్యాయుల కొరత (25 శాతం), బోధనేతర సిబ్బంది కొరత (49 శాతం) లకు తోడు, డి.ఇ.ఓ.లు, ఉప డి.ఇ.ఓ.ల ద్వారా బడుల తనిఖీల విషయంలో భారీ లోటు (72 నుండి 93 శాతం) విద్యాబోధనలోని నాణ్యతపై దుష్ప్రభావాన్ని చూపవచ్చు.

పైన పేర్కొన్న విషయాలను 2010 ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదించగా (2010 మేలో మరొక సారి గుర్తుచేసినప్పటికీ) 2010 నవంబరు నాటికి సమాధానం రాలేదు.

[43] అనంతపురం :140 ; చిత్తూరు: 287 ; తూర్పుగోదావరి: 63 ; కర్నూలు : 159 ; నల్గొండ : 100 ; రంగారెడ్డి : 65 ; శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు : 104 ; శ్రీకాకుళం : 72 ; విశాఖపట్నం : 132

## 3.4 పర్యవేక్షణ/పాలనాపరమైన వైఫల్యాలు

### వ్యవసాయం, సహకార శాఖ

### 3.4.1 బయో-ఏజంట్ ప్రయోగశాలలను ప్రారంభించకపోవడం

**రాష్ట్రంలో ఐదు బయో-ఏజంట్ ప్రయోగశాలల కోసం భారత ప్రభుత్వం రూ2.50 కోట్ల మొత్తాన్ని విడుదల చేసి ఐదేళ్లు గడిచినా, భవనాల నిర్మాణం, పరికరాల సరఫరాలకు సంబంధించిన కార్యకలాపాలను సమన్వయం చేయడంలో వైఫల్యం కారణంగా ఈ ప్రయోగశాలలు ప్రారంభం కాలేదు.**

రాష్ట్రంలో పత్తి పంట విస్తారంగా పండించే ప్రాంతాలైన గుంటూరు, ఖమ్మం, మెదక్, నిజామాబాద్, వై.ఎస్.ఆర్. జిల్లాల్లో కొత్తగా ఐదు బయో-ఏజంట్ ప్రయోగశాలలను నెలకొల్పడానికి 2004 డిశంబరులో రాష్ట్ర ప్రభుత్వం పాలనా పరమైన ఆమోదాన్నిచ్చింది. కేంద్ర ప్రాయోజిత[44] పథకమైన 'టెక్నాలజీ మిషన్ ఆన్ కాటన్‌లోని - విస్తృత పత్తి పంట అభివృద్ధి కార్యక్రమం మినీ మిషన్-II' కింద ఈ ప్రయోగశాలలను మంజూరు చేయడమైంది. సమగ్ర క్రిమి సంహారక యాజమాన్య పద్ధతుల్లో బయో-ఏజంట్లు కీలకపాత్ర పోషిస్తాయి. ఈ ప్రయోగశాలలు, వివిధ రకాలైన బయో-ఏజంట్లను ఉత్పత్తి చేయడం కోసం ఉద్దేశించినవి. పత్తి పంటకు అవసరమైన సహజ మూలకాలను పునరుద్ధరించడానికీ లేదా మెరుగు పరచడానికీ, నేలలోని సూక్ష్మ జీవుల కార్యకలాపాలను పెంపొందించేందుకు ఈ బయో-ఏజంట్లు ఉపయోగపడతాయి. కాబట్టి, ఈ ప్రయోగశాలలకు వ్యూహాత్మకమైన ప్రాధాన్యత ఉంది. వీటికి సంబంధించిన నిర్మాణ పనులను హ్యాబ్‌టెక్[45] అనే సంస్థకూ, ప్రయోగశాలల పరికరాల[46] సరఫరాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎ.పి. ఆగ్రోస్) కూ వ్యవసాయశాఖ కమీషనరు అప్పగించారు (2004 డిశంబరు). దీని కోసం కమీషనరు 2005 మార్చిలో రూ2.50 కోట్లను డ్రా చేసి, ఎ.పి.ఎస్.ఎస్.డి.సి. లిమిటెడ్[47] కు చెందిన పి.డి. అకౌంటులో జమ చేసారు. ఈ మొత్తం నుండి రూ1.40 కోట్లను 2006 మే - డిశంబరు మధ్యకాలంలో, ప్రయోగశాలలకు భవనాలను నిర్మించడానికీ, బోరుబావులు, విద్యుదీకరణ వంటి అదనపు మౌలిక వసతులను కల్పించడానికీ హ్యాబ్‌టెక్ డైరెక్టరుకు విడుదల చేసారు.

ఐతే, 2010 మే నాటికి రాష్ట్రంలో కనీసం ఒక్క ప్రయోగశాల కూడా ప్రారంభం కాలేదని కమీషనరు కార్యాలయంలోని రికార్డుల తనిఖీ (2009 మే, అక్టోబరు) లో వెల్లడైంది. ఖమ్మం (2007 జూన్/ఖర్చు: రూ29.75 లక్షలు), మెదక్ (2007 అక్టోబరు/ఖర్చు: రూ29.60 లక్షలు), నిజామాబాద్ (2007 సెప్టెంబరు/ఖర్చు: రూ27.95 లక్షలు) జిల్లాల్లోని మూడు ప్రయోగశాలల కోసం భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ, ఈ ప్రయోగశాలలకు అవసరమైన పరికరాలను సరఫరా చేయలేదు. పరికరాల సరఫరా కోసం ఎ.పి. ఆగ్రోస్ కు ఎలాంటి నిధులనూ విడుదల చేయలేదనీ, ఈ నిధులు ఇప్పటికీ ఎ.పి.ఎస్.ఎస్.డి.సి. కి చెందిన పి.డి. అకౌంటులోనే ఉన్నాయనీ ఆడిట్ గమనించింది. అంతేకాకుండా, పరికరాలు సరఫరా చేయవలసిన ఎ.పి. ఆగ్రోస్ సంస్థ, 2010 మే నాటికి కనీసం టెండర్లను కూడా ఖరారు చేయలేదు. గుంటూరు, వై.ఎస్.ఆర్. జిల్లాల్లోని మిగిలిన రెండు ప్రయోగశాలలకు సంబంధించిన భవనాల నిర్మాణం 2005 అక్టోబరు లోనే పూర్తి కావలసి ఉండగా, 2010 మే నాటికి కూడా అవి పూర్తి కాలేదు (చేసిన ఖర్చు: రూ53.43 లక్షలు). ఆ విధంగా, కేంద్రప్రభుత్వం 2004 ఆగస్టులోనే విడుదల చేసిన నిధులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రయోగశాల భవనాల నిర్మాణం, పరికరాల సరఫరా అనే కార్యకలాపాలను సమన్వయం చేయడంలో వైఫల్యం కారణంగా ఐదేళ్లు గడిచినా ఇంతవరకూ బయో-ఏజంట్ ప్రయోగశాలల స్థాపన జరగలేదు.

[44] భారత ప్రభుత్వం 2004 ఆగస్టు లో మంజూరీనిచ్చి నిధులను విడుదల చేసింది.

[45] రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ (భారత ప్రభుత్వ రంగ సంస్థ).

[46] వీటిలో 26 పరికరాలు, ఒక వాహనం ఉన్నాయి.

[47] ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ

పైన పేర్కొన్న ఆడిట్ పరిశీలనలను ప్రభుత్వం అంగీకరించింది (2010 మే). హ్యాబ్‌టెక్ సంస్థలో సిబ్బందిని తరచుగా బదిలీ చేయడం, ఎ.పి. ఆగ్రోస్ సంస్థ ఇతర కార్యకలాపాల్లో తలమునకలై ఉండడం, అనువుగా లేని స్థలాలను ఎంపిక చేయడం, నిర్మాణ లోపాలు వంటి కారణాల వల్లనే ప్రయోగశాలల నిర్మాణంలో ఆలస్యం జరిగిందని ప్రభుత్వం తెలిపింది. ఈ ఐదు జిల్లాల్లో, రైతులకు అవసరమైన బయో-ఏజంట్లను ఇతర జిల్లాల్లో ఉన్న ప్రయోగశాలలు సరఫరా చేస్తున్నాయని కూడా ప్రభుత్వం తెలిపింది. ఐతే, ఆడిట్ పేరాలో పేర్కొన్న ఐదు జిల్లాల్లో బయో-ఏజంట్ ప్రయోగశాలల అవసరం లేనప్పుడు వాటిని ఎందుకు స్థాపించదలచారనే విషయాన్ని సమాధానంలో తెలపలేదు. వాస్తవానికి, స్వయానా వ్యవసాయశాఖ కమీషనరే గతంలో (2008 మే), ఇదివరకే ఉన్న సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని నొక్కివక్కాణిస్తూ, 'విచక్షణారహితంగా క్రిమిసంహారకాలను వినియోగించడాన్ని నివారించడానికి, బయో-ఏజంట్ క్రిమిసంహారకాలకు డిమాండు పెరుగుతుండడాన్ని' దీనికి ఒక కారణంగా చూపారు.

### సాధారణ పరిపాలన శాఖ

### 3.4.2 అవినీతి నిరోధక శాఖ లక్ష్యం నెరవేరకపోవడం

**ప్రభావవంతంగా పనిచేయగలిగితే పెద్ద ఎత్తున సత్ఫలితాలనందించే సామర్థ్యం ఎ.సి.బి.కి ఉంది. ఎ.సి.బి. తన విధి నిర్వహణలో వివిధ స్థాయిల్లో ఎదుర్కొంటున్న అవరోధాల కారణంగా, ప్రభుత్వోద్యోగుల పనితీరులో నిజాయితీ, పారదర్శకతలను పెంపొందించాలన్న లక్ష్యసాధనకు తీవ్ర విఘాతం కలిగింది.**

అవినీతి నిరోధక శాఖ (ఎ.సి.బి.) 1961 లో ఏర్పాటయింది. డైరక్టర్ జనరల్ దీనికి నేతృత్వం వహిస్తారు. ప్రధాన కార్యాలయం స్థాయిలో అతనికి ఒక డైరక్టరు, ఇద్దరు అదనపు డైరెక్టర్లు, ఇతర సాంకేతిక, మినిస్టీరియల్ సిబ్బంది సహకరిస్తారు. ఈ సంస్థకు జోన్లవారీగా, రేంజిల వారీగా ఫీల్డు యూనిట్లు ఉన్నాయి. జోన్లను జాయింటు డైరెక్టరు స్థాయి అధికారులూ, రేంజీలను పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటులూ పర్యవేక్షిస్తారు. ఎ.సి.బి. పాలనాపరమైన నియంత్రణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చేతిలో ఉంటుంది. ఎ.సి.బి. వార్షిక బడ్జెటు సుమారు రూ19 కోట్లు (2009-10).

సేవలలో అవినీతిని అరికట్టడమే ఎ.సి.బి. ముఖ్యోద్దేశం. ప్రజలకు న్యాయంగా అందాల్సిన సేవలు వారికి అందేలా చూడడం కోసం, అవినీతి నిరోధక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయడం ద్వారా, ప్రభుత్వం, ప్రభుత్వోద్యోగుల పనితీరులో నిజాయితీ, పారదర్శకతలను పెంపొందించడమే ఎ.సి.బి. లక్ష్యం.

ఎ.సి.బి. కార్యనిర్వహణను మూడు దశలుగా విభజించవచ్చు. (i) సమాచార సేకరణ (ii) న్యాయ విచారణ జరపడానికి అనుమతి మంజూరు (iii) న్యాయ విచారణ /శాఖాపరమైన విచారణ జరపడం. ఎ.సి.బి. డైరక్టర్-జనరల్ రికార్డులను ఆడిటు పరిశీలించగా ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :

**సమాచార సేకరణ**

రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరి గురించీ సమాచారాన్ని సేకరించే అధికారాలను ఎ.సి.బి.కి అప్పగించారు. పురపాలక సంఘాలు, జిల్లా పరిషత్తులు, అవి నిర్వహించే సంస్థలు, రాష్ట్ర కార్పోరేషన్లు, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం పొందే స్వయంపాలిత సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతో సహా, మొత్తం మీద 13 లక్షలకుపైగా ఉద్యోగులు ఎ.సి.బి. పరిధిలో ఉన్నారు. వల పన్ని పట్టే (ట్రాప్) కేసులు, ఆదాయానికి మించి ఆస్తులున్న కేసులు, నేరపూరిత దుష్ప్రవర్తన కేసులు, సాధారణ విచారణలు, రహస్య విచారణలు, ఆకస్మిక తనిఖీలు మొదలైనవి ఎ.సి.బి. చేపడుతుంది. ఐతే, ఆలిండియా సర్వీసెస్ కు చెందిన అధికారుల విషయంలో మాత్రం ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలి.

### న్యాయ విచారణలను అనుమతించడం

ఎ.సి.బి. దర్యాప్తు తర్వాత, అపరాధం చేసిన ఉద్యోగులపై న్యాయ విచారణ మొదలు పెట్టడానికి పరిపాలనా అధికారి ముందస్తు అనుమతి అవసరం. దర్యాప్తు చేయడంలోనూ, ఆ కేసులను సంబంధిత విచారణ సంస్థలకు సమర్పించే నిమిత్తం పంపడంలోనూ ఎ.సి.బి. వద్ద ఆలస్యం జరగటం లేదు. ఐతే, 2010 జూలై నాటికి సుమారు 342 కేసుల్లో (26 శాఖలకు సంబంధించినవి) నేరం చేసిన ఉద్యోగులపై న్యాయవిచారణ మొదలుపెట్టడానికి ప్రభుత్వ అనుమతి రాలేదని ఆడిటు పరిశీలనలో తేలింది. కేటగిరీల వారీ స్థితిని **పట్టిక-4** లో చూడవచ్చు.

**పట్టిక -4**

| ఉద్యోగుల శ్రేణి | న్యాయవిచారణకు ప్రభుత్వం నుండి అనుమతి కోరిన కేసుల్లోని వ్యక్తుల సంఖ్య | న్యాయవిచారణకు ప్రభుత్వ అనుమతి వచ్చిన వ్యక్తుల సంఖ్య | శాతం |
|---|---|---|---|
| గెజిటెడ్ అధికారులు | 1059 | 712 | 67 |
| నాన్ గెజిటెడ్ అధికారులు | 1175 | 902 | 77 |

పెండింగులో ఉన్న 342 కేసుల్లో మొత్తం 754 మంది గెజిటెడ్ అధికారులు (ఆలిండియా సర్వీసెస్ అధికారులతో కలిపి) నాన్ గెజిటెడ్ అధికారులకి సంబంధం ఉంది. ఈ 342 పెండింగు కేసుల్లో (వివరాలు *అనుబంధం - 3.8* లో ఉన్నాయి) ఎనిమిది నివేదికలు పది సంవత్సరాలు, 30 నివేదికలు ఐదు సంవత్సరాల కన్నా పాతవి ఉన్నాయి. న్యాయవిచారణ కోసం అనుమతుల విషయంలో అత్యధికంగా పెండింగు కేసులున్న మొదటి ఐదు శాఖల వివరాలు **పట్టిక - 5** లో ఉన్నాయి :

**పట్టిక -5**

| శాఖ పేరు | మొత్తం కేసుల సంఖ్య | పదేళ్ల కన్నా పాతవి | ఐదేళ్ల కన్నా పాతవి | ఐదేళ్ల లోపువి | అత్యంత పాత కేసు సంవత్సరం |
|---|---|---|---|---|---|
| రెవెన్యూ | 90 | 02 | 03 | 85 | 1997 |
| పురపాలక, పట్టణాభివృద్ధి | 32 | లేవు | 07 | 25 | 2001 |
| హోమ్ | 31 | లేవు | లేవు | 31 | 2005 |
| పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి | 24 | 01 | 01 | 22 | 1997 |
| ఆరోగ్యం, వైద్యం కుటుంబ సంక్షేమం | 23 | 02 | 03 | 18 | 1997 |

### న్యాయ విచారణ/శాఖాపరమైన దర్యాప్తు

ప్రస్తుతం అమల్లో ఉన్న ఆదేశాల ప్రకారం, ఎ.సి.బి, సంబంధిత ప్రభుత్వ శాఖల నుండి అనుమతి పొందిన తరువాత, ప్రభుత్వం ఆదేశించిన విధంగా సంబంధిత ప్రత్యేక కోర్టులో చార్జిషీటు దాఖలు చేస్తుంది. శాఖా పరమైన చర్యలు పూర్తి చేయడానికి నిర్దేశించిన కాలపరిమితి ఆరు నెలలు. అలా చేయడంలో విఫలమైతే, విచారణ అధికారులపై శాఖాపరమైన చర్య తీసుకోవచ్చు. ఐతే, 2009 డిసెంబరు 31 నాటికి, **పట్టిక-6** లో చూపిన విధంగా, వివిధ విచారణ సంస్థల్లో 3,053 కేసులు పెండింగులో ఉన్నాయని పరిశీలనలో వెల్లడైంది. ఇందులో 1,691 కేసులు, శాఖాపరమైన విచారణ సంస్థల స్థాయిలోనే పెండింగులో ఉన్నాయి. మళ్లీ ఇందులో 559 కేసులు పదేళ్ల కన్నా పాతవి. ఇంత మితిమీరిన జాప్యాలున్నప్పటికీ, విచారణ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లుగా తెలిపే రికార్డులేవీ ఎ.సి.బి. వద్ద లేవు.

పట్టిక - 6

| విచారణ సంస్థ పేరు | కేసుల సంఖ్య | | | మొత్తం | అత్యంత పాతకేసు సంవత్సరం |
|---|---|---|---|---|---|
| | 1999 లేదా అంతకు ముందు సంవత్సరాలవి | 2000 నుండి 2004 వరకు (ఐదేళ్లకన్నా పాతవి) | 2005 నుండి 2009 వరకు (ఐదేళ్ల లోపువి) | | |
| శాఖాపరమైన విచారణ | 559 | 479 | 653 | 1691 | 1983 |
| క్రమశిక్షణా చర్యల ట్రిబ్యునల్ | 02 | 25 | 101 | 128 | 1999 |
| విచారణల కమీషనరు | 61 | 102 | 50 | 213 | 1986 |
| ఎ.సి.బి. ప్రత్యేక కోర్టులు | 10 | 146 | 865 | 1021 | 1994 |
| **మొత్తం** | **632** | **752** | **1669** | **3053** | |

ప్రభుత్వ స్థాయిలోనూ (న్యాయవిచారణకు అనుమతి ఇవ్వడం), విచారణ సంస్థల స్థాయిలోనూ, అంత అధికంగా కేసుల పెండింగుకు గల కారణాలను ఆడిటు విశ్లేషించింది. అందులో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :

- 2001 లో, ఎ.సి.బి. కేసులపై వివిధ విచారణ సంస్థలు చేపట్టిన చర్యల పురోగతిని, ఇతర అంశాలను పర్యవేక్షించడం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఎనిమిది మంది సభ్యులతో (కన్వీనరుతో కలిపి) కూడిన ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అందులో మరో ముగ్గురు సభ్యులకు చోటు కల్పిస్తూ, 2005 లో ఈ కమిటీని పదకొండుమంది సభ్యులుగల ఉన్నత స్థాయి కమిటీగా, పునర్వ్యవస్థీకరించింది[48]. నెలకు ఒకసారి సమావేశం కావాల్సిన ఈ కమిటీ 2005-09 మధ్య ఐదు సంవత్సరాల కాలంలో ఒకే ఒక్కసారి (2006) సమావేశమైంది. ప్రభుత్వం తన సమాధానంలో (2010 మే), 2009 జూన్ 15, 2009 జూలై 4 తేదీల్లో అప్పటి ముఖ్యమంత్రి జరిపిన సమీక్షా సమావేశాల గురించి పేర్కొంది. వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులతో 2009 జూలై 24 తేదీన ప్రధాన కార్యదర్శి జరిపిన సమావేశం గురించి కూడా ప్రస్తావించింది. ఒక నిర్దిష్టమైన ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి సంఘం 2006 డిశంబరు 23 తరువాత సమావేశమవలేదన్న విషయాన్ని ప్రభుత్వ సమాధానం ధృవపరుస్తోంది. ఆ విధంగా, ఎ.సి.బి. విచారణ నివేదికలపై ప్రభుత్వ స్థాయిలో ప్రభావవంతమైన పర్యవేక్షణ ఇంచుమించు లేనట్లే అయింది.
- దర్యాప్తు ప్రక్రియలోనూ, విచారణ సమయంలోనూ ఎ.సి.బి.కి సలహా ఇవ్వడానికి మంజూరైన సాంకేతిక బృందం (రెవెన్యూ, ఇంజినీరింగు, అటవీ, వాణిజ్య పన్నులు, అకౌంట్లు మొదలైన వివిధ రంగాలకు చెందిన సాంకేతిక సభ్యులతో కూడిన) లోని ఆరు పోస్టులలో నాలుగు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. ఇందులో, మూడు పోస్టులు (రెవెన్యూ, అటవీ, వాణిజ్యపన్నులు) 2004-05 నుంచీ ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం, ఈ విషయాన్ని ధృవీకరిస్తూ (2010 మే), ఉప సంచాలకుల (రెవెన్యూ, ఇంజినీరింగు) పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని తెలిపింది.
- ఆరు తెలంగాణా జిల్లాలకు సంబంధించిన ఎ.సి.బి. కేసుల విచారణకోసం, 2008 జనవరిలో, రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్‌లో ఒక ప్రత్యేక కోర్టు ఎస్.పి.ఇ., ఎ.సి.బి. కేసుల కోసం రెండవ అదనపు ప్రత్యేక కోర్టును మంజూరు చేసింది. మంజూరు చేసిన నాటి నుండి రెండేళ్లు గడిచినా ఇంతవరకూ ఆ కోర్టుకు ప్రత్యేక జడ్జిని నియమించలేదు (2009 డిసెంబరు). దీంతో ఆ ప్రాంతానికి సంబంధించిన కేసుల పరిష్కారంపై దుష్ప్రభావం పడింది. ఆడిట్ అభ్యంతరాన్ని అంగీకరిస్తూ, హైకోర్టు రిజిస్ట్రారుతో ఈ విషయాన్ని చేపట్టామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 మే).

48 2005 జనవరి 22 వతేది నాటి సాధారణ పరిపాలన (ఎస్.పి.ఎల్.సి.) శాఖ జి.ఒ.ఆర్.టి. నెం. 369,

- తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలలోని కేసులను పరిష్కరించడానికి, రాజమండ్రిలో ఒక ప్రత్యేక కోర్టును నెలకొల్పడానికి మంజూరు కోసం, ఎ.సి.బి. 2008 నవంబరులో ప్రభుత్వాన్ని కోరింది. కానీ, ఇంతవరకూ ప్రత్యేక కోర్టుని నెలకొల్పలేదు. ఆడిట్ అభ్యంతరాన్ని అంగీకరిస్తూ, ఈ విషయం హోమ్ (కోర్టులు), ఆర్థిక శాఖల పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొంది.
- ఎ.సి.బి.లో కేసులకు సంబంధించి అధిక సంఖ్యలో పెండింగు ఉన్న క్రిమినల్ అప్పీళ్లను పరిష్కరించడానికి ప్రత్యేకంగా అదనపు ధర్మాసనాన్ని ఏర్పాటు చేయ్యాల్సిన అవసరంవుందని ఎ.సి.బి. భావించింది (2009 జనవరి). కాని, ఇది రూపుదిద్దుకోలేదు. హైకోర్టు నుండి ఆదేశాలు రావాల్సి ఉందని ప్రభుత్వం తెలిపింది (2010 మే).
- 'క్రమశిక్షణా చర్యల ట్రిబ్యునల్' లో , ఛైర్మన్ పోస్టు 2008 సెప్టెంబరు నుండి 2010 జనవరి 31 వరకు, రెండవ మెంబరు, మూడవ మెంబరు పోస్టులు 2009 సెప్టెంబరు, 2007 నవంబరు నుండి ఈరోజు వరకూ ఖాళీగా ఉన్నాయి. 2010 ఫిబ్రవరి వరకూ ఛైర్మన్ పోస్టును, 2009 సెప్టెంబరు/ 2007 నవంబరు నుండి మెంబర్ల పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల, 200 మంది వ్యక్తులతో ముడిపడి ఉన్న సుమారు 128 కేసులు (అత్యంత పాతది 1999 కి సంబంధించింది) ఈ ట్రిబ్యునల్ వద్ద అపరిష్కృతంగా ఉన్నాయి.

ఎ.సి.బి. ప్రభావవంతంగా పనిచేయగలిగితే, ఆ సంస్థ తన బడ్జెటు (రూ19.27 కోట్లు) కంటే అనేక రెట్ల ప్రయోజనాలను ప్రభుత్వానికి అందించగలుగుతుంది. ఎ.సి.బి. తన విధి నిర్వహణలో వివిధ స్థాయిల్లో ఎదుర్కొంటున్న అవరోధాల కారణంగా, ప్రభుత్వోద్యోగుల పనితీరులో నిజాయితీ, పారదర్శకతలను పెంపొందించాలన్న లక్ష్యసాధనకు తీవ్ర విఘాతం కలిగింది. పర్యవసానంగా, ఉద్యోగులపై అవినీతి నిరోధక ప్రభావం నీరుగారి పోవడంతో పాటు దీని వల్ల ఎ.సి.బి. ప్రభావ రహితంగా తయారయ్యే ప్రమాదముంది.

## నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ
## (ప్రాజెక్టుల విభాగం)

### 3.4.3 డాక్టరు కె.ఎల్. రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు

**ప్రాజెక్టు పనుల నిర్వహణలో కీలకమైన వ్యయ నియంత్రణలు లేకపోవడంతో, ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనుల పరిమాణాలలో వచ్చిన తగ్గుదలల ప్రయోజనం ప్రభుత్వానికి ఒనగూరకపోగా, కాంట్రాక్టరుకు రూ56.52 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది**

నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్.ఎస్.పి.)పై ఆధారపడకుండా, ఎన్.ఎస్.పి.కి దిగువన ఉన్న క్యాచ్‌మెంట్ ప్రాంతాలనుండి వచ్చే నీటి ప్రవాహాలను వినియోగించుకొని కృష్ణా డెల్టాలో ప్రస్తుతం ఉన్న 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు[49] లో సకాలంలో పంటలు నాటేందుకు వీలు కల్పించే లక్ష్యంతో గుంటూరు జిల్లాలో పులిచింతల (గ్రామం) వద్ద కృష్ణా నదికి అడ్డంగా 45.77 టి.ఎమ్.సి[50] నీటిని నిల్వ చేసే సామర్థ్యం గల ఒక రిజర్వాయరును నిర్మించడానికి డాక్టరు కె.ఎల్. రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టును తలపెట్టారు.

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన రికార్డులను ఆడిట్ తనిఖీ చేయగా (2009 నవంబరు, 2010 జనవరి) ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి.

49 నీటిపారుదల క్రింద ప్రాంతం

50 శతకోటి ఘనపుటడుగులు

**సివిల్ పనుల నిర్వహణ**

నిర్వహించాల్సిన పనుల్లో ప్రధానంగా ఈ కింది అంశాలు ఉన్నాయి:

(i) ఆనకట్ట (స్పిల్‌వే డామ్) ను నిర్మించి రేడియల్ గేట్లు అమర్చడం,

(ii) స్పిల్‌వేకి ఎడమ, కుడివైపు లలో పైనుండి నీరు ప్రవహించని (నాన్ - ఓవర్ ఫ్లో - ఎన్.ఓ.ఎఫ్.[51]) డ్యామ్ నిర్మించడం,

టెండర్లు పిలిచిన మీదట (2004 జనవరి) పనులను 30 నెలల్లోగా పూర్తి చెయ్యాలనే నిబంధనతో రూ268.87 కోట్ల ఒప్పందం విలువకు ఒక కాంట్రాక్టరుకు అప్పగించారు (2004 సెప్టెంబరు). ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. కాంట్రాక్టరుకు ఇంతవరకూ రూ166.34 కోట్లు చెల్లించారు (2010 జనవరి).

**డిజైన్లు ఖరారు చేయకుండా పనులను అప్పగించడం :** డిజైన్లను ఖరారు చేయకుండానే పనుల ఒప్పందం కుదుర్చుకున్నారు. తత్ఫలితంగా, స్పిల్‌వే గేట్ల సంఖ్య విషయంలో సుదీర్ఘకాలం పాటు వివాదం నడిచింది. దీంతో పనుల పురోగతి కుంటుపడింది. యంత్రాలు, సిబ్బంది పని లేకుండా ఖాళీగా ఉన్నందుకు పరిహారంగా కాంట్రాక్టరుకు నీటిపారుదల శాఖ రూ1.76 కోట్లు చెల్లించింది (2008 జనవరి).

**గుత్తేదారుకు అనుచిత లబ్ధి :** టెండర్లు ఖరారు చేసి ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనుల పరిమాణం తగ్గితే ఆ ప్రయోజనం కాంట్రాక్టరుకు కాకుండా ప్రభుత్వానికే చేకూరేలా తగిన నిబంధనలను ఈ ప్రాజెక్టు పనుల ఒప్పందంలో పొందుపరచలేదని ఆడిట్ గమనించింది. **పట్టిక -7** లో తెలిపిన విధంగా, ఈ పనుల్లో ఒప్పందం కుదుర్చుకున్న తరువాత భారీ తగ్గుదలలు చోటు చేసుకున్నాయి.

**పట్టిక -7**

| పనుల్లోని అంశం | టెండరు నోటీసు ప్రకారం కొలతలు | వాస్తవంగా చేస్తున్న పనులు |
|---|---|---|
| స్పిల్‌వే[52] నిర్మాణం | 33 నీటిద్వారాలతో గల 754.9 మీటర్ల నిడివి | 24 నీటిద్వారాలతో 560.25 మీటర్ల నిడివి |
| గేట్లను అమర్చడం | 33 గేట్లు | 24 గేట్లు |
| స్టిల్లింగ్ బేసిన్[53] | 754.9 మీటర్ల వెడల్పుతో | 560.25 మీటర్ల వెడల్పుతో |
| ఎన్.ఓ.ఎఫ్. డ్యామ్ | 534.1 మీటర్ల పొడవుగల సిమెంటు కాంక్రీటు నిర్మాణం | 355 మీటర్ల మట్టి కట్ట, మిగిలింది కాంక్రీటుతో |

ఐతే, ఒప్పందంలో తగిన నియంత్రణలు లేకపోవడంతో కాంట్రాక్టర్లకు చేసే చెల్లింపులను తదనుగుణంగా తగ్గించలేదు. తత్ఫలితంగా, ఒప్పందం కుదుర్చుకున్న తరువాత పనుల పరిమాణాలలో చోటు చేసుకున్న రూ56.52 కోట్ల[54] తగ్గుదలల ప్రయోజనం ప్రభుత్వానికి అందలేదు. దీంతో కాంట్రాక్టరుకు ఆ మేరకు అనుచిత లబ్ధి చేకూరింది.

---

51 ఆనకట్టలో పైనుండి నీరు ప్రవహించని భాగం. ఇది నీటిని నిలిపి ఉంచుతుంది.

52 గేట్లను తెరవడం ద్వారా ఆనకట్ట దిగువ వైపు ప్రాంతానికి నీటిని విడుదల చేసేందుకు వీలుగా ఆనకట్ట మధ్యలో ఉండే నిర్మాణం

53 స్పిల్‌వే ద్వారా వేగంగా బయటకి ప్రవహించే నీటితాకిడిని చెల్లా చెదురు చేసేందుకు స్పిల్‌వే దిగువ వైపున నీటిని నిలిపి ఉంచే తొట్టిలాంటి నిర్మాణం

54 శాఖాపరమైన అంచనాలపై కాంట్రాక్టరు కోట్ చేసిన టెండరు శాతాన్ని వర్తింపజేసి లెక్కించడమైంది.

కాంక్రీటు డ్యామ్‌ను మట్టికట్టగా మార్చడం వల్ల ఒక్క ఎన్.ఓ.ఎఫ్. డ్యామ్‌లోనే రూ14.50 కోట్ల ఖర్చు తగ్గిందని అంగీకరిస్తూ, స్పిల్‌వే నిడివి/గేట్ల సంఖ్య తగ్గడం వల్ల ఎన్.ఓ.ఎఫ్. నిడివి పెరిగిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 మే). ఐతే, స్పిల్‌వే, గేట్లు, స్టిల్లింగ్ బేసిన్, ఎన్.ఓ.ఎఫ్. డ్యామ్‌ల పరిమాణాలలో తగ్గుదల కారణంగా కాంట్రాక్టరుకు చేకూరిన అనుచిత లబ్ధితో పోలిస్తే ఎన్.ఓ.ఎఫ్ డ్యామ్‌లో పెరిగిన నిడివి విలువ చాలా తక్కువ అన్న విషయాన్ని ఈ సమాధానం విస్మరిస్తోంది. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తరువాతనే కాంట్రాక్టరుకు చేకూరిన అనుచిత లబ్ధి విలువను ఆడిట్ లెక్కించింది.

ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కనస్ట్రక్షన్ (ఇ.పి.సి.) కాంట్రాక్టులో పరిమాణాలకు ప్రాముఖ్యత లేదనీ, ఈ కాంట్రాక్టు పద్ధతిలో పనుల పరిమాణాలు తగ్గితే ఆ మేరకు చెల్లింపులను తగ్గించే ఏర్పాటు లేదని కూడా ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు. నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణమనేది భారీ నిధులతో కూడుకున్న వ్యవహారం. పనుల పరిమాణాల పైనే, పనుల విలువ నేరుగా ఆధారపడి ఉంటుంది.

సమగ్ర సర్వేక్షణ, పూర్వశోధన (సర్వే, ఇన్వెస్టిగేషన్) చేయకుండానే పనుల ప్రాథమిక అంచనాలను తయారు చేసినందున, అంచనాలతో పోలిస్తే అంతిమంగా చేసే పనుల పరిమాణాలు భారీగా తగ్గే అవకాశం ఉంది. దీనికి సంబంధించి తగిన నియంత్రణలను పొందుపరచి ఉంటే పరిమాణాల తగ్గుదలల ప్రయోజనం కాంట్రాక్టరుకు కాకుండా ప్రభుత్వానికే చేకూరి ఉండేది.

పైన తెలిపిన పనుల్లోని తగ్గుదలలకు అనుగుణంగా కాంట్రాక్టరుకు చెల్లించే మొత్తాలను తగ్గించకపోగా మరోవైపు పనుల్లో ఇతర మార్పుల నిమిత్తం కాంట్రాక్టరుకు అదనంగా రూ46.08 కోట్లు చెల్లిస్తున్నారు.

**పట్టిక -8**

| పనుల్లోని అంశాలు | మొత్తం (రూపాయలు కోట్లలో) |
|---|---|
| స్టిల్లింగ్ బేసిన్ పొడవును 50 మీటర్ల నుండి 67 మీటర్లకి పెంచడం | 10.73* |
| స్పిల్‌వే గేట్లను నిలిపి ఉంచే ట్రునియన్ స్థాయి పెంచడం | 12.91 |
| డ్యామ్ పై ఉండే రోడ్డును సింగిల్ లేన్ నుండి డబుల్ లేన్ కు వెడల్పు చేయడం | 22.44 |
| **మొత్తం** | **46.08** |

* స్టిల్లింగ్ బేసిన్ పొడవు 50 మీటర్లనుండి 67 మీటర్లకు పెరిగిందన్న కారణంతో ఈ రూ10.73 కోట్ల అదనపు మొత్తాన్ని చెల్లిస్తున్నారు. ఐతే స్టిల్లింగ్ బేసిన్ నిడివి 50 మీటర్లు ఉండాలని టెండరు నోటీసులో పేర్కొనలేదని ఆడిట్ గమనించింది. కాంట్రాక్టరు కూడా తన బిడ్‌లో ఈ నిడివిని 50 మీటర్లుగా సూచించలేదు.

ఆ విధంగా, ఒప్పందంలో ప్రభుత్వహితాన్ని పరిరక్షించే నిబంధనలు లేకపోవడం వల్ల, పనుల పరిమాణాలలో వచ్చిన తగ్గుదలల ప్రయోజనం ప్రభుత్వానికి చేకూరలేదు.

**ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాల క్రమం**

ప్రాజెక్టులో ఈ కింది కార్యకలాపాలు ఉన్నాయి.

(i) పర్యావరణ అనుమతి పొందడం;

(ii) ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు పునరావాసం కల్పించడం (ఆర్ అండ్ ఆర్);

(iii) సివిల్ పనులు

ప్రాజెక్టులోని ఈ కార్యకలాపాలకు సంబంధించి సరైన క్రమాన్ని పాటించారా లేదా అన్న అంశాన్ని ఆడిట్ పరిశీలించింది.

ఈ ప్రాజెక్టులో పైన తెలిపిన మూడు కార్యకలాపాల విషయంలో సరైన క్రమం పాటించలేదని ఆడిట్ గమనించింది. ముందస్తుగా పర్యావరణ అనుమతి పొందకుండానే, సివిల్ పనులు పూర్తయ్యే నాటికి ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు తమ భూములను ఖాళీ చేసేలా పునరావాస కార్యక్రమాలు చివరి దశకు చేరకుండానే సివిల్ పనులను అప్పగించారు (2004 సెప్టెంబరు).

**పర్యావరణ అనుమతి పొందడం :** పర్యావరణ (పరిరక్షణ) చట్టం - 1986 కింద భారత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల (1994 జనవరి) ప్రకారం, కేంద్ర ప్రభుత్వం నుండి పర్యావరణ అనుమతి పొందకుండా దేశంలో ఏ భాగంలోనైనా ఎలాంటి కొత్త ప్రాజెక్టూ చేపట్టకూడదు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ పర్యావరణ అనుమతి లేకుండానే ప్రాజెక్టు పనులు ప్రారంభించడంతో ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం 2004 నవంబరులో పనులను నిలిపివేయాల్సిందిగా ఆదేశించింది. పర్యావరణ అనుమతి వచ్చిన తరువాత 2005 జూన్‌లో స్టే ఎత్తివేసింది. పనులు నిలిచిపోయిన కాలంలో యంత్రాలు, కూలీలు ఖాళీగా ఉన్నందుకు పరిహారంగా కాంట్రాక్టరుకు రూ3.24 కోట్లు చెల్లించారు (2008 జనవరి).

**ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం :** ఈ ప్రాజెక్టు వల్ల రెండు జిల్లాల్లో 28 గ్రామాల్లోని[55] 24,380 ఎకరాలు ముంపుకు గురౌతాయి. రికార్డుల ప్రకారం 10,000 కు పైగా కుటుంబాలు ప్రభావితమౌతున్నాయి. ఐతే, పనులు అప్పగించే నాటికి ముంపు ప్రాంతాల్లో సామాజిక - ఆర్థిక సర్వే నిర్వహించడం, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలను గుర్తించడం జరగలేదు. ఫలితంగా, ప్రభావిత కుటుంబాలు ఆందోళనలు చేపట్టడంతో ప్రాజెక్టు స్థలంలో ఉన్న యంత్రాలకు నష్టం వాటిల్లింది. దీనికి పరిహారంగా నీటిపారుదల శాఖ కాంట్రాక్టరుకు రూ0.48 కోటి మొత్తాన్ని చెల్లించింది (2008 జనవరి).

ఆ విధంగా, ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలను సరైన క్రమంలో చేపట్టకుండా అవసరమైన దాని కన్నా ముందే సివిల్ పనులను చేపట్టడంతో, అసంపూర్తిగా ఉన్న ఈ ప్రాజెక్టులో రూ607.49 కోట్ల[56] మొత్తం చిక్కుపడిపోయింది. ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి నిర్దేశించిన గడువు ముగిసి చాలాకాలమైనా ప్రాజెక్టు నుండి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. పైగా, పనుల్లో జాప్యం మూలంగా కాంట్రాక్టరుకు ధరల పెరుగుదల నిమిత్తం రూ34.30 కోట్ల మొత్తాన్ని అదనంగా చెల్లించారు.

ప్రాజెక్టులో వివిధ కార్యకలాపాల క్రమం ప్రధానమే అయినప్పటికీ ఈ కార్యక్రమాలను సమాంతరంగా చేపట్టాల్సి వచ్చిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఈ సమాధానం అంగీకార యోగ్యం కాదు. ముందస్తుగా పర్యావరణ అనుమతి పొందకుండా పనులను ఆరంభించడం చట్టాన్ని ఉల్లంఘించడమే కాకుండా ఇది ఉన్నత న్యాయస్థానం ద్వారా పనుల నిలిపివేతకు దారి తీసింది. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం కూడా ఒక సంక్లిష్టమైన సుదీర్ఘ ప్రక్రియ కనుక, ప్రాజెక్టు రూపకల్పన దశలోనే ఈ కార్యకలాపాన్ని ముందస్తుగా కానీ, లేదా సమాంతరంగా కానీ చేపట్టి ఉండాల్సింది.

ప్రాజెక్టులోని ఇతర కార్యకలాపాల విషయంలో చర్యలు తీసుకోకుండానే సివిల్ పనులు ఆరంభిస్తే, ఇతర కార్యకలాపాలు పూర్తికాకపోవడం వల్ల పనుల పురోగతి కుంటుపడి, తత్ఫలితంగా, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో భారీ మొత్తాల్లో నిధులు స్తంభించిపోయే ప్రమాదం ఎంతైనా ఉంది. దీని బదులు ఈ మొత్తాలను నిధులు అవసరమయ్యే ఇతర ప్రాజెక్టులు/ సంక్షేమ పథకాల్లో ఫలవంతంగా వినియోగించుకోవచ్చు.

---

[55] గుంటూరు జిల్లాలో 15 గ్రామాలు, నల్గొండ జిల్లాలో 13 గ్రామాలు

[56] సివిల్ పనులు (క్లెయిమ్‌లతో సహా) : రూ166.34 కోట్లు; పునరావాసం : రూ67.55 కోట్లు; భూసేకరణ : రూ264.40 కోట్లు; అటవీ భూములు : రూ109.20 కోట్లు

### 3.4.4 శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదనీటి కాలువ

**వరదనీటి కాలువ (ఎఫ్.ఎఫ్.సి.) ప్రాజెక్టు లోని వివిధ కార్యకలాపాలు/ పనులను సరైన క్రమంలో/సమన్వయ రీతిలో చేపట్టక పోవడం వల్ల, అవసరానికి ముందే ప్రాజెక్టు పనులపై భారీగా రూ1,476.30 కోట్లు ఖర్చు చేయడమైంది. రిజర్వాయర్లు పూర్తి అయ్యేవరకూ, ఈ నిధులు ఏ ప్రయోజనం లేకుండా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో చిక్కుకుపోయి ఉంటాయి. ఒప్పందపు నిబంధనల రూపకల్పన, అమలు లోపభూయిష్టంగా ఉంది.**

గోదావరి నది నుండి వచ్చే 20 టి.ఎమ్.సి.[57] ల వరద నీటితో, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కరువు పీడిత ప్రాంతాల్లోని 2,20,000 ఎకరాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించే ఉద్దేశ్యంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్.ఆర్.ఎస్.పి.) నుండి 122 కిలోమీటర్ల పొడవు గల వరదనీటి కాలువ (ఎఫ్.ఎఫ్.సి.) ని తలపెట్టారు (1997 నవంబరు). ఈ ప్రాజెక్టు కింద ఐదు జలాశయాలను[58] అభివృద్ధి చేయాలి. ప్రాజెక్టును రెండు దశల్లో చేపట్టారు - 2004 లో మొదటి దశ (1,00,000 ఎకరాలు); 2008 లో రెండో దశ (1,20,000 ఎకరాలు).

**ప్రాజెక్టు మొదటి దశ**

ప్రాజెక్టు తొలి దశ కింద 1,00,000 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటినందించడానికి పూర్తిచేయాల్సిన పనులు, వాటిలో అంతర్భాగంగా ఉన్న కార్యకలాపాల వివరాలు **పట్టిక-9** లో ఉన్నాయి.

**పట్టిక -9**

| విభాగం | ఆయకట్టు (ఎకరాలలో) | ఆయకట్టు సాధనకు పూర్తి చేయాల్సిన అంశాలు | ఒక్కో అంశంలోనూ ఉన్న కార్యకలాపాలు |
|---|---|---|---|
| I | 20,000 | అ) మోతే జలాశయ నిర్మాణం (1.645 టి.ఎమ్.సి.) | ఎక్స్) భూసేకరణ<br>వై) పి.ఎ.ఎఫ్. లకు పునరావాసం<br>జెడ్) సివిల్ పనులు |
| | | ఆ) 0.00 కి.మీ. నుండి 101.70 కి.మీ.వరకు వరద కాలువ | ఎక్స్) భూసేకరణ<br>వై) సివిల్ పనులు |
| II | 80,000 | అ) మిడ్ మానేరు జలాశయ నిర్మాణం (25.873 టి.ఎమ్.సి.) | ఎక్స్) భూసేకరణ<br>వై) పి.ఎ.ఎఫ్. లకు పునరావాసం<br>జెడ్) సివిల్ పనులు |
| | | ఆ) 101.70 కి.మీ. నుండి 122.00 కి.మీ. వరకు వరద కాలువ | ఎక్స్) భూసేకరణ<br>వై) సివిల్ పనులు |
| | | ఇ) 10,500 ఎకరాలు ఆయకట్టుకు నీరందించే మిడ్ మానేరు ఎడమ కాలువ (14.6 కి.మీ.) | ఎక్స్) భూసేకరణ<br>వై) సివిల్ పనులు |
| | | ఈ) 69,500 ఎకరాలు ఆయకట్టుకు నీరందించే కుడి కాలువ (64.25 కి.మీ.) | ఎక్స్) భూసేకరణ<br>వై) సివిల్ పనులు |

**ప్రాజెక్టు కార్యకలాపాల క్రమం:** ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలను సరైన క్రమంలో చేపట్టడమనేది, అత్యంత విలువైన ఆర్థిక వనరులను సర్వోత్తమ రీతిలో వినియోగించేందుకు దోహదపడుతుంది. ఎఫ్.ఎఫ్.సి. ప్రాజెక్టు విషయంలో వివిధ కార్యకలాపాలను చేపట్టడంలో సరైన క్రమాన్ని పాటించారా లేదా అన్న విషయాన్ని ఆడిట్ పరిశీలించింది.

మొదటి దశలోని తొలి విభాగం కింద 20,000 ఎకరాలకు సాగు నీరందించాలంటే మోతే జలాశయం, ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ పూర్తి చేయాల్సి ఉంటుంది.

---

[57] శతకోటి ఘనపుటడుగులు

[58] గండిపల్లి, గౌరవెల్లి, మిడ్‌మానేరు, మోతే, తోటపల్లి

**పట్టిక-9** లో సూచించిన విధంగా, మోతే జలాశయ నిర్మాణం, భూసేకరణ, పునరావాస కల్పనలపై ఆధారపడి ఉంది. ఐతే, పనులు అప్పగించిన సమయానికి భూములేవీ సేకరించలేదనీ, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలను (పి.ఎ.ఎఫ్. లను) గుర్తించడం, వారికి పునరావాసం కల్పించేందుకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించడం, సేకరించడం, ఇవేవీ చేయలేదనీ ఆడిట్ గమనించింది. మోతే జలాశయ నిర్మాణం సజావుగా సాగడానికి అవసరమైన ఈ కార్యకలాపాలపై దృష్టి పెట్టకుండా, మరో వైపు 2004 అక్టోబరు లో ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ పనులను అప్పగించేశారు. ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ పనులు రూ1,410.92 కోట్ల భారీ వ్యయంతో కూడుకుంది. మోతే జలాశయం నిర్మాణానికి కావల్సింది రూ139.81 కోట్లు మాత్రమే.

**పట్టిక-10**

| అంశం | ఒప్పందం కుదిరిన నెల | పనుల విలువ (రూపాయలు కోట్లలో) | 2009 జూలై నాటికి ఖర్చు (రూపాయలు కోట్లలో) | పనుల్లో పురోగతి (శాతం) |
|---|---|---|---|---|
| మోతే జలాశయం | 2007 జూలై/2009 ఏప్రిల్[59] | 139.81 | శూన్యం | శూన్యం |
| ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ | 2004 అక్టోబరు/2005 మార్చి[60] | 1410.92 | 1321.08 | 93.6 |
| మొత్తం | | 1550.73 | 1321.08 | |

అదే విధంగా, రెండో విభాగంలో 80,000 ఎకరాలకు సాగు నీరందించడానికి **పట్టిక-9** లో సూచించిన పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. మిడ్ మానేరు రిజర్వాయరు (ఎమ్.ఎమ్.ఆర్.) నిర్మాణం కూడా భూసేకరణ, పునరావాసం పైనే పూర్తిగా ఆధారపడి వుంది. ఈ రిజర్వాయరుకి సంబంధించిన భూసేకరణ, పి.ఎ.ఎఫ్. ల పునరావాసం అనే సంక్లిష్టమైన అంశాలపై చర్యలు తీసుకోకుండా, ముందుగానే ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ పనులు అప్పగించిన ఫలితంగా, అవసరమైన దానికంటే చాలా ముందుగా ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువపైనే ఖర్చు చేసినట్లైంది.

అవసరానికంటే ముందే ఎఫ్.ఎఫ్.సి. ప్రధాన కాలువ పనులను చేపట్టడం వల్ల ఈ పనుల్లో రూ1,321.08 కోట్ల నిధులు చిక్కుకుపోయాయి. ఈ మొత్తాలను ఆ సమయంలో నిధులు అవసరమున్న ఇతర ప్రాజెక్టులపై వినియోగించి ఉండాల్సింది. అంతే కాకుండా, భూసేకరణ, పునరావాసం చేపట్టకుండా, మిడ్ మానేరు జలాశయం పనులను అప్పగించడం వల్ల రూ76.76 కోట్లు ఖర్చు చేసిన తర్వాత పనులు మధ్యలో నిలిచిపోయాయి (2009 జూలై). పాక్షికంగా నిర్మించిన మట్టికట్ట వాతావరణ ప్రభావం వల్ల క్షీణించే అవకాశం ఉన్నందున అది ఎంతవరకూ ఉపయోగ పడుతుందన్నది కూడా అనుమానమే.

ఒప్పందం కింద వివరణాత్మక సర్వే, పూర్వశోధన కూడా కాంట్రాక్టరే చేస్తారు కనుక పనులు అప్పగించడానికి ముందే భూసేకరణ, పునరావాసం సాధ్యం కాదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). ఈ సమాధానాన్ని చూస్తే, ప్రాజెక్టు నిర్మాణానికి అనుసరిస్తున్న పద్ధతి సరైంది కాదన్న విషయం స్పష్టమౌతోంది.

**ప్రాజెక్టు రెండవ దశ**

ప్రాజెక్టు రెండోదశలో 1,20,000 ఎకరాలకు సాగునీటి సౌకర్యాలు కల్పించదలచారు. పనులను ఐదు ప్యాకేజీ లుగా విభజించి, 2008 ఏప్రిల్-ఆగస్టు మధ్య వేరువేరు సంస్థలకు అప్పగించారు. ముందుగా భూసేకరణ, పునరావాసం లను చేపట్టడంపైనే ఈ పనుల పురోగతి కూడా ఆధారపడి వుంది. మొదటి దశలో చేదు అనుభవం చవిచూసినప్పటికీ, రెండో దశలో కూడా, ముందస్తుగా భూములను సేకరించకుండా,

[59] 2007 జూలైలో మొదట కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసి, 2009 ఏప్రిల్ లో మరో సంస్థకు పనులను అప్పగించారు.

[60] ఎఫ్.ఎఫ్.సి. మొదటి మూడు ప్యాకేజీ లను 2004 అక్టోబరు లోనూ, మిగిలిన ప్యాకేజీ లను 2005 మార్చి లోనూ అప్పగించారు

పునరావాస కార్యకలాపాలు ఒక కొలిక్కి రాకుండానే నీటిపారుదల శాఖ ఈపనులను అప్పగించింది. ఆ ఐదు ప్యాకేజీల స్థితి **పట్టిక-11** లో చూపిన విధంగా ఉంది.

**పట్టిక-11** (రూపాయలు కోట్లలో)

| క్రమ సంఖ్య | పనిపేరు | అప్పగించిన నెల | ఒప్పందం గడువు | పని విలువ | ఖర్చు |
|---|---|---|---|---|---|
| 1 | తోటపల్లి నుండి గౌరవల్లి జలాశయానికి లిఫ్టు | 2008 ఆగస్టు | 48 నెలలు | 409.71 | 24.05 |
| 2 | తోటపల్లి జలాశయం నిర్మాణం | 2008 సెప్టెంబరు | 36 నెలలు | 131.68 | 0.85 |
| 3 | గౌరవల్లి జలాశయం నిర్మాణం | 2008 మే | 24 నెలలు | 43.13 | లేదు |
| 4 | గౌరవల్లి కుడి, ఎడమ కాలువలు | 2008 ఏప్రిల్ | 24 నెలలు | 166.88 | 47.01 |
| 5 | గౌరవల్లి నుండి గండిపల్లి వరకు లిఫ్టు, గండిపల్లి జలాశయం నిర్మాణం, కాలువలు | 2008 మే | 24 నెలలు | 49.90 | 6.55 |
| | మొత్తం | | | **801.30** | **78.46** |

క్రమసంఖ్యలు 3 నుండి 5 లోని పనులను 2008 ఏప్రిల్/మే లో అప్పగించారు. అవి 2010 ఏప్రిల్/మే లో పూర్తవ్వాలి. క్రమసంఖ్య-2 లోని పనిని 2008 సెప్టెంబరులో అప్పగించారు, అది 2011 సెప్టెంబరులో పూర్తవ్వాలి. ఐతే, క్రమసంఖ్య-1 లో ఉన్న పని పూర్తైతేనే దిగువవైపు ఉన్న మూడు ప్యాకేజీలకు (క్రమసంఖ్య 3-5) నీరు అందుతుంది. కానీ, క్రమసంఖ్య-1లోని పనిని 2008 ఆగస్టు లో అప్పగించారు. అంటే ఇది 2012 ఆగస్టులో మాత్రమే పూర్తవుతుంది. దీన్ని బట్టి, ఈ ఐదు ప్యాకేజీ లను సమన్వయ రీతిలో చేపట్టలేదని తెలుస్తోంది. అన్ని పనులూ ఏక కాలంలో పూర్తయ్యేలా పనులను అప్పగించాల్సింది.

ఆ విధంగా, ప్రాజెక్టు కింద వున్న వివిధ కార్యకలాపాలు/ పనులను సరైన క్రమంలో/సమన్వయ రీతిలో చేపట్టకపోవడం వల్ల ఎఫ్.ఎఫ్.సి. ప్రాజెక్టు పనులపై అవసరానికి ముందే భారీగా రూ1,476.30 కోట్లు ఖర్చు చేయడమైంది. మోతే, మిడ్ మానేరు జలాశయాలు పూర్తయ్యేవరకు ఈ నిధులు ఏ ప్రయోజనం లేకుండా, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో చిక్కుకుపోయి ఉంటాయి.

**సివిల్ పనుల అమలు - ఇతర ఆసక్తికరమైన విషయాలు**

సివిల్ పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేయగా ఈ కింది విషయాలు వెల్లడయ్యాయిః

**పనులను త్వరగా పూర్తి చేసినందుకు ప్రోత్సాహకానికి సంబంధించిన షరతుః** ఎఫ్.ఎఫ్.సి.ప్యాకేజీ-I పనులను[61] 30 నెలల్లో పూర్తి చేయడానికి రూ165.50 కోట్లకి అప్పగించారు. గడువు తేదీకి ఐదు రోజుల ముందే గుత్తేదారు పనులను పూర్తి చేసి, రూ1.64 కోట్ల ప్రోత్సాహకం క్లెయిమ్ చేసారు.

ఆడిట్ పరిశీలనలు ఇలా వున్నాయిః

- ఒప్పందం కింద చెయ్యాల్సిన పనుల్లో, జాతీయ రహదారి (ఎన్.హెచ్.) పై ఒక రోడ్డు వంతెన నిర్మాణం కుడా ఉంది. ఆ తరువాత దీన్ని ఒప్పందం పరిధి నుండి తొలగించారు. కానీ తదనుగుణంగా ఒప్పందం కాలాన్ని మాత్రం తగ్గించలేదు.
- జలాశయాలను నిర్మించకుండా ఎఫ్.ఎఫ్.సి.ని ముందుగా పూర్తి చేసినంత మాత్రాన ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. అందువల్ల ఈ షరతు అనవసరమైనది. కనుక ప్రోత్సాహకం రూపంలో చేసిన రూ1.64 కోట్ల చెల్లింపు నివారించి ఉండవచ్చు.

[61] 28.40 కి.మీ నుండి 43.00 కి.మీ వరకూ ఎఫ్.ఎఫ్.సి. తవ్వకం

ప్రభుత్వం తన సమాధానంలో (2010 నవంబరు), రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి కనీసం రెండు-మూడు నెలలు పడుతుందని అంగీకరించింది. ఐతే, తదనుగుణంగా ఒప్పందపు కాలాన్ని ఎందుకు తగ్గించలేదో వివరించ లేదు. పనులు ముందుగా పూర్తైనా ఏ ప్రయోజనమూ లేనప్పుడు, ఒప్పందంలో ప్రోత్సాహకం షరతును చేర్చడానికి గల కారణాలను కూడా ప్రభుత్వం తెలుపలేదు. ఆ విధంగా, ప్రోత్సాహకంగా చెల్లించిన రూ1.64 కోట్లూ నివారించతగ్గదే.

**అమలు మరియు నిర్వహణ (ఒ&ఎమ్)కు సంబంధించిన షరతు:** ప్యాకేజీ-1 కి సంబంధించిన టెండరు నోటీసు, ఒప్పందపు నిబంధనల ప్రకారం, పనులు పూర్తి చేసిన తర్వాత 24 నెలలపాటు కాలువను గుత్తేదారే నిర్వహించాలి. దీనికి, పనుల విలువలో రెండు శాతమైన రూ3.31 కోట్ల మొత్తాన్ని కేటాయించారు. అయితే, గుత్తేదారు కిచ్చిన మధ్యంతర చెల్లింపుల నుండి తదనుగుణంగా నిర్దిష్ట శాతంలో మొత్తాలను తగ్గించడంలో ఆ శాఖ విఫలమైంది. పనులకు చేసిన చెల్లింపులతో బాటు ఒ&ఎమ్ మొత్తం కూడా కాంట్రాక్టరుకు వెళ్లిపోయింది.

ప్రధాన కాలువ పూర్తయ్యి కాలువలోని నీరు వదిలితేనే కాంట్రాక్టరు కాలువను నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ఐతే, ప్రాజెక్టులోని ఇతర పనులను సమన్వయ రీతిలో చేపట్టకపోవడం వలన కాలువలోకి నీరు విడుదల చేయలేదు. దీంతో, గుత్తేదారు ఒ&ఎమ్ బాధ్యతలను నిర్వర్తించాల్సిన అవసరమే రాలేదు. అయినా కాలువ నిర్వహణ మొత్తాన్ని చెల్లించడంతో కాంట్రాక్టరుకు రూ3.21 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

కాలువలోకి నీరు వదలలేదనీ, ఈ కాలువ భాగంలో ఆయకట్టేదీ లేదనీ ప్రభుత్వం అంగీకరించింది (2010 నవంబరు). గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం చేకూరకుండా నివారించడానికి ఈ విషయంలో తన బాధ్యతలను నెరవేర్చినపుడు మాత్రమే గుత్తేదారుకు ఒ&ఎమ్ మొత్తాల చెల్లింపు జరిగేలా, ఒప్పందంలోని ఈ షరతును రూపొందించి వుండాల్సింది.

**విలువ ఆధారిత పన్ను (వ్యాట్) రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన షరతు:** ప్యాకేజీ-15[62] కి సంబంధించిన టెండరు నోటీసులో, టెండరు వేసేటప్పుడు కాంట్రాక్టర్లు అన్ని పన్నులు, సుంకాలనూ కలుపుకొని బిడ్డు ధరను ఇవ్వాలని ఉంది. ఐతే, విడివిడిగా పన్నుల వారీ మొత్తాల వివరాలు కూడా ఇవ్వాలని అందులో పేర్కొనలేదు. ఈ వివరాలు లేకపోతే, బిడ్డు ధరలో పన్నులు, సుంకాలను తప్పుగా కలిపినా, లేదా టెండర్ల అనంతరం పన్నులు, సుంకాలలో మార్పులు వచ్చినా చెల్లింపులు తప్పుగా జరిపే ప్రమాదం వుంది. ఈ ప్యాకేజీలో, వ్యాట్ నిమిత్తం మొదట రికవరీ చేసిన రూ1.04 కోట్ల మొత్తాన్ని ఆ తరువాత కాంట్రాక్టరుకు తిరిగి ఇచ్చేసారని గమనించడం జరిగింది.

ఇది గంపగుత్త కాంట్రాక్టనీ, బిడ్డు ధరలో పన్నులు కలిసి వున్నాయనీ, ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకంపై పనితీరు సమీక్షలో ఆడిట్ ఇదే విషయాన్ని లేవనెత్తినప్పుడు విడివిడిగా పన్నుల వారీ వివరాలను సమర్పించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గ్రహించింది.

**పనుల సబ్ కాంట్రాక్టుకు సంబంధించిన షరతు:** గుత్తేదారుకి తగిన సాంకేతిక అర్హత వుంటే తప్ప ఏ పనీ అప్పగించరు. అంతేకాకుండా, కాంట్రాక్టు (ప్యాకేజీ-15) లోని సాధారణ నిబంధనలలోని 5.1 షరతు ప్రకారం ఉప-గుత్తేదారుకు పనులు అప్పగించడానికి ముందే, డిపార్టుమెంటు నుండి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ఉప-కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడాన్ని నివారించాలంటే అనధికారిక సబ్ కాంట్రాక్టులను పసిగట్టేందుకు వీలుగా, ప్రధాన కాంట్రాక్టరు తన సిబ్బంది, యంత్రాల వివరాలను డిపార్టుమెంటుకు సమర్పించాలన్న నిబంధనను కాంట్రాక్టులో చేర్చాల్సింది.

---

[62] 70 కి.మీ నుండి 86 కి.మీ వరకు ఎఫ్.ఎఫ్.సి.తవ్వకం

అలాంటి షరతు లేకపోవడంతో, గతంలోని పనితీరు బాగాలేదన్న కారణంతో నీటిపారుదల శాఖ అంతకు ముందే నిరాకరించిన ఒక ఉప-గుత్తేదారు ఒప్పందంలోని అధికభాగం - అంటే రూ103.82 కోట్ల విలువైన (47.46 శాతం) పనులను నిర్వహించారు. డిపార్టుమెంటు ఈ విషయాన్ని కనిపెట్టలేకపోయింది.

యంత్రాలకు సంబంధించిన నిర్దిష్టమైన వివరాలు, పనిలో నియోగించే వ్యక్తుల పేర్లు సమర్పించాలన్న షరతును ఒప్పందంలో చేర్చలేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). సిబ్బంది, యంత్రాల వివరాలు సమర్పించాలన్న షరతు లేకపోతే, తగిన సాంకేతిక సామర్థ్యం లేని ఉప-కాంట్రాక్టర్లు అనధికారికంగా పనులు నిర్వహించినా ఆ శాఖ కనిపెట్ట లేకపోతోందన్న వాస్తవాన్ని ఈ సమాధానం విస్మరిస్తోంది. పైగా, కాంట్రాక్టు నిబంధనలను అతిక్రమించినందుకు ప్రధాన కాంట్రాక్టరుపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

**డీవాటరింగ్, బ్లాస్టింగ్ చార్జీల చెల్లింపులకు సంబంధించిన షరతు:** ప్యాకేజీ-15లో ప్రధాన కాంట్రాక్టరు పనుల్లో పురోగతి చూపకపోవడంతో ఈ ఒప్పందం పరిధి నుండి రూ87.01 కోట్లు, రూ28.34 కోట్ల విలువైన పనులను తొలగించి అదే ఒప్పందం రేట్లు, నిబంధనలతో మరో రెండు సంస్థలకు (ప్యాకేజీలు-15ఎ,15బి) గా అప్పగించారు (2007 మే/ 2008 ఫిబ్రవరి).

ఈ ఒప్పందాల్లోని 3.3 నిబంధన ప్రకారం, బ్లాస్టింగు కార్యకలాపాలు చేపట్టేముందు చుట్టుపక్కల ఉండే ప్రజలకు, ఆస్తులకు నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కనుక, అవసరమైన చోట్ల కంట్రోల్డ్ బ్లాస్టింగు చెయ్యాల్సిన బాధ్యత కాంట్రాక్టరుకు ఉంది. ఒప్పందంలోని నిబంధన 3.1.18, బిల్ ఆఫ్ క్వాంటిటీస్ లోని 10వ షరతు ప్రకారం, నీరు తోడటానికి (డీ వాటరింగ్) విడిగా చెల్లింపులేవీ ఉండవు.

పనులు జరిగే సమయంలో, కంట్రోల్డ్ బ్లాస్టింగు, డీ వాటరింగ్ చార్జీలను చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరగా, అదనపు చెల్లింపులకు వీలు కల్పిస్తూ, రూ39.54 కోట్లకి (కంట్రోల్డ్ బ్లాస్టింగు కోసం రూ35.27 కోట్లు, డీ వాటరింగ్ కోసం రూ1.25 కోట్లు, నీటి అడుగున తవ్వకాలకి రూ3.02 కోట్లు) అనుబంధ ఒప్పందాలు కుదుర్చుకున్నారు (2008 అక్టోబరు).

మొదటి ఒప్పందంలోని రేట్లు, నిబంధనల ప్రకారమే పనులను అప్పగించారు కనుక, కంట్రోల్డ్ బ్లాస్టింగు, డీ వాటరింగ్‌ల కోసం అదనంగా చెల్లించడం అభ్యంతరకరం. అంతేకాకుండా, ఈ తప్పుడు చెల్లింపుల వల్ల ప్రధాన గుత్తేదారు కూడా ఈ ఛార్జీల రూపంలో రూ23.17 కోట్ల మొత్తాన్ని క్లెయిమ్ చేసారు. మొత్తం మీద ప్రభుత్వం పై రూ62.71 కోట్ల మేర నివారించదగ్గ అదనపు భారం పడింది.

ఎఫ్.ఎఫ్.సి. మల్లియల్ మండలంలోని నూకపల్లి, ముత్యంపేట గ్రామాల గుండా వెళ్లాల్సి ఉందనీ, ఇతర గ్రామాలలో కూడా కంట్రోల్డ్ బ్లాస్టింగు చేసారు కనుక ఈ అదనపు చెల్లింపులు చేసామనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). గ్రామాల గురించి ఇచ్చింది ప్రాథమిక సమాచారం మాత్రమే. వివరణాత్మక సర్వే, పూర్వ శోధనలు గుత్తేదారే చేయాలి కనుక ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. అంతేకాకుండా, కంట్రోల్డ్ బ్లాస్టింగుకు సంబంధించిన షరతు, ఆ రెండు గ్రామాలకు మాత్రమే పరిమితం కాదు.

ఇక డీవాటరింగ్ విషయానికి వస్తే, అంచనాలలో ఈ అంశం లేదు కనుక దీనికి అదనంగా చెల్లించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 నవంబరు). ఈ సమాధానం అంగీకార యోగ్యంగా లేదు. ఎటువంటి అదనపు చెల్లింపులు లేకుండానే గుత్తేదారు డీవాటరింగు చెయ్యాలని కాంట్రాక్టులో స్పష్టంగా ఉంది. పైగా, అంచనా అనేది కేవలం శాఖాపరమైన పత్రం మాత్రమే గానీ ఒప్పందంలో భాగం కాదు.

### 3.4.5 రాజీవ్ భీమ ఎత్తిపోతల పథకం

**టెండర్ల అనంతరం పనుల పరిమాణాలు తగ్గడం వల్ల గుత్తేదార్లకు రూ21.25 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.**

కృష్ణా నీటిని రెండు వేర్వేరు చోట్ల నుండి ఎత్తిపోతల ద్వారా తరలించి మహబూబ్‌నగర్ జిల్లాలో దీర్ఘకాలికంగా కరువు ఎదుర్కుంటున్న ఎత్తైన ప్రాంతాలలోని 2.03 లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని 2005 లో చేపట్టారు. ప్రాజెక్టు పనులను 19 ప్యాకేజీలుగా విభజించి 2005 నుండి 2008 మధ్య కాలంలో అప్పగించారు (వివరాలు *అనుబంధం - 3.9* లో ఉన్నాయి). ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది. 2010 మార్చి నాటికి ఈ ప్రాజెక్టుపై రూ1,334.13 కోట్లు ఖర్చు చేసారు.

ఈ ప్రాజెక్టు నిర్వహణను ఆడిట్ పరిశీలించగా కింది విషయాలు వెల్లడయ్యాయిః

**పనుల నిర్వహణ**

ఈ క్రింది విధంగా, టెండరు తరువాత పనుల పరిమాణాలలో చాలా తగ్గుదలలు వున్నాయిః

**ప్రధాన కాలువ ప్యాకేజీలు (19, 22, 27)ః** కాలువల్లో వేసే సిమెంటు కాంక్రీటు లైనింగు ఖర్చు, దాని మందం, వేసే వైశాల్యంపై ఆధారపడి వుంటుంది. అంచనాలు తయారుచేసేటప్పుడు 100 మిల్లీమీటర్లు మందంగల లైనింగును పరిగణనలోకి తీసుకున్నారు. ఐతే, టెండరు నోటీసులో దాని మందం, వైశాల్యాలను సూచించలేదు. వాస్తవంగా జరుగుతున్న పనుల ప్రకారం 60 - 75 మిల్లీ మీటర్ల మందంతో లైనింగు వేస్తున్నారని ఆడిటు గమనించింది. పనుల పరిమాణాలలో వచ్చిన ఈ తగ్గుదల విలువ రూ13.22 కోట్లు.

**లిఫ్ట్-II ప్యాకేజీ ః** అలాగే లిఫ్ట్-II ప్యాకేజీ లో 14-16 మిల్లీ మీటర్ల మందం గల ఉక్కుతో 2,808 మీటర్ల పొడవు గల పైపు లైన్లు వేయాలని అంచనాలు తయారుచేసారు. కానీ, ఇప్పుడు 14 మిల్లీ మీటర్ల మందం గల ఉక్కు ఉపయోగించి కేవలం 740 మీటర్ల పైపు లైన్లు మాత్రమే వేస్తున్నారు. దీనివల్ల తగ్గిన ఉక్కు పరిమాణం విలువ రూ8.03 కోట్లు.

టెండర్లు ముగిసిన తరువాత పనుల పరిమాణాలలో తగ్గుదల ఉంటే ఆ ప్రయోజనం గుత్తేదారుకు కాకుండా ప్రభుత్వానికి చేకూరేలా ఒప్పందాలలో తగిన నిబంధనలు చేర్చలేదని ఆడిట్ గమనించింది. ఈ కారణంగా, గుత్తేదార్ల చెల్లింపులను తదనుగుణంగా తగ్గించలేదు. దీని పర్యవసానంగా, పైన తెలిపిన విధంగా పనుల పరిమాణాల్లో చోటు చేసుకున్న రూ21.25 కోట్ల[63] విలువ చేసే తగ్గుదలల ప్రయోజనం ప్రభుత్వానికి చేకూరలేదు. ఆ మేరకు గుత్తేదార్లు అనుచిత లబ్ధి పొందారు.

ఆడిటు ఈ కింది విషయాలను కూడా గమనించింది.

- పనులను కొలవడం, వాటిని కొలతల పుస్తకాలలో (ఎమ్.బి.లు) నమోదు చేయడమనే కీలక విధులను శాఖాపరమైన ఇంజనీర్లు నిర్వర్తించడంలేదు. అలా చేసి వుంటే పనుల విషయంలో స్వతంత్ర నిర్ధారణ ఉండేది. కానీ, దీనికి బదులు ఈ విధులను గుత్తేదార్లకే అప్పగించారు.
- తవ్వకం పనుల విలువ 'నేల స్వభావం', తవ్విన 'పరిమాణం'లపై ఆధారపడి వుంటుంది. అయితే ఎమ్.బి. లలో నేలల వారీ పరిమాణాలను నమోదు చేయడం లేదు.

అంచనాలో చేర్చిన అంశాలు తాత్కాలికమైనవనీ, ఇంజనీరింగు, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఇ.పి.సి.) కాంట్రాక్టుల్లో పరిమాణాలలోని హెచ్చు తగ్గులతో సంబంధం లేదనీ ప్రభుత్వం సమాధానమిచ్చింది

[63] శాఖాపరమైన అంచనా రేట్లు x గుత్తేదారు పేర్కొన్న టెండరు శాతం

(2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యమైంది కాదు. సాగునీటి ప్రాజెక్టులకు భారీ మొత్తాలు కావాలి కనుక వ్యయ నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఉంది. సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు, పనుల పరిమాణాలపైనే నేరుగా ఆధారపడి వుంటుంది కనుక పరిమాణాలను ఉపేక్షించలేము. యూనిట్ ధర కాంట్రాక్టు పద్ధతిలో ఇదివరకే వున్న అవసరమైన షరతులు, నిబంధనలను ఈ ఒప్పందాలలో చేర్చి వుంటే, టెండరు అనంతరం పనుల పరిమాణాలలో వచ్చిన తగ్గుదలల ప్రయోజనం గుత్తేదార్లకు కాకుండా ప్రభుత్వానికే చేకూరేది.

**ఒప్పందం షరతుల రూపకల్పన, అమలు**

ఒప్పందపు షరతులను సరిగా రూపొందించకపోవడం/ పాటించకపోవడాన్ని ఆడిట్ గమనించింది. ఆ వివరాలిలా వున్నాయిః

**బ్లాస్టింగ్ పనులకు సంబంధించిన షరతుః** సంగంబండ స్పిల్‌వేకు సంబంధించిన ఒప్పందంలోని నిబంధన ప్రకారం, చుట్టుపక్కల ఉండే వ్యక్తులు, ఆస్తులకు నష్టం కలగకుండా ఉండేలా గుత్తేదారు సరైన జాగ్రత్తలు తీసుకుంటేనే, అవసరమైన చోట్ల బ్లాస్టింగును అనుమతించాలి. ఈ షరతును ఉల్లంఘిస్తూ సంగంబండ గ్రామం దగ్గర బహిరంగ పేలుళ్లు (ఓపెన్ బ్లాస్టింగ్) జరిపారు. దీంతో, ఆ గ్రామస్తులు ఆందోళన చేపట్టగా, వారికి పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం రూ7.20 కోట్ల ప్యాకేజీని మంజూరు (2007 జనవరి) చేయాల్సి వచ్చింది. అంతే కాకుండా, కంట్రోల్డ్ బ్లాస్టింగ్ కోసం గుత్తేదారుకి కూడా రూ2 కోట్లు సొమ్ము చెల్లించారు.

ఆ గ్రామం, పనులు జరిగే చోటునుండి 150 - 200 మీటర్ల దూరంలో, అంటే జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన పరిధి (400 మీటర్లు) లోనే వుందని, ఓపెన్ బ్లాస్టింగ్ ప్రభావం నుండి తప్పించుకోవడం కోసమే గ్రామాన్ని మరో చోటుకు తరలించాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారనీ ప్రభుత్వం తన సమాధానంలో (2010 జూన్) అంగీకరించింది. మొదట్లోనే కంట్రోల్డ్ బ్లాస్టింగ్ చేసి ఉంటే పునరావాస ప్యాకేజీ మంజూరును నివారించి ఉండవచ్చన్న వాస్తవాన్ని ఈ సమాధానం ధృవపరుస్తోంది.

**పన్నులు, సుంకాలకు సంబంధించిన షరతులుః** లిఫ్ట్-II ప్యాకేజీ అంచనాలకు రూ377.59 కోట్లతో సాంకేతిక మంజూరీ ఇచ్చారు (2004 డిసెంబరు). అందులో ఎలక్ట్రోమెకానికల్, హైడ్రో మెకానికల్ యంత్ర పరికరాలపై సెంట్రల్ ఎక్సైజ్ సుంకం (సి.ఇ.డి.) నిమిత్తం రూ21.96 కోట్లు వుంది. ఈ పనులను 2005 మార్చిలో మెస్సర్స్ ఎన్.ఇ.సి.-ఎన్.సి.సి.-మైటాస్ (జె.వి.)కి అప్పగించారు. నీటి సరఫరా పథకాలలో వినియోగించే ఎలక్ట్రో మెకానికల్, హైడ్రో మెకానికల్ యంత్ర పరికరాలపై 2004 జనవరి నుండే, అంటే, సాంకేతిక మంజూరు ఇవ్వకముందు నుండే సి.ఇ.డి. మినహాయింపు ఉంది. కనుక, అంచనాలలో సి.ఇ.డి. ని కలపడం సరికాదు. దీనివలన, ప్రభుత్వం నిర్దేశించిన 105 శాతం టెండరు పరిమితి[64] కన్నా అధికంగా ఉన్నప్పటికీ బిడ్లను తప్పుగా ఆమోదించడమైంది. సి.ఇ.డి. ని మినహాయిస్తే సరైన అంచనా విలువ రూ355.63 కోట్లు. దీనిపై 105 శాతం రూ373.41 కోట్లు కాగా, పనులను రూ391.55 కోట్లకు అంటే రూ18.14 కోట్ల అధిక మొత్తానికి అప్పగించారు.

[64] బిడ్ ధర అంచనా విలువకి 105 శాతం మించకపోతేనే పనులను అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి (పి.డబ్ల్యు.రిఫార్మ్స్) శాఖ జి.ఒ.ఎమ్.ఎస్. సంఖ్య133 (తేదీ 2004 నవంబరు 20) లో ఆదేశించింది.

పట్టిక-12

(రూపాయలు కోట్లలో)

| ప్యాకేజీ | అంచనా విలువ | అంచనాలో కలిపిన సి.ఇ.డి. మొత్తం | సి.ఇ.డి. మినహా సరైన అంచనా విలువ | పనుల అప్పగింతకు గరిష్ట పరిమితి | అప్పగించిన అసలు విలువ | 105 శాతం పరిమితి కంటే అధికం |
|---|---|---|---|---|---|---|
| లిఫ్ట్-II | 377.59 | 21.96 | 355.63 | 373.41 | 391.55 | 18.44 |

టెండర్లు పిలిచినప్పుడు మెస్సర్స్ ఎన్.ఇ.సి.-ఎన్.సి.సి.-మైటాస్ (జె.వి.) రూ391.55 కోట్లు, మెస్సర్స్ పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ రూ397.71 కోట్లు కోట్ చేసాయి. ఈ రెండు సంస్థలూ తమ బిడ్లలో సి.ఇ.డి. అంశాన్ని కలిపాయని ఆడిట్ గమనించింది. ఐతే, అవి వేరు వేరు సి.ఇ.డి. శాతాలను సూచించాయి.

పట్టిక-13

(రూపాయలు కోట్లలో)

| బిడ్డరు | సి.ఇ.డి. కలిసి ఉన్న బిడ్ ధర | బిడ్ లో సూచించిన సి.ఇ.డి. శాతం | సి.ఇ.డి. మొత్తం | సి.ఇ.డి.ని మినహాయిస్తే బిడ్ ధర |
|---|---|---|---|---|
| పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ | 397.71 (ఎల్-2) | 16.32 | 26.62 | 371.09 (ఎల్-1) |
| ఎన్.ఇ.సి.-ఎన్.సి.సి.-మైటాస్ | 391.55 (ఎల్-1) | 8.16 | 13.31 | 378.24 (ఎల్-2) |

సి.ఇ.డి. మినహాయింపు దృష్ట్యా సి.ఇ.డి. అంశాన్ని తగ్గించి బిడ్లను పోల్చి చూడాల్సింది. సి.ఇ.డి. అంశాన్ని తీసేస్తే, మెస్సర్స్ పటేల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ అత్యల్ప బిడ్డరు అయి ఉండేది. కానీ అలా చేయకపోవడంతో పనులను రూ20.46 కోట్లు అధికంగా మెస్సర్స్ ఎన్.ఇ.సి.-ఎన్.సి.సి.-మైటాస్ (జె.వి.)కి అప్పగించారు.

అంచనాలను తయారు చేసేటప్పుడు సి.ఇ.డి. మినహాయింపు గురించి డిపార్టుమెంటుకు తెలియదని ప్రభుత్వం సమాధానం ఇచ్చింది (2010 జూన్). అంతేకాకుండా, టెండరు నిబంధనల ప్రకారం, బిడ్ ధరలో అన్ని పన్నులు, సుంకాలు కలసి ఉంటాయనీ, అమలులో ఉన్న పన్నులు, సుంకాలను పరిగణనలోకి తీసుకునే బిడ్డర్లు తమ ధరను కోట్ చేసి ఉంటారని కూడా సమాధానమిచ్చింది. ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. పై పట్టికలో తెలిపిన విధంగా రెండు సంస్థలూ తమ బిడ్లలో సి.ఇ.డి.ని కలిపాయి. అంచనాలను తయారు చేసినపుడు సి.ఇ.డి. మినహాయింపు గురించి ఆ శాఖకు తెలియకపోయినా, కనీసం టెండర్లను ఖరారు చేయడానికి ముందైనా, ప్రత్యేకించి బిడ్డర్లు తమ బిడ్లలో వేర్వేరు రేట్లను (16.32 శాతం, 8.16 శాతం) సూచించారని గమనించిన తర్వాతైనా, పన్నుల తాజా పరిస్థితి గురించి తెలుసుకొని ఉండాల్సింది.

**దశలవారీ చెల్లింపునకు సంబంధించిన షరతు:** ఎలక్ట్రోమెకానికల్, హైడ్రో మెకానికల్ అంశాలకు సంబంధించి, దశల వారీగా, నిర్దిష్ట శాతాల ప్రకారం చెల్లింపులు చేయాలని ఆ ఒప్పందాలలో వుంది. ఐతే, పనులను అప్పగించిన తరువాత కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా చెల్లింపు పద్ధతిని మార్పు చేసారని ఆడిట్ గమనించింది.

**పట్టిక-14**

| చెల్లింపు దశలు | ఒప్పందం ప్రకారం శాతం | సవరించిన శాతం |
|---|---|---|
| సరఫరా సమయంలో | 70% | 85% |
| స్థాపనకి | 20% | 10% |
| పరీక్షకి, మొదలు పెట్టడానికి | 5% | |
| తుది బిల్లు సమయంలో | లేదు | 5% |
| గ్యారంటీ కాలం ముగిసినప్పుడు | 5% | లేదు |

సరఫరా కోసం చేసే చెల్లింపు, వాటి అసలు విలువ కంటే తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకునే చెల్లింపు పద్ధతిని మార్పు చేసామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. చెల్లింపు విధానాన్ని మార్చడం, పైగా ముందుగానే అధికభాగం (85 శాతం) చెల్లింపు విడుదల చేయడమనేది టెండరు నోటీసులో సూచించిన చెల్లింపు పద్ధతిని/ఒప్పందపు నిబంధనలను అతిక్రమించడమే. అంతేకాకుండా, యంత్రాల స్థాపన, పరీక్షించడం, మొదలు పెట్టడం అనేవి ముఖ్యమైన కార్యకలాపాలు/కీలక నియంత్రణ దశలు. అలాంటి కీలక దశల్లో విడుదల చెయ్యాల్సిన మొత్తాలను తగ్గించడం ప్రమాదకరం. అంతేకాకుండా, ఈ సవరించిన చెల్లింపు పద్ధతిలో గ్యారంటీ కాలానికి సంబంధించి కొంత శాతాన్నైనా తమ వద్ద అట్టిపెట్టుకోకుండా గ్యారంటీ విషయంలో డిపార్టుమెంటు రాజీ పడింది. చెల్లింపు పద్ధతిని మార్చడం వల్ల టెండర్ల మాన్యత నీరుగారి పోవడమే కాకుండా, దీనివల్ల కాంట్రాక్టర్లకు ప్రతి బిల్లులోనూ ముందుగానే చెల్లింపులు విడుదలౌతున్నాయి. ఇది కాంట్రాక్టర్లకు అనుచిత ప్రయోజనమేనన్నది సుస్పష్టం. లిఫ్ట్-1, లిఫ్ట్-2 ప్యాకేజీల్లో ఒక బిల్లులో ఆడిట్ గమనించిన ఇలాంటి ముందస్తు చెల్లింపులను **పట్టిక-15** లో ఉదహరించడమైంది.

**పట్టిక-15** (రూపాయలు కోట్లలో)

| ప్యాకేజీ | అంశం | బిల్లు సంఖ్య, తేదీ | చెల్లించిన సొమ్ము | చెల్లించాల్సిన సొమ్ము | వ్యత్యాసం |
|---|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) | (6) = 4-5 |
| లిఫ్ట్ - I | సరఫరా, స్థాపన | 42వ మధ్యంతర బిల్లు 2009 జనవరి 23 | 185.42 | 161.92 | 23.50 |
| లిఫ్ట్ - II | సరఫరా, స్థాపన | 42వ మధ్యంతర బిల్లు 2008 నవంబరు 20 | 131.22 | 119.96 | 11.26 |
| మొత్తం | | | | | **34.76** |

**మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై వడ్డీ రేటుకి సంబంధించిన షరతు:** లిఫ్ట్-II ప్యాకేజీ (2005 మార్చి) లో, గుత్తేదారుకు చెల్లించిన రూ19.58 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్‌పై సాలీనా 12 శాతం వడ్డీ వసూలు చేయాలని ఒప్పందంలో వుంది. ఆ తరువాత (2007 అక్టోబరు) ఈ వడ్డీ రేటును అంతకు ముందునుంచీ వర్తించేలా 8 శాతానికి తగ్గించారు. ఫలితంగా గుత్తేదారుకు రూ0.68 కోట్ల అనుచిత ప్రయోజనం చేకూరింది. టెండర్ల అనంతరం షరతుల్లో మార్పులు చేయడమనేది, బిడ్డర్లందరికీ సమానావకాశం కల్పించలేదనడానికి మరో ఉదాహరణ.

అమలులో వున్న వడ్డీ రేటుతో సమానంగా ఉండేలా ఒప్పందంలో వున్న 12 శాతం వడ్డీ రేటుని తగ్గించామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. సమయానుకూలంగా వడ్డీరేటును మార్చాలన్న షరతు ఒప్పందంలో ఎక్కడా లేదు కనుక, టెండర్ల అనంతరం వడ్డీరేటును తగ్గించడమనేది స్పష్టంగా గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం చేకూర్చడమే.

**ప్రాజెక్టు కార్యకలాపాలను చేపట్టడంలో సరైన క్రమం, పనుల్లో సమన్వయం**

ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానంగా ఈ కింది కార్యకలాపాలున్నాయిః

(ఎ) భూసేకరణ

(బి) సివిల్, ఎలక్ట్రో-మెకానికల్ పనుల నిర్వహణ

**భూసేకరణః** పనులను అప్పగించడానికి ముందే, పనులకు అత్యంత కీలకమైన భూములను గుర్తించడం, సేకరించడం చేయలేదు. ప్రాజెక్టు కోసం సేకరించాల్సిన మొత్తం భూమి 25,364 ఎకరాలు. ప్రాజెక్టు పనులను 2005 ఫిబ్రవరిలో ఆరంభించారు. ప్రాజెక్టు పనులకు నిర్దేశించిన గడువు ముగిసినా, పనులు ఆరంభించిన ఐదేళ్ల తరువాత కూడా ఇప్పటికీ ఆ భూములను పూర్తిగా సేకరించలేదు. 2010 మార్చి నాటికి భూసేకరణ స్థితి **పట్టిక-16** లో చూపిన విధంగా ఉంది.

**పట్టిక-16**

| సేకరించాల్సిన మొత్తం భూమి | భూసేకరణ అధికార్లకు పంపిన ప్రతిపాదనలు | 2010 మార్చినాటికి సేకరించిన భూములు | ఇంకా సేకరించాల్సింది | ఇంకా ప్రతిపాదనలు పంపాల్సినది |
|---|---|---|---|---|
| 25,364 ఎకరాలు | 23,830 ఎకరాలు | 20,212 ఎకరాలు | 5,152 ఎకరాలు | 1,534 ఎకరాలు |

ఇప్పటికీ నీటిపారుదల శాఖ 1,534 ఎకరాలకు సంబంధించిన భూసేకరణ ప్రతిపాదనలను భూసేకరణ అధికారులకు పంపాల్సి వుంది (2010 మార్చి). పనులు సజావుగా సాగేందుకు వీలుగా, భూసేకరణ పూర్తయిన తరువాతనే లేదా కనీసం చివరి దశకు చేరాక మాత్రమే పనులను అప్పగించి వుండాల్సింది. అలా చేయకపోవడం వలన నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి కాలేదు.

పూర్వశోధన (ఇన్వెస్టిగేషన్) పూర్తై, పనులు జరగాల్సిన మార్గం (ఎలైన్‌మెంటు) ఖరారైన తర్వాత మాత్రమే భూసేకరణ ప్రక్రియ మొదలు పెట్టగలమని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 జూన్). ఐతే, ఈ వైఖరి కారణంగా పనులకు ఆటంకం కలిగి, అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టుల్లో, భారీ మొత్తాలలో నిధులు ఎలాంటి ప్రయోజనమూ లేకుండా దీర్ఘకాలం పాటు చిక్కుకుని ఉండిపోయే ప్రమాదం ఉందన్న వాస్తవాన్ని ఈ సమాధానం విస్మరిస్తోంది. అదే సమయంలో నిధులు అవసరమున్న ఇతర ప్రాజెక్టులకు/ సంక్షేమ పథకాలకు ఈ విలువైన మొత్తాలు అందుబాటులో లేకుండా పోతాయి.

**పనుల మధ్య సమన్వయంః** ***అనుబంధం - 3.9*** ను చూస్తే, వివిధ ప్యాకేజీలను అప్పగించడంలో సమన్వయం లోపించిందని స్పష్టమౌతోంది. లిఫ్ట్ పనులు, రిజర్వాయర్లు, ప్రధాన కాలువలను 2007 లో పూర్తి చేయాలని నిర్దేశించారు. ప్రాజెక్టును నీటి వనరులతో కలిపే కీలకమైన అప్రోచ్ ఛానల్, సమాంతర కాలువలకు సంబంధించిన పనులను మాత్రం 2008 మే/2009 డిసెంబరులో పూర్తి చేసేలా అప్పగించారు. పనులను అవసరానికి ముందే చేపట్టకుండా, ప్రాజెక్టు పూర్తవ్వాల్సిన తేదీకే ప్రతి ఒక్క ప్యాకేజీ కూడా పూర్తయ్యేలా

పనులను అప్పగించి ఉండాల్సింది. అలా చేస్తే, అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో అమూల్యమైన నిధులు చిక్కుకుపోకుండా ఉంటాయి.

ఆ విధంగా, ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలను సరైన క్రమంలో చేపట్టకపోవడం, పనుల ప్యాకేజీ లను సమన్వయ రీతిలో అప్పగించకపోవడం వల్ల, ఐదేళ్లు గడచిన తరువాత కూడా 2.03 లక్షల ఎకరాల ఆయకట్టులో[65] ఒక్క ఎకరానికి కూడా సాగునీటి సౌకర్యాన్ని అందించలేదు. ఈ ప్రాజెక్టుపై ఖర్చు చేసిన రూ1,334.13 కోట్ల భారీ నిధులు అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో స్తంభించి పోయాయి. అమూల్యమైన ఈ నిధులు, అవసరమైన ఇతర ప్రాజెక్టులు/ సంక్షేమ పథకాలకు కూడా అందకుండా పోయాయి.

### 3.4.6 కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు

**కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు పనుల్లో ప్రభుత్వ ప్రయోజనాలు కాపాడే నియంత్రణలు లేకపోవడం వలన కాంట్రాక్టరుకు రూ22.43 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.**

ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని చినమల్లవరం గ్రామంవద్ద గుండ్లకమ్మ నదికి అడ్డంగా గుండ్లకమ్మ జలాశయం నిర్మించడం ద్వారా 12,845 టి.ఎమ్.సి.[66] ల నీటిని వినియోగించి ఖరీఫ్‌లో 62,368 ఎకరాలకు, రబీలో 80,060 ఎకరాలకు సాగునీటి సౌకర్యాలు అందించడంతో పాటు, ఒంగోలు పట్టణానికీ, మరో 43 గ్రామాలకూ త్రాగునీరు సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణాన్ని తలపెట్టారు. ప్రాజెక్టు పనులను మూడు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు అప్పగించారు (2006 జనవరి - 2007 మే). ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి :

**కాంట్రాక్టరుకు అనుచిత లబ్ధి**

ప్యాకేజీ-2 పనుల్లో కాంట్రాక్టరుకు ఈ కింద వివరించిన విధంగా రూ24.66 కోట్ల అనుచిత ప్రయోజనాలు చేకూరాయని ఆడిట్ గమనించింది.

- కాంట్రాక్టరు వాస్తవంగా చేసిన పనుల పరిమాణాల ప్రకారమే చెల్లింపులను నియంత్రించడం ద్వారా ప్రభుత్వ ప్రయోజనాన్ని కాపాడే ఏర్పాటు ఒప్పందంలో లేదు. ఈ కింది పనుల్లో కాంట్రాక్టరుకి చెల్లించే మొత్తాలు, చెల్లించాల్సిన విలువ[67] కంటె రూ22.43 కోట్లు అధికంగా ఉన్నాయని ఆడిటు గమనించింది.

**పట్టిక-17** (రూపాయలు కోట్లలో)

| పనుల వివరణ | అంచనా విలువ | నియంత్రణలు ఉండి వుంటే చెల్లించాల్సిన మొత్తం | చెల్లిస్తున్న మొత్తం | శాతం | అధికం |
|---|---|---|---|---|---|
| కుడి, ఎడమ ప్రధాన కాలువలు | 9.65 | 9.16 | 18.80 | 205.24% | 9.64 |
| సిమెంటు కాంక్రీటు కట్టడాలు | 17.00 | 16.13 | 28.92 | 179.29% | 12.79 |
| మొత్తం | | | | | **22.43** |

65 నీటిపారుదల క్రింద తీసుకురావల్సిన ప్రాంతం

66 శతకోటి ఘనపుటడగులు

67 శాఖాపరమైన అంచనాల ప్రకారం విలువ X కాంట్రాక్టరు కోట్ చేసిన టెండరు శాతం

ఇ.పి.సి. కాంట్రాక్టు పద్ధతిలో చెల్లింపులకు పరిమాణాలతో సంబంధం ఉండదని, కాంట్రాక్టరు సమర్పించిన విధంగానే చెల్లింపు పట్టికల (పేమెంటు షెడ్యూళ్లు) ను ఆమోదించారని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 ఆగస్టు). ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. నీటిపారుదల ప్రాజెక్టులలో పనుల విలువ వాస్తవంగా చేసిన పనుల పరిమాణాలపైనే ఆధారపడి వుంటుంది. కాంట్రాక్టరు పేర్కొన్న ధర సరైనదా కాదా అనే విషయం తెలుసుకోడానికి బిడ్ ధరను అంచనా వేసిన పరిమాణాల విలువతో పోల్చి చూస్తారు. ప్రస్తుత కేసులో, కాంట్రాక్టరు కాలువల త్రవ్వకం, కాంక్రీటు కట్టడాల విషయంలో అంచనా వేసిన పరిమాణాలకు మించి 105.24 శాతం, 79.29 శాతం పనులు అదనంగా చేసారనీ, ఈ అధిక చెల్లింపులకు కాంట్రాక్టరు అర్హుడేననీ తెలిపే రికార్డులేవీ లేవు. తగిన నియంత్రణలు ఉండి ఉంటే కాంట్రాక్టరుకు ఈ అనుచిత ప్రయోజనం చేకూరేది కాదు.

- ప్యాకేజీ-2 పనులు జరుగుతున్న సమయంలో, అసలు పనులు నిర్వహిస్తున్న మెస్సర్స్ మైటాస్-ఎన్.సి.సి. (జె.వి.) సంస్థకు అదనంగా రెండు రైల్వే క్రాసింగుల నిర్మాణం పనులను కూడా అప్పగించారు. ఈ అదనపు పనికి ధర చెప్పమని అడిగినపుడు మెస్సర్స్ మైటాస్-ఎన్.సి.సి. (జె.వి.) మొదట్లో రూ9.14 కోట్లు కోట్ చేసింది (2008 మే 21). ఆ తరువాత (2008 మే 28) దీనిపై అదనంగా 5.13 శాతం డిస్కౌంట్ కూడా ఇచ్చింది. ఆ విధంగా, ఈ అదనపు పనికి కాంట్రాక్టరు వాస్తవంగా కోట్ చేసిన ధర రూ8.67 కోట్లు. ఐతే, కాంట్రాక్టరు కోట్ చేసిన ధరను విస్మరిస్తూ, పనులను రూ9.11 కోట్లకి అప్పగించారని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది (2008 అక్టోబరు). దీనివల్ల ఆ సంస్థకు రూ0.44 కోట్ల అనుచిత ప్రయోజనం చేకూరింది.

  ఈ అదనపు పనిని కొటేషన్ల ఆధారంగా అప్పగించినందున టెండరు డిస్కౌంటు వర్తించదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. కాంట్రాక్టరు తనకు తానై ఇచ్చిన తగ్గింపును విస్మరించడం వల్ల ప్రభుత్వానికి రూ0.44 కోట్లు నష్టం వచ్చింది, ఆ మేరకు కాంట్రాక్టరుకి అనుచిత లబ్ధి చేకూరింది.

- ఒప్పందం (ప్యాకేజీ-2) లోని 12 వ నిబంధన ప్రకారం, కాంట్రాక్టరు తన సొంత ఖర్చులో అవసరమైన చోట తాత్కాలిక నీటి మళ్లింపు కాలువ (డైవర్షన్ చానల్) ను తవ్వాలి. ఆ పనికి అదనంగా చెల్లింపు చేయబోమని కూడా అందులో వుంది. అయితే, ఆ ఒప్పంద నిబంధనను ఉల్లంఘిస్తూ, తాత్కాలిక మళ్లింపు మార్గం కాలువ తవ్వకం నిమిత్తం ఆ సంస్థకు రూ1.07 కోట్లు అదనంగా చెల్లించారు.

- ఒప్పందం (ప్యాకేజీ-2) లోని తొమ్మిదవ నిబంధన ప్రకారం, కాంట్రాక్టరు ఒప్పందం కుదుర్చుకున్న తేదీ నుండి బాధ్యతా (డిఫెక్ట్స్ లయబిలిటీ) కాలం చివరి వరకూ పనులను బీమా చేయ్యాలి. కనుక, పనులకు ఏదైనా నష్టం వాటిల్లితే, వాటిని కాంట్రాక్టరే తన సొంత ఖర్చుతో పునరుద్ధరించాల్సి ఉంటుంది. ఈ ప్యాకేజీలో ఇంతకు ముందు (2006 ఆగస్టు - సెప్టెంబరు) తవ్విన నీటి మళ్లింపు కాలువ 2006 సెప్టెంబరులో వచ్చిన వర్షాలు/వరదల కారణంగా దెబ్బతింది. పనులకు బీమా ఉంది కనుక పునరుద్ధరణ ఖర్చును కాంట్రాక్టరే భరించాలి. దీనికి బదులు, నష్టాల పునరుద్ధరణ నిమిత్తం ఆ సంస్థకు రూ0.72 కోట్లు చెల్లించారు. ఇది స్పష్టంగా కాంట్రాక్టరుకు అనుచిత లబ్ధి చేకూర్చటమే.

  నీటిపారుదల శాఖ ఆదేశాల మేరకే నీటి మళ్లింపు కాలువను త్రవ్వడం జరిగిందని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఆ సమాధానం అంగీకార యోగ్యం కాదు. ఒప్పందం పరిధిలో మళ్లింపు కాలువ తవ్వకం కూడా ఉంది కనుక అదనపు చెల్లింపు ఆమోదయోగ్యం కాదు. బీమా పరిధిలోనే ఉన్న నష్టాలకు ఎందుకు చెల్లింపులు చేసారన్న దానిపై ప్రభుత్వం సమాధానమివ్వలేదు.

**ప్రాజెక్టు కార్యకలాపాలు/ పనుల ప్యాకేజీల సమన్వయం**

ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మూడు కార్యకలాపాలున్నాయి. అవి ఎ) భూసేకరణ; బి) ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం; సి) సివిల్ పనులు

**భూసేకరణ:** శాఖాపరమైన నిబంధనలు/ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, పనులు సజావుగా సాగడానికి వీలుగా, పనులను అప్పగించడానికి ముందే ప్రాజెక్టును నిర్మించడానికి/ పూర్తి చేయడానికి అవసరమైన భూములను సేకరించాలి. అయితే ప్రస్తుత ప్రాజెక్టులో ఈ నిబంధనలను పాటించలేదు. ప్రాజెక్టులో భూసేకరణ పరిస్థితి **పట్టిక-18** లో చూపిన విధంగా ఉంది.

**పట్టిక-18**

| పనులు మొదలు పెట్టిన నాటికి | ఒప్పందకాలం ముగిసే సమయానికి | 2010 ఫిబ్రవరి నాటికి |
|---|---|---|
| లేదు | 9,660.33 ఎకరాలు | 10,718 ఎకరాలు |

**ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం :** ప్రాజెక్టు వలన పన్నెండు గ్రామాలకు విస్తరించి ఉన్న 7,416 ఎకరాలు ముంపుకు గురౌతాయి. 7,665 కుటుంబాలు ప్రభావితమౌతాయి. ప్రాజెక్టు నిర్మాణంకు నిర్దేశించిన వ్యవధి కేవలం 30 నెలలు మాత్రమే కనుక ప్రాజెక్టు నిర్మాణం సాఫీగా జరిగి దానినుండి లబ్ధి పొందాలంటే, ఎ) పనులను అప్పగించడానికి ముందే ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలను గుర్తించాలి; బి) ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలోగా ప్రత్యామ్నాయ స్థలాలను సేకరించి పునరావాస కాలనీలను అభివృద్ధి చేయాలి.

ఐతే, సంక్లిష్టమైన ఈ అంశాలను పరిష్కరించకుండానే నీటిపారుదల శాఖ ప్రాజెక్టు పనులను అప్పగించిందని ఆడిట్‌లో వెల్లడైంది. తత్ఫలితంగా, ఐదేళ్ల తరువాత కూడా 17 పునరావాస కాలనీలలో 4 మాత్రమే పూర్తయ్యాయి, మిగిలిన 13 పునరావాస కాలనీల పనులు జరుగుతున్నాయి (2010 ఫిబ్రవరి). పునరావాస కాలనీల అభివృద్ధికి అవసరమైన 778.57 ఎకరాలకు గాను 350.18 ఎకరాల భూమిని మాత్రమే సేకరించారు.

**పనుల ప్యాకేజీల మధ్య సమన్వయం :** ఈ ప్రాజెక్టు కింద వివిధ పనులను సమన్వయ రీతిలో చేపట్టలేదు. ప్యాకేజీ-I (విలువ: రూ25.98 కోట్లు) ని 2004 జూలైలో అప్పగించారు, దీన్ని 2006 జనవరిలో పూర్తి చేయాలని నిర్దేశించారు. ప్యాకేజీ -2 (విలువ: రూ212.49 కోట్లు) ని మాత్రం ఆ తరువాత 2004 నవంబరులో అప్పగించారు. ఇది 2007 మేలో పూర్తి కావాల్సి వుంది. పనులన్నీ ఏకకాలంలొ పూర్తయ్యేలా వాటిని అప్పగించి వుండాల్సింది.

**అసంపూర్ణంగా అభివృద్ధి చేసిన ఆయకట్టు**

రూ472.80 కోట్లు ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టుకు 2008 నవంబరు లోనే లాంఛనప్రాయంగా ప్రారంభోత్సవం చేసారు. ఐతే, ప్రాజెక్టు కార్యకలాపాలను క్రమపద్ధతిలో చేపట్టకపోవడం వలన, ప్రాజెక్టునుండి పాక్షికంగా మాత్రమే ప్రయోజనం అందుతోంది. అభివృద్ధి చెయ్యాల్సిన 80,060 ఎకరాల ఆయకట్టు (కుడి ప్రధాన కాలువ కింద 52,060 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ కింద 28,000 ఎకరాలు) కు గాను కేవలం 42,072 ఎకరాల (కుడి ప్రధాన కాలువ కింద 21,371 ఎకరాలు, ఎడమ ప్రధాన కాలువ కింద 20,701 ఎకరాలు) ఆయకట్టును మాత్రమే అభివృద్ధి చేసారు.

కోర్టు కేసుల కారణంగా భూసేకరణలో జాప్యం వలన కాలువలను కలపలేకపోయామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2010 ఆగస్టు). పునరావాస కల్పన ప్రక్రియలో వున్న చిక్కులను కూడా ప్రభుత్వం తన సమాధానంలో విశదీకరించింది. భూసేకరణ, పునరావాస కల్పన అనేవి సంక్లిష్టమైన ప్రక్రియలు కనుక, ప్రాజెక్టు నిర్మాణం సజావుగా సాగాలంటే పనులను అప్పగించడానికి ముందే ఈ ప్రక్రియలపై దృష్టి పెట్టి వుండాల్సిందన్న ఆడిట్ వాదనను ఈ సమాధానం ధృవపరుస్తోంది.

**నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ**
**(ప్రాజెక్టులు, నీటిపారుదల విభాగాలు)**

### 3.4.7 కాంట్రాక్టర్లకు చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సులు

**ఎనిమిది ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సులను ఆడిటు తనిఖీ చేయగా, రూ111.84 కోట్ల అడ్వాన్సుల అక్రమ చెల్లింపు, వడ్డీరేటును తప్పుగా పేర్కొనడం వలన రూ33.07 కోట్ల రెవెన్యూ నష్టం వంటి పలు లోపాలు వెల్లడయ్యాయి.**

ఎనిమిది నీటిపారుదల ప్రాజెక్టుల (***అనుబంధం - 3.10***) ఒప్పందాల్లో మొబిలైజేషన్ అడ్వాన్సుల చెల్లింపులకు సంబంధించి నిబంధనలను ఆడిటు తనిఖీ చేసింది.

ఈ ఒప్పందాలన్నింటిలోనూ, కాంట్రాక్టర్లకు ఒప్పందం విలువలో ఐదు శాతం మొత్తాన్ని కూలీలను తరలించడానికి, మరో ఐదు శాతం మొత్తాన్ని యంత్ర సామగ్రి కొనుగోలు కోసం, మొబిలైజేషను అడ్వాన్సు రూపంలో చెల్లించవచ్చనే నిబంధన ఉంది.

ఆడిటు పరిశీలనలో ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి:

**యంత్రసామగ్రికోసం మొబిలైజేషన్ అడ్వాన్సులు**

ఒప్పందపు షరతుల ప్రకారం యంత్ర సామగ్రి, పరికరాలను స్థానికంగా కొనుగోలు చేస్తే ఒప్పందపు తేదీ నుండి తొమ్మిది నెలల్లోపు, వాటిని విదేశాలనుండి దిగుమతి చేసుకునే సందర్భాల్లో ఒక ఏడాదిలోగా కాంట్రాక్టు విలువలో ఐదు శాతాన్ని అడ్వాన్సుగా చెల్లించవచ్చు.

కాబట్టి, కాంట్రాక్టు సంస్థ/ఉమ్మడి సంస్థ (జె.వి.) లు ఆయా కాంట్రాక్టుల కింద చేయబోయే పనుల్లో ఉపయోగించే యంత్ర సామగ్రిని కొనడానికి మాత్రమే ఈ అడ్వాన్సులు ఇవ్వాలి. కాంట్రాక్టు సంస్థ/జె.వి.లు సమర్పించిన ఇన్వాయిస్‌ల ఆధారంగా వారికి అడ్వాన్సులు చెల్లించారు. ఐతే, ఆ ఇన్వాయిస్‌లను ఆడిటు తనిఖీ చేయగా రూ52.39 కోట్ల మొత్తాన్ని అక్రమంగా చెల్లించినట్లు వెల్లడైంది. వివరాలు ఈకింది విధంగా ఉన్నాయి:

- మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (ఎమ్.జి.కె.ఎల్.ఐ.ఎస్.), ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు (ఐ.ఎస్.పి.) ల్లో, ఇన్వాయిస్‌లు కాంట్రాక్టు సంస్థ/జె.వి.ల పేర్ల మీద లేనప్పటికీ వాటిపై ఆ సంస్థలకు రూ20.41 కోట్లు[68] చెల్లించారు;
- ఇందిరాసాగర్ పోలవరం ఎడమ ప్రధానకాలువ ప్యాకేజీ - 4 పనుల్లో, సంబంధిత కాంట్రాక్టు సంస్థలు కాకుండా వాటి అనుబంధ సంస్థలు కొనుగోలు చేసిన యంత్రాలకు రూ14.11 కోట్లు చెల్లించారు.
- ఇందిరాసాగర్ ప్రాజెక్టు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు (ఎ.ఎమ్.ఆర్.పి.)ల్లో కాంట్రాక్టు సంస్థలు ఒప్పందపు తేదీ కంటే ముందే కొనుగోలుచేసి, వేరే పనుల్లో వినియోగించిన యంత్రాలపై రూ11.05 కోట్ల[69] అడ్వాన్సులు చెల్లించారు.

---

[68] ఎమ్.జి.కె.ఎల్.ఐ.ఎస్. (ప్యాకేజీ -28) రూ3 కోట్లు; ఐ.ఎస్.పి.( కుడికాలువ ప్యాకేజీలు 1, 2; ఎడమకాలువ ప్యాకేజీలు 2, 7; హెడ్ వర్క్స్ ప్యాకేజీలు 63, 64, 66) : రూ17.41 కోట్లు

[69] ఐ.ఎస్.పి.(ఆర్.ఎమ్.సి. ప్యాకేజీ-6, ఎల్.ఎమ్.సి. ప్యాకేజీ-1, హెడ్ వర్క్స్ ప్యాకేజీలు 64, 65): రూ8.68 కోట్లు, ఎ.ఎమ్.ఆర్.పి.(ప్యాకేజీ-81): రూ2.37 కోట్లు

- ఇందిరాసాగర్‌ప్రాజెక్టులో[70] రూ5.90 కోట్ల అడ్వాన్సులను ఇతర ప్రాజెక్టుల్లోని పనుల కోసం కొనుగోలు చేసిన యంత్రాలపై చెల్లించారు.
- ఫైనాన్సు కంపెనీల ద్వారా వాయిదా (హైర్ పర్చేజ్) పద్ధతిలో కొనుగోలు చేసిన యంత్రాలపై ఇందిరా సాగర్ ప్రాజెక్టులో[71] రూ0.92 కోటిని అడ్వాన్సుగా చెల్లించారు.

ఎమ్.జి.కె.ఎల్.ఐ. పథకం (లిఫ్ట్-II, లిఫ్ట్-III ప్యాకేజీల) పనుల ఒప్పందాల్లో, అడ్వాన్సులను చెల్లించడానికి యంత్రసామగ్రిని కొనుగోలు చేసినట్లు రుజువులను సమర్పించాలన్న నిబంధనను పొందుపర్చకుండా రూ59.45 కోట్ల అడ్వాన్సులు చెల్లించారని ఆడిటు తనిఖీలో వెల్లడైంది. ఈ అడ్వాన్సులు నిర్దిష్ట అవసరాల కోసమే ఉద్దేశించినవి కనుక ఈ నిబంధనను పొందుపరచి ఉండాల్సింది.

### కూలీలను తరలించేందుకు ఇచ్చే మొబిలైజేషన్ అడ్వాన్సు

యంత్రసామగ్రి కోసం అడ్వాన్సును మంజూరు చేసే సమయంలో యంత్రాల కొనుగోలు జరిగినట్లుగా నిర్ధారించుకునే ఏర్పాట్లు ఉన్నాయి. కానీ పనులు జరిగే చోటుకి కూలీలను వాస్తవంగా తీసుకు వచ్చినప్పుడు మాత్రమే అడ్వాన్సు చెల్లింపు జరిగేలా చూసేందుకు ఎటువంటి నిర్దేశాలూ లేవు.

ఇందిరాసాగర్ ప్రాజెక్టులో రెండు ప్యాకేజీల[72] ఒప్పందాలను పనులు పూర్తి కాకముందే 2009 ఆగష్టులో రద్దు చేసారు. ఈ రెండు ప్యాకేజీల్లో కూలీలను తరలించడం కోసం కాంట్రాక్టర్లకు రూ75.87 కోట్ల అడ్వాన్సులు చెల్లించారు. కాంట్రాక్టులు రద్దయ్యే సమయానికి, 2010 మార్చి/జూలై వరకు చెల్లుబాటులో ఉండే బ్యాంకు గ్యారంటీలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. ఆ సమయానికి, కాంట్రాక్టర్ల నుండి రూ67.49 కోట్ల అడ్వాన్సు మొత్తం రావలసి ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న బ్యాంకు గ్యారంటీలను నగదుగా మార్చుకోలేదు. తదనంతరం, మొబిలైజేషన్ అడ్వాన్సుకి సంబంధించిన బ్యాంకు గ్యారంటీలతో సహా కాంట్రాక్టర్ల బ్యాంకు గ్యారంటీలేవీ నగదుగా మార్చరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులనిచ్చింది (2010 జూన్). ఐతే, కాంట్రాక్టులు రద్దయ్యే నాటికి కోర్టు ఉత్తర్వులేమీ లేవు. బ్యాంకుగ్యారంటీలను నగదుగా మార్చుకోకుండా, కాంట్రాక్టరు కోర్టుకెళ్ళి స్టే ఉత్తర్వుల్ని పొందేవరకూ నీటిపారుదల శాఖ వేచి చూసింది. ఆ విధంగా, బకాయి ఉన్న రూ67.49 కోట్లు ఇప్పటి వరకూ సర్దుబాటు కాలేదు. అంతే కాకుండా అడ్వాన్సులు చెల్లించిన తేదీనుండి కాంట్రాక్టు రద్దయ్యే నాటి వరకు విధించాల్సిన, రూ8.23 కోట్ల వడ్డీని కూడా కాంట్రాక్టర్ల నుండి వసూలు చేయలేదు.

### మొబిలైజేషను అడ్వాన్సుపై తక్కువ వడ్డీని వసూలు చేయడం

మొబిలైజేషను అడ్వాన్సుపై వడ్డీని ప్రభుత్వ ఋణ వడ్డీ రేటు ప్రకారం వసూలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు (2003 జూలై) నిర్దేశిస్తున్నాయి. ఐతే, నాలుగు ప్రాజెక్టుల ఒప్పందాల్లో ఈ విషయమై తగిన నిబంధనలను పొందుపర్చలేదు. ఆయా సంవత్సరాలకు ప్రభుత్వం నిర్దేశించిన వడ్డీ రేటు 10 శాతం కాగా, 8 శాతం చొప్పున వడ్డీని రికవరీ చేసారు. దీనివలన ప్రభుత్వం రూ33.07 కోట్ల[73] రెవెన్యూ నష్టపోగా, కాంట్రాక్టర్లు ఆమేరకు లబ్ధి పొందారు.

---

[70] కుడికాలువ ప్యాకేజీలు - 2,3

[71] హెడ్ వర్క్స్ ప్యాకేజీ-67

[72] స్పిల్ వే ప్యాకేజీ-రూ31.68 కోట్లు, ఇ.సి.ఆర్.ఎఫ్. ప్యాకేజీ రూ44.19 కోట్లు

[73] ఇందిరా సాగర్ (ఇ.సి.ఆర్.ఎఫ్.ప్యాకేజీ): రూ2.23 కోట్లు; ఎ.ఎమ్.ఆర్.పి. ( టన్నెల్ ప్యాకేజీ, ఉదయసముద్రం ఎత్తిపోతల ప్యాకేజీ, ప్యాకేజీ-80): రూ16.05 కోట్లు; ఎమ్.జి.కె.ఎల్.ఐ.ఎస్. (ప్యాకేజీలు-28,29,30, లిఫ్ట్-II, లిఫ్ట్-III): రూ14.31 కోట్లు ; మోదికుంటవాగు : రూ0.48 కోట్లు

### కాంట్రాక్టర్ల వద్దనే స్తంభించిపోయిన మొబిలైజేషను అడ్వాన్సులు

ఒప్పందపు నిబంధనల ప్రకారం, ఒప్పంద విలువలో 10 శాతం పనులు పూర్తైన తర్వాత అడ్వాన్సు రికవరీ మొదలౌతుంది. ఆ తర్వాత చేసే మధ్యంతర చెల్లింపుల్లో ప్రతి బిల్లులోనూ 20 శాతం చొప్పున రికవరీ చేయాలి. ఫలితంగా, ఒప్పందపు విలువలో 60 శాతం పని పూర్తయ్యేటప్పటికి మొత్తం అడ్వాన్సు వసూలు అవుతుంది[74]. కాబట్టి మొత్తం అడ్వాన్సు సకాలంలో వసూలు కావాలంటే ఒప్పందపు విలువలో 60 శాతం వరకూ పనులు సాఫీగా జరగాలి.

ఐతే, (ఎ) అటవీ, పర్యావరణ అనుమతులు లాంటి చట్టపరమైన అనుమతులు, (బి) భూసేకరణ, (సి) పునరావాసం వంటి అంశాలను పరిష్కరించకుండానే సివిల్ పనులను ప్రారంభించడం వలన పనుల పురోగతి కుంటుపడింది. అడ్వాన్సులు రికవరీ కావాల్సిన గడువు తేదీలు ముగిసి చాలాకాలమైనా అవి పూర్తిగా వసూలు కాలేదు. ఫలితంగా, రూ702.70 కోట్ల భారీ మొత్తంలో (2010 ఫిబ్రవరి నాటికి) అడ్వాన్సులు కాంట్రాక్టర్ల వద్దనే స్తంభించిపోయాయి. వివరాలు ***అనుబంధం - 3.10*** లో ఉన్నాయి.

***అనుబంధం - 3.10*** లో ఉన్న వివరాల ప్రకారం:

- ఆరు ప్రాజెక్టుల్లో (క్రమ సంఖ్యలు 1 నుండి 6 వరకు) ఒప్పందపు కాలంతో పోలిస్తే 90 నుండి 270 శాతం వరకూ కాలం పూర్తయినప్పటికీ, 2010 ఫిబ్రవరి నాటికి అడ్వాన్సులు పూర్తిగా వసూలు కాలేదు.
- మోదికుంట వాగు ప్రాజెక్టు (క్రమ సంఖ్య 7) లో, ఒప్పందం కాలంతో పోలిస్తే 233 శాతం కాలం పూర్తయినప్పటికీ అడ్వాన్సు రికవరీ కనీసం ఆరంభం కూడా కాలేదు.
- డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు (క్రమ సంఖ్య 8) లో పూర్వశోధన (ఇన్వెస్టిగేషన్) పనులకు పనివాళ్లను తరలించడానికి రూ341.16 కోట్ల అడ్వాన్సులను (కాంట్రాక్టు విలువలో ఒక శాతం) చెల్లించారు. పనుల్లో 15 శాతం[75] పూర్తయ్యేటప్పటికి ఈ అడ్వాన్సులు పూర్తిగా రికవరీ కావాల్సి ఉంది. ఐతే, ఒప్పందాల గడువులో 19 నుండి 70 శాతం వరకు పూర్తయినప్పటికీ, అడ్వాన్సు రికవరీ కనీసం మొదలు కూడా కాలేదని ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.

ప్రభుత్వం కేవలం ఒక్క ప్రాజెక్టు విషయంలో మాత్రమే సమాధానం ఇచ్చింది (2010 ఆగష్టు). మొబిలైజేషన్ అడ్వాన్సులకు పూచీగా బ్యాంకు గ్యారంటీలు ఉన్నాయనీ, ఆ అడ్వాన్సు మొత్తాలను వడ్డీతో సహా రికవరీ చేస్తారు కనుక ప్రభుత్వానికి ఏవిధమైన నష్టమూ వాటిల్లదనీ ప్రభుత్వం తన సమాధానంలో పేర్కొంది. ఐతే, ఆడిటు లేవనెత్తిన, రూ111.84 కోట్ల అడ్వాన్సుల అక్రమ చెల్లింపు, వడ్డీ రేటును తప్పుగా పేర్కొనడం వలన రూ33.07 కోట్ల రెవెన్యూ నష్టం వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానమివ్వలేదు.

పనుల్లో పురోగతి కుంటుపడడం వలన విలువైన ప్రభుత్వ వనరులు అడ్వాన్సుల రూపంలో కాంట్రాక్టర్ల వద్ద స్తంభించిపోవడంతో పాటు, అడ్వాన్సు మొత్తాలతో కొనుగోలు చేసిన యంత్రాలను ఇతర ప్రయోజనాలకు మళ్లించే అవకాశం కూడా ఉంది.

---

[74] రికవరీ మొదలు కావడానికి 10% + అడ్వాన్సు మొత్తం రికవరీ చేయడానికి 50% (ప్రతి బిల్లులోనూ 20% చొప్పున) = ఒప్పందపు విలువలో 60%

[75] రికవరీ మొదలు కావడానికి 10% + అడ్వాన్సు మొత్తం రికవరీ కావడానికి 5% (ప్రతి బిల్లులోనూ 20% చొప్పున) = ఒప్పందపు విలువలో 15%

## మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ
## (హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ)

### 3.4.8. కాంట్రాక్టరుకు అనుచిత లబ్ధి

**ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించే నిబంధనలను ఒప్పందంలో పొందుపర్చకపోవడం వలన పి.వి.ఎన్.ఆర్. ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ నిర్మాణం పనుల్లో, టెండర్లు ఖరారైన తర్వాత పరిమాణాల్లోని తగ్గుదల వల్ల వచ్చే ప్రయోజనాలు ప్రభుత్వానికి ఒనగూడలేదు. ఫలితంగా, కాంట్రాక్టరుకు రూ86.67 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.**

పి.వి.ఎన్.ఆర్.[76] ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే హైదరాబాద్ లోని సరోజినీదేవి ఆసుపత్రిని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్.జి.ఐ.ఎ.) కు 12 కి.మీ.ల దూరం లో ఉన్న ఆరాంఘర్ కూడలిని రోడ్డు మార్గం ద్వారా కలుపుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం పనిని కోల్‌కత్తా కేంద్రంగా పనిచేసే ఒక సంస్థకు[77] రూ439 కోట్లకు అప్పగించారు (2006 అక్టోబరు).

పనుల పరిధిలో ప్రధానంగా ఈ కింది అంశాలున్నాయి:

(ఎ) ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ (ఇ.ఇ.సి.)

(బి) ఆరాంఘర్ కూడలి దగ్గర అండర్ పాస్

(సి) ఆర్.జి.ఐ.ఎ. వద్ద ట్రంపెట్ ఇంటర్ చేంజ్

(డి) ఇన్నర్ రింగ్ రోడ్ (ఐ.ఆర్.ఆర్.) ను మెరుగుపరచడం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ పనులను ఇంజినీరింగ్ - ప్రొక్యూర్ మెంట్ - కన్‌స్ట్రక్షన్ (ఇ.పి.సి.) కాంట్రాక్టు పద్ధతి (ఎ.పి.ఇ.పి.సి.) కింద అప్పగించింది. ఐతే, పనుల పరిధిలో కానీ, పరిమాణాల్లో కానీ ఏవైనా తగ్గుదలలుంటే, వాస్తవంగా చేసిన పనులకే చెల్లింపులు పరిమితం చేసేలా, ప్రభుత్వ ప్రయోజనాల్ని పరిరక్షించే నిబంధనలను ఒప్పందంలో పొందు పర్చలేదని ఆడిటు గమనించింది. ఫలితంగా, ఇ.ఇ.సి. నిర్మాణం పనిలోనూ (రూ83.46 కోట్లు), ట్రంపెట్ ఇంటర్ చేంజ్ నిర్మాణం పనిలోనూ (రూ3.21 కోట్లు) మొత్తం మీద కాంట్రాక్టరుకు రూ86.67 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. వివరాలు ఇలా ఉన్నాయి:

**ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ (ఇ.ఇ.సి.)**

ఈ పని అంచనా విలువ రూ344.13 కోట్లు. దీనిపై టెండరు శాతాన్ని (అంచనా విలువ కంటే 2.44 శాతం తక్కువ) సర్దుబాటు చేసిన తరువాత చెల్లించాల్సిన మొత్తం రూ335.73 కోట్లు. ఐతే, అంచనాలలో పేర్కొన్న పరిమాణాల ప్రకారం నూటికి నూరు శాతం పనులు చేసినప్పుడే ఈ పూర్తి మొత్తం పొందే అర్హత కాంట్రాక్టరుకు ఉండాలి. కానీ, **పట్టిక - 19** లో వివరించిన విధంగా టెండర్లు ఖరారైన తర్వాత, పరిమాణాల్లో భారీ తగ్గుదలలు చోటు చేసుకున్నాయి.

[76] పాములపర్తి వెంకట నరసింహారావు

[77] మెసర్స్ సింప్లెక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, సోమదత్ బిల్డర్స్ ప్రైవేటు లిమిటెడ్ (జె.వి.)

పట్టిక -19

| అంశం | అంతర్గత ఆంచనా (ఐ.బి.ఎమ్.) ప్రకారం | | విలువ (రూ కోట్లలో) | పూర్తయిన పని/వినియోగం ప్రకారం | | చెల్లించాల్సిన మొత్తం (రూ కోట్లలో) | వ్యత్యాసం (రూ కోట్లలో ) (4 వ కాలమ్ - 7వ కాలమ్) |
|---|---|---|---|---|---|---|---|
| | పరిమాణం | సగటు ధర (రూ) | | పరిమాణం | ధర (రూ)[78] | | |
| (1) | (2) | (3) | (4) | (5) | (6) | (7) | (8) |
| కాంక్రీటు | 168921 ఘ.మీ. | 6565.77 | 110.91 | 161265 ఘ.మీ. | 6405.55 | 103.30 | 7.61 |
| స్టీలు | 40583 మె.ట. | 32146.25 | 130.46 | 29591 మె.ట. | 31361.88 | 92.80 | 37.66 |
| హెచ్‌టిఎస్ స్ట్రాండ్‌లు | 3880 మె.ట. | 81912.95 | 31.78 | 2538 మె.ట. | 79914.27 | 20.28 | 11.50 |
| మొత్తం | | | | | | | 56.77 |

ఆవిధంగా, కాంట్రాక్టరుకు చెల్లించాల్సిన మొత్తం రూ278.96 కోట్లుగా ( రూ335.73 కోట్లు - రూ56.77 కోట్లు) లెక్క తేలింది. ఐతే, ఈ మొత్తానికి బదులుగా, రూ362.42 కోట్లను[79] చెల్లించడానికి నిర్ణయించారు. ఫలితంగా, ఇ.ఇ.సి. పనిలో కాంట్రాక్టరుకు రూ83.46 కోట్ల (రూ362.42 కోట్లు - రూ278.96 కోట్లు) అనుచిత లబ్ధి చేకూరింది.

**ట్రంపెట్ ఇంటర్ చేంజ్**

మొదట్లో రూపొందించిన అంచనాల ప్రకారం రూ16.72 కోట్లతో 115 మీటర్ల పొడవున్న ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ను ప్రతిపాదించారు. ఆ తర్వాత దీనిని రూ59.32 కోట్ల ఖర్చుతో 1,992 మీటర్ల[80] పొడవున నిర్మించేలా అంచనాలను సవరించారు. అంటే అంచనాను రూ42.60 కోట్ల మేర పెంచారు. ఐతే టెండరు నోటీసులో మాత్రం దీని పొడవును 115 మీటర్లుగానే పేర్కొన్నారు. కాంట్రాక్టు సంస్థ కూడా అదే నిడివితో దాన్ని నిర్మించింది. కాబట్టి, 115 మీటర్లకు మొదటి అంచనా విలువ రూ16.72 కోట్ల నుండి టెండరు శాతాన్ని (అంచనా విలువ కంటే 2.44 శాతం తక్కువ) మినహాయిస్తే, ఈ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ పనుల విలువ రూ16.31 కోట్లుగా లెక్క తేలుతుంది. ఐతే, దీనికి రూ19.52 కోట్లు[81] చెల్లించాలని నిర్ణయించారు. దీనివలన కాంట్రాక్టరుకు రూ3.21 కోట్ల (రూ19.52కోట్లు - రూ16.31 కోట్లు) అనుచిత లబ్ధి చేకూరింది.

ఆవిధంగా, పై పనుల్లో, టెండర్లు ఖరారైన తర్వాత పరిమాణాల్లోని తగ్గుదల వలన వచ్చే ప్రయోజనం ప్రభుత్వానికి ఒనగూడలేదు. ఫలితంగా, కాంట్రాక్టరుకు రూ86.67 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

ఇది ఇ.పి.సి. కాంట్రాక్టు కాబట్టి పరిమాణాలను (బిల్ ఆఫ్ క్వాంటిటీస్ - బి.ఒ.క్యూ.) ను పేర్కొనలేదని ప్రభుత్వం తన సమాధానంలో తెలిపింది (2010 జూన్). టెండరు పత్రాలలో కేవలం పనుల పరిధి, ప్రాథమిక పరామితులను మాత్రమే పేర్కొంటామని కూడా ప్రభుత్వం తెలిపింది. అంతేకాకుండా, ఆర్థిక బిడ్లపై ఐ.బి.ఎమ్. అంచనాల ప్రభావం ఉండదని, బిడ్డర్ల ఎంపికకు ఇది ఏ విధంగానూ ప్రామాణికం కాదనీ, కాబట్టి విజయవంతమైన బిడ్డరు కోట్ చేసిన ధర సరసమైనదేనని భావించవచ్చని కూడా సమాధానమిచ్చింది.

ప్రభుత్వ సమాధానం ఈ క్రింది కారణాల వలన అంగీకారయోగ్యం కాదు:

---

78 టెండరు శాతం (-) 2.44 శాతాన్ని సర్దుబాటు చేసిన తర్వాత ధర

79 2010 జూన్ నాటికి రూ349.22 కోట్లు చెల్లించారు

80 వైశాల్యం : 34,257.51 చ.మీటర్లు; వెడల్పు: 17.2 మీటర్లు

81 2010 జూన్ నాటికి రూ19.48 కోట్లు చెల్లించారు

(i) టెండర్ల ఆమోదానికి ప్రభుత్వం నిర్దేశించిన ఐదు శాతం పరిమితిని అమలు చేయాలంటే ఐ.బి.ఎమ్. విలువను ఖచ్చితంగా లెక్కించడం చాలా ప్రధానం. కానీ అంచనాలను పెంచేయడం వలన ప్రభుత్వం నిర్దేశించిన ఐదు శాతం పరిమితికి మించి అదనంగా 15.82 శాతం అధిక విలువకు[82] కాంట్రాక్టరుకు పనులను అప్పగించడం జరిగింది.

(ii) టెండరు పత్రాల్లో బి.ఒ.క్యూ.ను పొందు పరచకపోవడానికి సంబంధించి ప్రభుత్వం, ఇ.పి.సి. మార్గదర్శకాలను కారణంగా చూపింది. ఐతే, ధరల సర్దుబాటు నిబంధన విషయంలో ప్రభుత్వం అవే ఇ.పి.సి. మార్గదర్శకాలను ఉల్లంఘించింది. కాంట్రాక్టు అమలు కాలంలో ధరల సర్దుబాటు చేయకూడదని ఇ.పి.సి. మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, స్టీలు, సిమెంటు, ఇంధనం, వగైరాల ధరల్లోని పెరుగుదలకు ధరలను సర్దుబాటు చేసే నిబంధనను ప్రభుత్వం ఒప్పందంలో చేర్చింది. నిర్ణీత విలువ గల కాంట్రాక్టుకు మార్కెటు ధరల్లోని హెచ్చు తగ్గులతో సంబంధం ఉండదని ఇ.పి.సి. టర్న్‌కీ మార్గదర్శకాల్లో నిర్దేశించినప్పటికీ, ధరల్లోని హెచ్చుతగ్గులకు సంబంధించిన నిబంధనను ఒప్పందంలో చేర్చడం వలన కాంట్రాక్టరుకు రూ43.02 కోట్ల (2010 మార్చి నాటికి) అనుచిత లబ్ధి చేకూరడమే కాకుండా ప్రభుత్వ ప్రయోజనాలకు నష్టదాయకమయ్యింది.

(iii) ఈ విషయంలో, ఇ.పి.సి. కాంట్రాక్టులకు సంబంధించిన టెండరు షెడ్యూళ్లు, ఒప్పందాలలోని అన్ని నిబంధనలనూ న్యాయశాఖతో సంప్రదించి పరిశీలన జరపాలనీ, ఇ.పి.సి. కాంట్రాక్టు విధానంలో ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేలా తగిన మార్పులను/నిబంధనలను చేయాలనీ ఆడిటు గతంలోనే సిఫార్సు చేసింది[83]. కానీ, ఆడిటు పరిశీలనలకు సమాధానమిచ్చేటప్పుడు ప్రభుత్వం దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు.

### 3.4.9. టెండరు షరతులకు కట్టుబడని కారణంగా బిడ్డర్లకు అనుచిత లబ్ధి

**టెండరు షరతులకు కట్టుబడి ఉండకపోవడం వలన బిడ్డర్లకు రూ239.88 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.**

హైదరాబాద్ చుట్టుపక్కల ఉండే మియాపూర్, కోకాపేట గ్రామాల్లోని స్థలాలను అభివృద్ధి చేయడానికి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్.ఎమ్.డి.ఎ.) 2007 సెప్టెంబరులో 23.11 ఎకరాలను, 2008 ఫిబ్రవరిలో 75 ఎకరాలను వేలంలో అత్యధిక ధరలను పాడిన మంత్రి డెవలపర్స్, డి.ఎల్.ఎఫ్. హోమ్ డెవలపర్స్ లిమిటెడ్‌లకు వరుసగా రూ168 కోట్లు, రూ751.50 కోట్ల అమ్మకం ధరలకు కేటాయించింది. బిడ్డింగు షరతుల ప్రకారం, అమ్మకం ధరలోని 25 శాతం మొత్తాన్ని తొలి డిపాజిటు (ఐ.డి.) గా చెల్లించి, మిగిలిన 75 శాతాన్ని 30 రోజుల్లోపు చెల్లించాలి. నిర్దేశించిన గడువులోపున బిడ్డరు మిగతా అమ్మకం ధరను చెల్లించని పక్షంలో తొలి డిపాజిటు పూర్తిమొత్తాన్ని, ధరావతు (ఇ.ఎమ్.డి.) మొత్తాన్ని జప్తు చేయాలి.

---

82

| | |
|---|---|
| హెచ్.ఎమ్.డి.ఎ. తయారు చేసిన అంచనా | రూ450.00 కోట్లు |
| *పైమొత్తంలో కాంట్రాక్టరుకు చేకూరిన అనుచిత లబ్ధి* | రూ86.67 కోట్లు |
| సరైన అంచనా విలువ | రూ363.33 కోట్లు |
| కాంట్రాక్టరు కోట్ చేసిన బిడ్ మొత్తం | రూ439.00 కోట్లు |
| సరైన అంచనా విలువ, బిడ్ విలువల మధ్య వ్యత్యాసం | రూ75.67 కోట్లు |
| సరైన అంచనా విలువ కు మించి అధికంగా ఉన్న బిడ్ విలువ శాతం | 20.82 |

83 2007 మార్చి 31 తో ముగిసిన సంవత్సరానికి ఇచ్చిన సి.ఎ.జి. ఆడిట్ నివేదిక (సివిల్) లోని, 'గోదావరీ జలాల వినియోగ అథారిటీ' పై పనితీరు సమీక్ష లోని పేరా 3.2.13

ఐతే, పై రెండు కేసుల్లోనూ బిడ్డర్లు అమ్మకం ధరలోని మిగతా మొత్తాలను నిర్దేశిత 30 రోజుల గడువులోగా చెల్లించనప్పటికీ, ఇ.ఎమ్.డి., ఐ.డి. మొత్తాలను హెచ్.ఎమ్.డి.ఎ. జప్తు చేయలేదు. ఫలితంగా, **పట్టిక -20** లో వివరించిన విధంగా, రెవెన్యూ కోల్పోయింది.

**పట్టిక-20** (రూపాయలు కోట్లలో)

| బిడ్డరు పేరు | భూమి విస్తీర్ణం | తొలి డిపాజిటుగా చెల్లించిన 25 శాతం + ధరావతు | మిగిలిన 75 శాతాన్ని చెల్లించాల్సిన గడువు తేది | అమ్మకం ధరలోని 75 శాతంగా చెల్లించాల్సిన మొత్తం | చెల్లించాల్సిన మొత్తం అమ్మకం ధర |
|---|---|---|---|---|---|
| మంత్రి డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్ | 23.11 ఎకరాలు | 41 + 1 | 16.10.2007 | 126.00 | 168.00 |
| డి.ఎల్.ఎఫ్. హోమ్ డెవలపర్స్ లిమిటెడ్ | 75.00 ఎకరాలు | 187.88 + 10 | 18.03.2008 | 563.62 | 751.50 |
| మొత్తం | | 239.88 | | | |

డి.ఎల్.ఎఫ్. హోమ్ డెవలపర్స్ సంస్థ, మిగిలిన మొత్తాన్ని చెల్లించడానికి బదులుగా, అప్పటికే చెల్లించిన 25 శాతం అమ్మకం ధరకు సమాన విలువ గల భూమిని తమకు కేటాయించాలని కోరింది. (2008 మే). అదే విధంగా, మంత్రి డెవలపర్స్ కూడా తొలి డిపాజిట్‌గా చెల్లించిన మొత్తాన్ని తాము భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టుల్లో సర్దుబాటు చేయాలని కోరింది. (2010 మే). హెచ్.ఎమ్.డి.ఎ. - మెట్రోపాలిటన్ కమీషనరు ఈ రెండు అభ్యర్థనలనూ అంగీకరించారు. డి.ఎల్.ఎఫ్.హోమ్ డెవలపర్స్ సంస్థకు 18.75 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే, మంత్రి డెవలపర్స్ చెల్లించిన డిపాజిటు మొత్తాన్ని (రూ42 కోట్లు) భవిష్యత్ ప్రాజెక్టులకు అడ్వాన్సుగా పరిగణించారు.

డిపాజిట్ల జప్తుకు సంబంధించిన నిబంధన, బిడ్డర్లకు మరే ఇతర భూమిని ఇవ్వాల్సిన అవసరంగానీ లేదా ఆ మొత్తాలను వేరే లావాదేవీలకు సర్దుబాటు చేయాల్సిన అవసరంగానీ లేకుండా, అప్పటికే చెల్లించిన మొత్తాలను ప్రభుత్వ ఖాతాలోకి జమ చేయాలని ఉద్దేశించినది. బిడ్డింగ్ ప్రక్రియ పట్ల బిడ్డర్లు చిత్తశుద్ధితో వ్యవహరించేలా చూసేందుకూ, ఊహాజనిత (స్పెక్యులేటివ్) వ్యాపార ధోరణిని నివారించేందుకు ఈ నిబంధన తోడ్పడుతుంది. కానీ, ఈ నిబంధనను అమలుచేయకపోవడం వలన మొత్తం టెండరు ప్రక్రియ నీరుగారిపోయింది. ఆ విధంగా, టెండరు షరతులకు కట్టుబడి ఉండకపోవడం వలన ఇద్దరు బిడ్డర్లకూ కలిపి మొత్తం మీద రూ239.88 కోట్ల (రూ42 కోట్లు + రూ197.88 కోట్లు) అనుచిత లబ్ధిని చేకూర్చడం జరిగింది.

ఈ విషయాన్ని 2010 జూన్ లో ప్రభుత్వానికి తెలపడమైంది (2010 ఆగస్టులో మరొకసారి గుర్తుచేయడం కూడా జరిగింది); దీనిపై సమాధానం రాలేదు (2010 నవంబరు).

### 3.4.10 అత్యల్ప బిడ్డరు ధరకన్నా అధిక ధరకు పనులు అప్పగించడం

**టెండరు ప్రక్రియలోని లోపాల కారణంగా హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మొదటి దశ లోని రెండో ప్యాకేజీ పనులను అత్యల్ప బిడ్డరు ధరకన్నా రూ23.68 కోట్ల అధిక మొత్తానికి అప్పగించడం జరిగింది.**

హైదరాబాద్ నగరంలో వాహనాల రద్దీని తగ్గించడం, హైదరాబాద్ మహానగరం చుట్టు పక్కల జనావాసాలను నగరంతో అనుసంధానం చేసే ఉద్దేశ్యంతో నగరం చుట్టూ 162 కి.మీ.ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్.ఎమ్.డి.ఎ) తలపెట్టింది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో[84] నిర్మిస్తున్నారు.

[84] మొదటి దశ :24.380 కి.మీ. రెండవ దశ: 138 కి.మీ

మొదటి దశ పనులను రెండు ప్యాకేజీలు[85] గా విభజించి, 2006 జూన్‌లో రెండు అంతర్జాతీయ సంస్థలకు అప్పగించారు. మొత్తం రూ514.83 కోట్ల[86] కాంట్రాక్టు విలువ కలిగిన ఈ పనులు 30 నెలల్లో పూర్తి చేయవలసి ఉంది. మొదటి దశ పనులు జరుగుతున్నాయి.

టెండర్ల సమయంలో ఒకే సంస్థ రెండు ప్యాకేజీల్లోనూ అతి తక్కువ ధర కోట్ చేసిన పక్షంలో, ఆ సంస్థకు ఒక్క ప్యాకేజీ ని మాత్రమే అప్పగించి రెండో ప్యాకేజీ ని మరో సంస్థకి అప్పగించడం జరుగుతుందని టెండరు నోటీసులో పేర్కొన్నారు. ఈ నిబంధనలో ఈ దిగువ లోపాలున్నాయిః

i) ఒక గుత్తేదారును ఒకే పనికి పరిమితం చేయడం వలన టెండర్లలో పోటీ ద్వారా వచ్చే అత్యల్ప ధరను హెచ్.ఎమ్.డి.ఎ. కోల్పోయింది.

ii) ఒక వేళ ఒక గుత్తేదారుకి ఒక్క ప్యాకేజీ మాత్రమే ఇవ్వాలన్న విషయంలో హెచ్.ఎమ్.డి.ఎ. ఖచ్చితంగా ఉండే పక్షంలో, కాంట్రాక్టు పొందేందుకు అర్హత సాధించాలంటే మిగతా బిడ్డర్లు అత్యల్ప బిడ్డరు కోట్ చేసిన ధరను అంగీకరించాలన్న నిబంధనను టెండరు నోటీసులో పెట్టి ఉండాల్సింది. అలాంటి నియమం గనుక ఉంటే, అతి తక్కువ ధరకే పనులు అప్పగించటం జరిగేది. కానీ, అటువంటి నిబంధన ఏదీ టెండరు నోటీసులో లేదు. ఫలితంగా పనులను కనిష్ట ధర కన్నా రూ23.68 కోట్లు ఎక్కువకి అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

మొదటి దశ పనుల కోసం పది సంస్థల నుంచి బిడ్లు వచ్చాయి. అతి తక్కువ ధర కోట్ చేసిన రష్యాకు చెందిన కార్పొరేషన్ ట్రాన్స్‌స్ట్రాయ్ ఒఎస్‌జెసి సంస్థకు మొదటి ప్యాకేజీ పనుల కంట్రాక్టును అప్పగించారు. రెండో ప్యాకేజీ పనులకు కూడా అదే సంస్థ అత్యల్ప ధర కోట్ చేయగా, తైవాన్ కు చెందిన కాంటినెంటల్ ఇంజనీరింగ్ కార్పొరేషన్‌ది రెండవ కనిష్ట ధర. రెండో ప్యాకేజీ పనులను, అత్యల్ప బిడ్డరు కన్నా రూ23.68 కోట్లు అధికంగా కోట్ చేసిన తైవాన్ సంస్థకు అప్పగించారు (2006 జూన్). వివరాలు **పట్టిక - 21** లో ఉన్నాయి.

**పట్టిక - 21**

| ప్యాకేజీ సంఖ్య | గుత్తేదారు | కోట్ చేసిన ధర (రూపాయలు కోట్లలో) | |
|---|---|---|---|
| II | కార్పొరేషన్ ట్రాన్స్‌స్ట్రాయ్ ఒఎస్‌జెసి | **కనిష్ట (ఎల్-1)** | 271.41 |
| | కాంటినెంటల్ ఇంజనీరంగ్ కార్పొరేషన్ | **రెండవ కనిష్ట (ఎల్-2)** | 295.09 |
| **వ్యత్యాసం** | | | **23.68** |

రెండు ప్యాకేజీ లకూ అవసరమైన వనరులను, సాంకేతిక నిపుణులను సమకూర్చుకోవటం ఒకే సంస్థకు సాధ్యం కాకపోవచ్చనీ, పనులు సకాలంలో పూర్తి చేసేందుకే రెండవ కనిష్ట ధర కోట్ చేసిన సంస్థకు అప్పగించామనీ సమాధానమిచ్చారు (2009 జూలై).

పై సమాధానం ఈ దిగువ కారణాల వలన ఆమోదయోగ్యం కాదు :

- ధరల బిడ్లు తెరవటానికి ముందే కార్పొరేషన్ ట్రాన్స్‌స్ట్రాయ్ ఒఎస్‌జెసి సంస్థను సాంకేతిక పరంగా ఈ రెండు ప్యాకేజీల్లోనూ ఎంపిక చేసారు. ఇలాంటి సంస్థలు ఏకకాలంలో వేర్వేరు చోట్ల అనేక పనులు నిర్వహిస్తుంటాయి కనుక పరిమితి నిబంధన సమంజసంగాలేదు. అంతేకాకుండా, ఈ సంస్థ వేరే చోట ఎక్కడా ఇతర పనులు చేపట్టకుండా ఎవరూ ఆపలేరు.

[85] మొదటి ప్యాకేజీ : గచ్చిబౌలి నుండి ఎ.పి.పోలీస్ ఎకాడమీ వరకు 11 కి.మీ; రెండవ ప్యాకేజీ :ఎ.పి.పోలీస్ ఎకాడమీ నుండి శంషాబాద్ వరకు 13.380 కి.మీ

[86] మొదటి ప్యాకేజీ : రూ 219.74 కోట్లు; రెండవ ప్యాకేజీ : రూ 295.09 కోట్లు

- ఇదిలా ఉన్నప్పటికీ ఒక సంస్థను ఒక్క ప్యాకేజీకి మాత్రమే పరిమితం చేయడం అవసరమని భావించిన పక్షంలో పైన పేర్కొన్న లోపాలపై టెండరు నోటీసు సమయంలో శ్రద్ధ పెట్టాల్సింది.

ఆ విధంగా రెండవ ప్యాకేజీపనులను రూ271.41 కోట్ల కనిష్ట ధర కన్నా రూ23.68 కోట్లు ఎక్కువగా రూ295.09 కోట్లు (రెండవ కనిష్ట ధర) కోట్ చేసిన సంస్థకు అప్పగించినందున హెచ్.ఎమ్.డి.ఎ. అదనపు వ్యయాన్ని భరించాల్సి వచ్చింది.

ఈ విషయాన్ని 2010 జూన్ లో ప్రభుత్వానికి తెలియచేసి 2010 ఆగస్టులో మరోమారు గుర్తు చేయడమైంది; ఇంకా సమాధానం రాలేదు (2010 నవంబరు).

### 3.4.11 అదనపు ఆర్థిక భారం

**రూ500 కోట్ల ఋణాన్ని హెచ్.ఎమ్.డి.ఎ. వినియోగించిన తీరు దాని లక్ష్యాలకూ, విధులకూ అనుగుణంగా లేకపోగా ఋణంపై వడ్డీ రూపేణా రూ95.17 కోట్ల అదనపు ఆర్థిక భారానికి దారి తీసింది.**

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్.ఎమ్.డి.ఎ.) చట్టం లోని సెక్షన్ 6 ప్రకారం హెచ్.ఎమ్.డి.ఎ. లక్ష్యాలు, విధులలో కొన్ని ఇలా ఉన్నాయిః

- మహానగరాభివృద్ధి, పెట్టుబడి ప్రణాళికను రూపొందించి, ఆచరణలో ప్రాధాన్యతనివ్వడం
- ఆ ప్రణాళిక ననుసరించి, ప్రాజెక్టులు, పథకాలను చేపట్టి, నిర్వహించడం
- ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం వివిధ ప్రాజెక్టులు, పథకాల నిర్వహణలో స్థానిక సంస్థలను సమన్వయపరచటంలో ప్రధాన పాత్ర పోషించడం
- స్థానిక అధికార్లు/ సంస్థలు రూపొందించిన భూసేకరణ ప్రతిపాదనలు/ కార్యక్రమాలను ఆమోదించటం
- స్థిర, చరాస్తులను సమకూర్చుకోవడం

హెచ్.ఎమ్.డి.ఎ. తనకు సంక్రమించిన భూములను[87] తాకట్టు పెట్టి బ్యాంకు[88] నుంచి సాలీనా 11.75 శాతం వడ్డీకి రూ500 కోట్ల స్వల్పకాలిక ఋణం తీసుకుంది (2008 జూలై). ఈ మొత్తాన్ని 2008 జూలై లోనే 'వివిధ వసూళ్లు' పద్దు కింద ప్రభుత్వ ఖాతాకు జమ చేసింది. హెచ్.ఎమ్.డి.ఎ. ఈ ఋణాన్ని తిరిగి చెల్లించలేక పోవడంతో ఆ సంస్థ అభ్యర్థన (2008 డిశంబరు) మేరకు ఆ బ్యాంకు, ఋణాన్ని తిరిగి చెల్లించాల్సిన కాల వ్యవధిని సవరిస్తూ (2009 మార్చి) వడ్డీ రేటుని కూడా 12.50 శాతానికి సవరించింది. హెచ్.ఎమ్.డి.ఎ. 2010 జనవరి నాటికి ఈ ఋణాన్ని తీర్చలేదు. ఓవైపు హెచ్.ఎమ్.డి.ఎ. సొంత ఆర్థిక పరిస్థితే[89] అంతంతమాత్రంగా ఉండగా మరోవైపు ఈ ఋణంపై వడ్డీ కింద రూ95.17 కోట్ల మొత్తాన్ని తన సొంత నిధులనుంచి చెల్లించాల్సి వచ్చింది.

హెచ్.ఎమ్.డి.ఎ. ప్రధాన లక్ష్యాలు, విధులతో సంబంధంలేని అవసరాలకోసం ఈ ఋణ మొత్తాన్ని వినియోగించడాన్ని ఆడిటు ఆక్షేపించగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకే ఈ అప్పు చేసినట్లు హెచ్.ఎమ్.డి.ఎ. సమాధానమిచ్చింది (2010 ఏప్రిల్). భారతీయ రిజర్వు బ్యాంకు మార్గదర్శకాల

---

[87] హెచ్.ఎమ్.డి.ఎ. పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో 400 ఎకరాలు, అమీన్‌పూర్‌లో 200 ఎకరాలు,

[88] ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, హిమాయత్‌నగర్ శాఖ, హైదరాబాద్

[89] ఋణ బకాయిల మొత్తం (ప్రస్తుత ఋణం కాకుండా) ః రూ 466.21 కోట్లు; ఆదాయం కన్నా అధికంగా ఉన్న ఖర్చు 2007-08 లో రూ 1.61 కోట్లు, 2008-09 లో రూ 26.83 కోట్లు

(2006 జూలై) ప్రకారం, ఋణాలు, పెట్టుబడులను రాష్ట్రప్రభుత్వాల ఆర్థిక అవసరాల కోసం వినియోగించకుండా బ్యాంకులు చూసుకోవాలి. దీనినుండి తప్పించుకోవడం కోసం ఈ ఋణాన్ని స్వల్పకాలికంగా ఏర్పడిన నిధుల కొరతను పూడ్చడానికి వినియోగిస్తామని హెచ్.ఎమ్.డి.ఎ. బ్యాంకుకు తప్పుడు సమాచారం ఇచ్చింది. హెచ్.ఎమ్.డి.ఎ. తీసుకున్న ఋణం, ఆ సంస్థ లక్ష్యాలకు, విధులకు అనుగుణంగా లేకపోవడమే కాకుండా ఋణంపై వడ్డీ రూపేణా రూ95.17 కోట్ల (2010 జనవరి వరకు) అదనపు ఆర్థిక భారానికి దారి తీసింది.

ఈ విషయాన్ని 2010 జూన్ లో ప్రభుత్వానికి తెలియచేసి 2010 ఆగస్టులో మరోమారు గుర్తు చేయడమైంది; దీనిపై సమాధానం రాలేదు (2010 నవంబరు).

**మునిసిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ**

**(తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ)**

### 3.4.12 తిరుపతిలో సమీకృత దేవాలయాల పర్యటన - టౌన్‌షిప్ ప్రాజెక్టు

**మెసర్స్ ఎమ్మార్ ఎమ్.జి.ఎఫ్ ల్యాండ్ లిమిటెడ్‌కు ప్రతి దశలోనూ అనుచిత లాభాలు కలిగేలా చేయడం వలన సవరించిన ఒప్పందం కుదుర్చుకోవలసి వచ్చింది. దీనివలన మొదట వచ్చిన ప్రతిపాదనలో కంటే రూ580 కోట్ల ఆదాయం తక్కువగా వస్తుంది.**

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఒక 'శాటిలైట్ టౌన్‌షిప్' ను నెలకొల్పేందుకు సూరప్పకాశం గ్రామంలోని ప్రభుత్వ భూములను (145.61 ఎకరాలు[90]) 2006 మార్చి లో తన స్వాధీనంలోకి తీసుకుంది. ఐతే ఒక నెలలోపుగానే, ప్రైవేటు పార్టీల నుండి ప్రతిపాదనలేవీ రాకముందే, సమీకృత దేవాలయాల పర్యటన - టౌన్‌షిప్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తామని మెసర్స్ ఎమ్మార్ ఎమ్‌జిఎఫ్ ల్యాండ్ లిమిటెడ్ అనే సంస్థ[91] (డెవలపర్) తనంతట తానుగా ప్రతిపాదించింది (2006 మే). ఆంధ్రప్రదేశ్ మౌలికవసతుల అభివృద్ధికి అధికారమిచ్చే చట్టం - 2001 (చట్టం) ను అనుసరించి పబ్లిక్ - ప్రైవేటు భాగస్వామ్యం కింద స్విస్ ఛాలెంజ్ పద్ధతి[92] లో ఈ ప్రాజెక్టును చేపడతామని డెవలపర్ ప్రతిపాదించడం జరిగింది. ముందుగా చెల్లించాల్సిన రూ15 కోట్ల అభివృద్ధి ఫీజుకు తోడు మొత్తం ఆదాయంలో 25 శాతం వాటాను ఇస్తామని డెవలపర్ ప్రతిపాదించడమైంది. ఎనిమిదేళ్ల కాలానికి మొత్తం ఆదాయం రూ3,287 కోట్లు కాగా అందులో 25 శాతం రూ821.76 కోట్లుగా లెక్క తేలింది. డెవలపర్‌ను ఒరిజినల్ ప్రాజెక్టు ప్రపోనెంటు (ఒ.పి.పి.) (ప్రాజెక్టును మొదట ప్రతిపాదించిన పార్టీ) గా పరిగణిస్తూ, 2006 జూన్‌లో తుడా ఆ సంస్థతో ఒక అవగాహనా ఒప్పందాన్ని (ఎమ్.ఒ.యూ.) కుదుర్చుకుంది.

చట్టంలోని నిబంధనలమేరకు, తుడా 2006 జూలైలో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ఆహ్వానించింది. దీనికోసం రెండు విడతల్లో, మొత్తం మీద 13 రోజుల గడువు మాత్రమే ఇచ్చారు. ఈ భారీ ప్రాజెక్టు పరిమాణం దృష్ట్యా చూస్తే ఏ పార్టీకైనా తమ ప్రతిపాదనలను సమర్పించడానికి ఈ అతి స్వల్ప గడువు ఏ మాత్రం సరిపోదు. ఫలితంగా తుడా ఆహ్వానానికి ఎవరినుంచీ స్పందన రాలేదు. డెవలపర్‌తో అభివృద్ధి ఒప్పందం మరియు సాధారణ పవర్ పట్టా (పవర్ ఆఫ్ అటార్నీ) 2006 ఆగస్టులో ఖరారు చేసుకున్నారు. ఆ సంస్థ చెల్లిస్తానన్న రూ15 కోట్లకు బదులుగా రూ4 కోట్ల అతి స్వల్ప మొత్తాన్ని మాత్రమే వసూలు చేసారు. ఐతే, ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి పొందలేదనే కారణంతో అడ్వాన్సుగా తీసుకున్న రూ4 కోట్లను కూడా తిరిగి ఇచ్చేసి,

[90] జిల్లా కలెక్టరు నిర్ణయించిన విధంగా, ఎకరానికి లక్ష రూపాయలు మార్కెటు రేటుకి

[91] తర్వాత ఈ కంపెనీ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ గా మారింది.

[92] అధికార సంస్థ ఎటువంటి సన్నాహక చర్యలనూ ప్రారంభించకముందే ప్రైవేటు రంగంలోని సంస్థ లేదా వ్యక్తులు తమంతట తాముగా ఒక ప్రాజెక్టును చేపడతామని ప్రతిపాదన చేస్తే ఆ విధానాన్ని స్విస్ ఛాలెంజ్ పద్ధతి అంటారు.

ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు (2006 అక్టోబరు). ప్రభుత్వ అనుమతి అవసరమే అయినప్పటికీ, ఈ ఒప్పందం కుదిరింది మాత్రం తుడాకు, డెవలపర్‌కూ మధ్యనే. ఐతే, డెవలపర్ తాను మొదట్లో ఇచ్చిన ప్రతిపాదనకు కట్టుబడి ఉండే ఉద్దేశం లేదన్నది స్పష్టంగా తెలుస్తుంది. లేకపోతే ఒప్పందం రద్దును ఆ సంస్థ సవాలు చేసి ఉండేది. ఒప్పందం రద్దు చేసిన తరువాత బహిరంగంగా బిడ్లను ఆహ్వానించడానికి బదులు, మళ్లీ అదే పార్టీకి తాజా ప్రతిపాదనలు సమర్పించే అవకాశాన్ని కల్పించారు.

తుడా ఆహ్వానంపై, 2007 మార్చి లో డెవలపర్ సవరించిన ప్రతిపాదనలను సమర్పించడమైంది. ఇందులో రూ15 కోట్ల అభివృద్ధి ఫీజుకు అదనంగా, రూ1,610 కోట్ల మొత్తం ఆదాయంలో 15 శాతాన్ని ఇస్తామని ప్రతిపాదించడమైంది. ఎనిమిదేళ్ల కాలానికి ఈ మొత్తం రూ241.61 కోట్లుగా లెక్క తేలింది. రూ5 కోట్లను అడ్వాన్సుగా చెల్లించాలి. అభివృద్ధి గడువులోని మొదటి ఏడాది తుడాకు చెల్లించాల్సిన ఆదాయంలో మినహాయించుకోవడం ద్వారా ఈ మొత్తాన్ని సర్దుబాటు చేస్తారు. తుడా మళ్లీ 2007 మే లో ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ఆహ్వానించింది. దీనికి 2007 జూలై 9 తో ముగిసేలా 60 రోజుల గడవు ఇచ్చారు. రెండు కంపెనీలు[93] ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను సమర్పించాయి. ఈ రెండు కంపెనీల వాణిజ్య ప్రతిపాదనలనూ, ఒ.పి.పి. ప్రతిపాదననూ కన్సల్టెంట్ మూల్యాంకనం చేసారని తెలిపారు. ప్రతిపాదనకు సంబంధించిన అభ్యర్థన లో చేర్చిన నమూనా లెక్కింపు పత్రం (ఆర్థికపరమైన మూల్యాంకనానికి నమూనా) ప్రకారం ఈ మూల్యాంకనం చేసారు. నికర ప్రస్తుత విలువ (ఎన్.పి.వి.) దృష్ట్యా ఒ.పి.పి. ప్రతిపాదనే అత్యుత్తమమైనదని తేల్చి ఒ.పి.పి. కే ప్రాజెక్టును కేటాయిస్తూ పత్రాన్ని జారీ చేయాల్సిందిగా సిఫార్సు చేసారు.

కేంద్ర నిఘా సంస్థ 2003 సెప్టెంబరు లో జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం బిడ్లను పారదర్శకంగా మూల్యాంకనం చేయాలంటే అర్హత ప్రమాణాలు, పనితీరు ప్రమాణాలు, మూల్యాంకనం చేసే ప్రాతిపదికలను స్పష్టమైన పదాలతో, ఎటువంటి అస్పష్టతలకూ తావు లేని విధంగా బిడ్ డాక్యుమెంట్లలో చేర్చాలి. ప్రస్తుత కేసులో, ఆర్థికపరమైన మూల్యాంకన నమూనా ప్రకారం, ఎన్.పి.వి. లెక్కగట్టడానికీ, వాణిజ్య ప్రతిపాదనను మూల్యాంకనం చేయడానికీ, రెండు కంపెనీలూ ఏడాదికి ఇస్తామన్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతిపాదించే రాబడిని శాతాలలో తెలుపమని మాత్రమే కోరడం వలన ప్రత్యామ్నాయంగా సమర్పించిన పోటీ బిడ్లలో తుడాకు ప్రతి ఏటా వచ్చే నగదు రాబడుల ప్రస్తావన లేదు. తుడా వద్ద కూడా ఈ సమాచారం లేదు. కన్సల్టెంటు చేసిన మూల్యాంకనానికి ప్రాతిపదిక కూడా తుడా వద్ద లేదు. ఆ విధంగా కన్సల్టెంట్ పోటీదార్ల ఎన్.పి.వి. ని లెక్కగట్టిన విధానంలో పారదర్శకత లేదు. కనుక ఈ రేట్లు పోల్చదగినవి కావు. పార్టీలు చేసిన ప్రతిపాదనలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆడిటుకు సమర్పించకపోవడం వలన ఈ ప్రతిపాదనల మూల్యాంకనపు ఖచ్చితత్వాన్ని ఆడిటు అంచనా వేయలేకపోయింది.

తుడా 2007 సెప్టెంబరులో డెవలపర్ తో అభివృద్ధి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తుడాకు అడ్వాన్సుగా రావలసిన మొత్తం రూ20 కోట్లు కాగా, రూ4 కోట్లు మాత్రమే వచ్చాయి (2007 సెప్టెంబరు). నవంబరు 2007 లో డెవలపర్ రూ16 కోట్లకు బ్యాంకు గ్యారంటీని సమర్పించారు. దీని చెల్లుబాటు గడువు 2008 నవంబరు 12 కాగా అదే రోజున చెల్లుబాటును మరో ఏడాది పొడిగించడమైంది.

2009 సెప్టెంబరు నాటికి కూడా డెవలపర్ మిగిలిన అభివృద్ధి ఫీజును చెల్లించకపోవడం, ఒప్పందపు షరతులను నెరవేర్చకపోవడం వలన తుడా, డెవలపర్‌కు నోటీసులు జారీ చేసి, బ్యాంకు గ్యారంటీని నగదుగా మార్చుకొని రూ16 కోట్ల మొత్తాన్ని పొందింది (2009 సెప్టెంబరు). ఐతే, బ్యాంకు గ్యారంటీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేయాలనీ, డెవలపర్ సమర్పించిన సవివరమైన ప్రాజెక్టు నివేదికను (డి.పి.ఆర్.) ను ఆమోదించమనీ ప్రభుత్వం తుడాను

[93] లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్, రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అనే ఒక కన్సార్టియం

ఆదేశించింది (2010 జనవరి). 2009 నవంబరులో సమర్పించిన ఈ ఈ నివేదికలో అప్పటికే తగ్గించిన ప్రతిపాదిత ఆదాయం రూ256.61 కోట్లకు బదులుగా రూ191.81 కోట్ల రాబడిని మాత్రమే ఇస్తామని పేర్కొన్నారు. జూన్ 2010 నాటికి రూ16 కోట్ల బ్యాంకు గ్యారంటీ మొత్తాన్ని డెవలపర్‌కు తిరిగి ఇచ్చేసారు. రూ256.61 కోట్ల రాబడికి సంబంధించిన ఒప్పందాన్ని రద్దు చేయలేదు. పైగా 2010 జూలై 15 ను డ్రాప్ డెడ్ డేట్[94] (డి.డి.డి.) గా ప్రభుత్వం నిర్ణయించింది (2010 జూలై). నిజానికి 2010 మే 31 వరకు మాత్రమే డి.డి.డి. ని పొడిగించాలని డెవలపర్ కోరడమైంది. అంటే ఎటువంటి అభ్యర్థనా లేకుండానే 45 రోజుల అదనపు గడువును ఇవ్వడం జరిగింది. ఆవిధంగా, సదరు సంస్థ స్వల్ప మొత్తంలో మాత్రమే నిధులు వెచ్చించి విలువైన భూమిని తన ఆధీనంలోనే ఉంచుకోవడం ద్వారా అధిక లాభాపేక్షతో వ్యాపారం (స్పెక్యులేషన్) చేసే అవకాశం కల్పించినట్లయ్యింది. ఫలితంగా ఎప్పుడో 2006 మేలో ప్రతిపాదన వస్తే 2010 జూన్ నాటికి కూడా ఆ స్థలాన్ని అభివృద్ధి చేయనేలేదు.

ఆ విధంగా, పారదర్శకత లోపించడం వలన మెసర్స్ ఎమ్మార్ ఎమ్.జి.ఎఫ్. ల్యాండ్ లిమిటెడ్‌కు చేకూర్చిన అనుచిత లబ్ధి వలన తుడా సవరించిన ఒప్పందం కుదుర్చుకోవలసివచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం మొదటి ప్రతిపాదన కంటే రూ580 కోట్లు తక్కువ ఆదాయం వస్తోంది.

పై విషయాలను 2010 జూన్‌లో ప్రభుత్వానికి తెలపడమైంది (2010 ఆగస్టులో మరోసారి ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడమైంది); సమాధానం ఇంకా రాలేదు (2010 నవంబరు).

**రెవెన్యూ శాఖ**

### 3.4.13 ప్రభుత్వ భూముల కేటాయింపులు

**భూముల కేటాయింపుల్లో పారదర్శకత, ధర్మబద్ధత లోపించడమే కాకుండా వివిధ వర్గాలవారికి రూ101.43 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.**

ప్రభుత్వ విధాన మార్గదర్శకాల[95] (2005 ఫిబ్రవరి) ప్రకారం, గుర్తింపు పొందిన, రిజిస్టరైన వార్తాపత్రికలకు చెందిన విలేఖర్లకు భూముల ప్రాథమిక విలువకూ, విద్యాసంస్థలు/ధార్మిక సంస్థలు, ఇతర సంస్థలకు భూముల మార్కెటు విలువకూ మాత్రమే భూకేటాయింపులు చేయాలి. 2006-09 మధ్యకాలంలో ప్రభుత్వం వివిధ సంస్థలకు చేసిన భూకేటాయింపుల్లో[96] చిత్తూరు (18), తూర్పుగోదావరి (12), కరీంనగర్ (7), విశాఖపట్నం (13) జిల్లాల్లోని 50 లావాదేవీలను[97] (మొత్తం 77 లావాదేవీలకు[98] గాను) ఆడిటు పరిశీలించగా (2009 అక్టోబరు-డిశంబరు) ఈ కింది విషయాలు వెల్లడయ్యాయి

**భూముల ధరను నిర్ణయించడం**

పైన పేర్కొన్న ఆదేశాలకు విరుద్ధంగా, ప్రభుత్వం ప్రాథమిక విలువ/మార్కెట్ విలువ కంటే చాలా తక్కువ ధరలకే భూములను కేటాయించిందని ఆడిటు గమనించింది. ఒకే ప్రయోజనానికి భూమిని కేటాయించినప్పటికీ వివిధ కేసుల్లో కేటాయింపు ధరకూ, మార్కెటు ధరకూ మధ్య భారీ వ్యత్యాసాలున్నాయి.

[94] ఒప్పందం గడువు ముగిసిన నాటి నుండి ఆరునెలల తర్వాత వచ్చే తేదీ లేదా ఉభయ పక్షాలూ రాత పూర్వకంగా అంగీకరించిన మరో తేదీ

[95] రెవెన్యూ (అసైన్ మెంట్-1) శాఖ, జీ.ఓ.ఎమ్.ఎస్ సంఖ్య.243, తేది : 2005 ఫిబ్రవరి 24

[96] గృహాలు, సంస్థలు, పారిశ్రామిక అవసరాలు

[97] 627.84 ఎకరాలు

[98] 5208.72 ఎకరాలు

ఈ నాలుగు జిల్లాల్లో 2006-09 మధ్య చేసిన భూకేటాయింపులను తనిఖీ చేయగా, ప్రభుత్వ భూముల కేటాయింపులో 12 మంది లబ్ధిదార్లకు (భూవిస్తీర్ణం :159 ఎకరాలు) మొత్తం మీద రూ101.43 కోట్ల మేర అనుచితలబ్ధి చేకూర్చినట్టు వెల్లడైంది. వర్గాలవారీగా వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి:

- ఇళ్ల నిర్మాణానికి భూములను కేటాయించిన మూడు కేసుల్లో ప్రాథమిక విలువ కంటే 64 నుండి 93 శాతం తక్కువ ధరకే ప్రభుత్వం భూములను కేటాయించింది. ఈ మూడు కేసుల్లో మొత్తం రూ61.10 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.
- విద్యాసంబంధిత అవసరాలకు భూమిని కేటాయించిన మరో మూడు కేసుల్లో మార్కెటు విలువ కంటే 83 నుండి 85 శాతం తక్కువ ధరకే భూములను కేటాయించారు. ఈ మూడు కేసుల్లో చేకూరిన మొత్తం అనుచితలబ్ధి రూ21.58 కోట్లు.
- మరో మూడు కేసుల్లో, మౌలిక సదుపాయాల కోసం భూములను మార్కెటు విలువ కంటే తక్కువ ధరకు కేటాయించడం జరిగింది. ఈ మూడు కేసుల్లో మొత్తం రూ18.64 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

పైన తెలిపిన కేసుల వివరాలు *అనుబంధం - 3.11* లో ఉన్నాయి. వీటిలో ఒక్కో కేటగిరీకి సంబంధించిన కొన్ని ముఖ్యమైన కేసులను ఈ కింద వివరించడమైంది :

| భూకేటాయింపు వివరాలు | ఆడిటు కనుగొన్న విషయాలు |
|---|---|
| ప్రయోజనం : ఇళ్ల స్థలాల కోసం | |
| **లబ్ధిదారు** : విశాఖపట్నంలోని గుర్తింపు పొందిన విలేఖర్ల సంఘం, 2005<br>**భూమి విస్తీర్ణం/గ్రామం/మండలం:** విశాఖపట్నం రూరల్ మండలంలోని మధురవాడ గ్రామంలో 336, 337 సర్వే నంబర్లలోని 14 ఎకరాల భూమి.<br>**కేటాయింపు ధర** : చదరపు గజానికి రూ740<br>**భూమి ప్రాథమిక విలువ** : చదరపు గజానికి రూ9,000<br>**కేటాయింపు ధర - ప్రాథమిక విలువల నిష్పత్తి** : 0.08 | రూ60.98 కోట్లకు కేటాయించాల్సిన భూమిని కేవలం రూ5.01 కోట్లకే (మూలధరలో ఎనిమిది శాతం) కేటాయించడం (2009 ఫిబ్రవరి) వలన ఈ కేసులో రూ55.97 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. |
| ప్రయోజనం : విద్యా సంస్థలను స్థాపించడం | |
| **లబ్ధిదారు** : అంబేద్కర్ విద్య - సంక్షేమ సమితి, శ్రీకాకుళం<br>**భూమి విస్తీర్ణం/గ్రామం/మండలం:**<br>విశాఖపట్నం రూరల్ మండలంలోని బక్కన్నపాలెం గ్రామంలో 15 ఎకరాలు | |

| | |
|---|---|
| **కేటాయింపు ధర :** ఎకరానికి రూ6 లక్షలు<br>**భూమి మార్కెటు విలువ:** ఎకరానికి రూ40 లక్షలు (ఈ విలువ వేలం ద్వారా నిర్ణయించింది కాదు)<br>**కేటాయింపు ధర - మార్కెటు విలువల నిష్పత్తి:** 0.15 | |
| **అనుసరించదగ్గ అత్యుత్తమ పద్ధతి :** అనుసరించ దగ్గ అత్యుత్తమ పద్ధతుల గురించి తెలుసు కోవడం కోసం, మహారాష్ట్రకు చెందిన నగర, పారిశ్రామిక అభివృద్ధి సంస్థ, (సిడ్కో) అవలంబించిన పద్ధతిని ఆడిటు పరిశీలించింది. ఈ విధానంలో, విద్యాసంస్థల కోసం రిజర్వు చేసిన భూముల నుండి మాత్రమే ఈ అవసరానికి స్థలాలను కేటాయిస్తారు. అలాంటి అవసరం కోసం అందరికీ వర్తించేలా, ముందుగా నిర్ణయించిన తగ్గింపు ధరకు మాత్రమే భూమిని కేటాయించడం జరుగుతుంది.<br><br>అంతేకాకుండా, ఆ సంస్థలు ఈ కింద తెలిపిన విధంగా ముందుగా నిర్ణయించిన కొన్ని అర్హతలను కలిగి ఉండాలి : (ఎ) విద్యా సంస్థను నిర్వహించడంలో కనీసం పదేళ్ల అనుభవాన్ని కలిగి ఉండటం, (బి) గత మూడేళ్లలో 85 శాతం కంటే ఎక్కువ ఉత్తీర్ణతా శాతం ఉండటం; ఇంకా (సి) నిర్దేశించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తిచేసేందుకు కావలసిన ఆర్థిక స్థోమత కల్గి ఉండటం.<br><br>ఈ పద్ధతి ద్వారా, కేవలం పేరెన్నిక గన్న సంస్థలు మాత్రమే విద్యాసంస్థలు స్థాపించి, నాణ్యమైన విద్యను అందించడానికి ఈ భూములు ఉపయోగపడేలా చూడవచ్చు. | • ప్రభుత్వం మార్కెట్ విలువ (రూ6 కోట్లు) కంటే అతి తక్కువ ధరకే (రూ90 లక్షలు) భూమిని కేటాయించి (2007 ఆగస్టు) లబ్ధిదారుకు రూ5.10 కోట్ల అనుచిత లబ్ధిని చేకూర్చింది.<br>• భూమిని కేటాయించేటప్పుడు, విద్యా సంస్థల నిర్వహణలో లబ్ధిదారునికున్న పూర్వ అనుభవాన్ని ప్రభుత్వం పరిశీలించలేదు. ఈ సంస్థను 2005 లో స్థాపించారు. ఐతే, అదే లబ్ధిదారు గతంలో ఏదైనా విద్యా సంస్థను నిర్వహించిన దాఖలాలు లేవు.<br><br>ఈ కేసులో జిల్లా కలెక్టరు, ఏ ప్రయోజనం కోసం నిర్మాణం చేపట్టాలన్నది కానీ, నిర్మాణం పూర్తి చేయడానికి గడువుని కానీ నిర్దేశించలేదు. మార్కెటు విలువ కంటే అతి తక్కువ ధరకే భూమిని కేటాయించినప్పటికీ, ఈ తగ్గింపు ధర వల్ల కలిగే ప్రయోజనం విద్యార్థులకు అందేలా, ఫీజుల్లో తగ్గింపు వంటి షరతులేవీ కలెక్టరు విధించలేదు.<br><br>నిర్మాణాన్ని చేపట్టడం కోసం లబ్ధిదారు ఈ భూమిని బ్యాంకుకు తనఖా పెట్టేందుకు కూడా అనుమతి నిచ్చారు (2008 ఏప్రిల్). దీన్నిబట్టి, తనంతట తానుగా, ప్రతిపాదిత ప్రాజెక్టును పూర్తిచేసే ఆర్థిక స్థోమత ఆ సంస్థకు లేదని తెలుస్తోంది. ప్రభుత్వం అతి తక్కువ ధరకు కేటాయించిన భూమిని తనఖాపెట్టి బ్యాంకు నుండి తీసుకున్న మొత్తాన్ని విద్యాసంస్థను స్థాపించడానికే పూర్తిగా వినియోగిస్తారన్న భరోసా కూడా లేదు. |

| | |
|---|---|
| **ప్రయోజనం : వృద్ధులకు, అనాథలకు కాటేజీలను నిర్మించడం** | |
| **లబ్ధిదారు** : హయగ్రీవా ఫార్మ్స్ అండ్ డెవలపర్స్[99], విశాఖపట్నం<br>**భూమి విస్తీర్ణం/గ్రామం/మండలం:** విశాఖపట్నం రూరల్ మండలంలోని ఎండాడ గ్రామంలో 92/3 సర్వే నంబర్లోని 12.51 ఎకరాల భూమి.<br>**కేటాయింపు ధర** : ఎకరానికి రూ45 లక్షలు<br>**భూమి మార్కెటు విలువ** : ఎకరానికి రూ1.50 కోట్లు<br>**కేటాయింపు ధర - మార్కెటు విలువల నిష్పత్తి** : 0.3 | మార్కెటు విలువ (రూ18.76 కోట్లు) కంటే అతి తక్కువ ధరకు (రూ5.63కోట్లు) ప్రభుత్వం భూమిని కేటాయించడం ద్వారా లబ్ధిదారునికి రూ13.13 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.<br>నిర్ణయించిన మొత్తం వసూలైన తర్వాత మాత్రమే భూమిని కేటాయించాలి. కానీ ఈ కేసులో లబ్ధిదారు ఇంకా రూ4.86 కోట్లు చెల్లించాల్సి ఉంది (2010 ఫిబ్రవరి). |
| **ప్రయోజనం : పారిశ్రామిక/వ్యాపార అవసరాలు** | |
| **లబ్ధిదారు** : మెసర్స్ సుదర్శన్ స్టీల్స్ లిమిటెడ్, విశాఖపట్నం<br>**భూమి విస్తీర్ణం/గ్రామం/మండలం:** విశాఖపట్నంలో ఐదు ఎకరాలు.<br>**కేటాయింపు ధర** : ఎకరానికి రూ25,000<br>**భూమి మార్కెటు విలువ** : ఎకరానికి రూ75 లక్షలు<br>**కేటాయింపు ధర - మార్కెటు విలువల నిష్పత్తి** : 0.003 | ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల (బదిలీ నిషేధం) చట్టం-1977 కు విరుద్ధంగా, ఈ సంస్థ ఐదు ఎకరాల భూమిని కొనుగోలు చేసి (1981) ఉక్కుపరిశ్రమను స్థాపించడం కోసం ఆ భూమిని తమ పేరున బదిలీ చేయ్యాల్సిందిగా దరఖాస్తు చేసుకుంది (1986 అక్టోబరు). ఈ భూమి నివాస ప్రాంతం (రెసిడెన్షియల్ జోన్) లో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎకరానికి రూ25,000 చొప్పున రేటు నిర్ణయించి, పరిశ్రమను స్థాపించేందుకు కేటాయించింది (1988). ఐతే, పరిశ్రమ స్థాపన అసలు జరగనే లేదు.<br>భూకేటాయింపును రద్దుచేస్తూ ప్రభుత్వం నోటీసును జారీచేసింది (2000 ఏప్రిల్). మళ్లీ ఇదే స్థలాన్ని ఈ సారి పర్యాటక ప్రాజెక్టు కోసం తమకు కేటాయించాలని ఆ సంస్థ కోరింది (2005 డిశంబరు). పరిశ్రమ స్థాపనలో విఫలమైన అదే కంపెనీకి, అప్పటికి ఉన్న మార్కెటు రేటు ప్రకారం కాకుండా, ఎకరానికి రూ25,000 చొప్పున పాతరేటుకే ప్రభుత్వం మళ్లీ |

[99] ఈ సంస్థకు భూమిని ఇంకా అప్పగించాల్సి ఉంది.

| | |
|---|---|
| | భూమిని కేటాయించింది (2008 సెప్టెంబరు). దీనివలన ఆ సంస్థకు రూ3.74 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.<br><br>ఆ విధంగా, ప్రతి దశ లోనూ సంస్థకు అనుచిత లబ్ధిని చేకూర్చారు. అంతేకాక, కేటాయించిన ప్రయోజనానికి వినియోగించకుండా భూమిని సంస్థ వద్దే ఉంచుకోనిచ్చారు. దీంతో స్పెక్యులేషన్ ధోరణిని ప్రోత్సహించినట్లయింది. |
| **ప్రయోజనం : కమ్యూనిటీ ప్రాజెక్టుల నిర్మాణం** | |
| **లబ్ధిదారు** : ఎ.ఎమ్.జి. ఇండియా ఇంటర్నేషనల్, కాకినాడ<br><br>**భూమి విస్తీర్ణం/గ్రామం/మండలం:** కాకినాడలో 7,066 చదరపు గజాల భూమి<br><br>**కేటాయింపు ధర** : చదరపు గజానికి రూ500<br><br>**భూమి మార్కెటు విలువ** : చదరపు గజానికి రూ3,000<br><br>**కేటాయింపు ధర - మార్కెటు విలువల నిష్పత్తి** : 0.17 | భూమి మార్కెటు విలువను వసూలు చేసిన తర్వాతే ప్రభుత్వ భూమిని కేటాయించాలని నిబంధనలు నిర్దేశిస్తున్నాయి<br>ప్రభుత్వం మార్కెటు విలువ (రూ2.12 కోట్లు) కంటే అతి తక్కువ ధరకే (రూ35.33 లక్షలు) భూమిని కేటాయించి లబ్ధిదారుకు రూ1.77 కోట్ల అనుచిత లబ్ధిని చేకూర్చింది. లబ్ధిదారు ఈ భూమికి చదరపు గజానికి రూ1,400 చొప్పున చెల్లించడానికి ముందుకు వచ్చినప్పటికీ (2005 నవంబరు), కనీసం ఈ రేటును కూడా వసూలు చేయకపోవడం ఈ కేసులోని మరో ఆసక్తికరమైన విషయం. |

- కమ్యూనిటీ హాళ్ల కోసం భూమిని కేటాయించిన మరో మూడు కేసుల్లో (వివరాలు *అనుబంధం - 3.11* లో ఉన్నాయి). మార్కెటు విలువ కంటే 73 శాతం తక్కువ రేటుకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. మార్కెటు విలువ రూ10.98 లక్షలుండగా, భూకేటాయింపు పొందిన వారినుండి ప్రభుత్వం అతిస్వల్పంగా కేవలం రూ30,000 మాత్రమే వసూలు చేసింది. ఈ కేసుల్లో లబ్ధిదార్లకు రూ10.68 లక్షల అనుచిత లబ్ధి చేకూరింది.
- మతసంబంధిత అవసరాలకు భూమిని కేటాయించిన మరో మూడు కేసుల్లోనూ కేటాయింపు ధర, మార్కెటు ధరల నిష్పత్తిలో భారీ వ్యత్యాసాలున్నాయి (సున్నా నుండి ఇరవై ఐదు శాతం).

**ఏళ్ల తరబడి భూములను వినియోగించకపోవడం**

1988 నుండి 2008 మధ్యకాలంలో ప్రభుత్వం 25.48 ఎకరాల భూమిని కేటాయించిన ఏడు కేసులను తనిఖీ చేయగా (వివరాలు *అనుబంధం - 3.12* లో ఉన్నాయి), భూకేటాయింపులు పొందినవారు అందులో కేవలం 0.46 ఎకరం భూమిని మాత్రమే వినియోగించారని (2010 జనవరి) వెల్లడైంది.

**భూకేటాయింపు ప్రతిపాదనలను ఖరారు చేయకపోవడం, భూమి విలువను వసూలు చేయకపోవడం**
ఈ నాలుగు జిల్లాల్లో, 168 కేసుల్లో[100] 4,839.17 ఎకరాల భూములను 1981 నుండి 2009 మధ్య కాలంలో లబ్ధిదార్లకు ముందస్తుగానే అప్పగించేసారనీ, ఆ భూముల విలువ చెల్లించకుండానే లబ్ధిదార్లు వాటిని వినియోగించుకుంటున్నారనీ ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.

ఆ విధంగా, ఆడిటు మచ్చుకు తనిఖీచేసిన భూకేటాయింపు కేసుల్లో, పారదర్శకత, ధర్మబద్ధత సూత్రాలను ప్రభుత్వం పాటించలేదు. అంతేకాకుండా భూముల విలువను వాటి ప్రాథమిక విలువ/మార్కెటు రేటు కంటే చాలా తక్కువగా నిర్ణయించడం జరిగింది. దీనివలన, పైన పేర్కొన్న విధంగా సంబంధిత లబ్ధిదార్లకు మొత్తం రూ101.43 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. పైగా, కేటాయించిన భూములను వినియోగించుకోవడానికి నిర్దిష్ట గడువును విధించడంలోనూ, గడువును పాటించని సందర్భాల్లో భూములను తిరిగి స్వాధీనపరచుకొని ఇతరులకు కేటాయించడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. ఆయాసంస్థలు/వ్యక్తులు విలువైన భూములను తమ స్వాధీనంలో ఉంచుకుని, స్పెక్యులేషన్ ధోరణిని అవలంబించేలా ఇది దోహదపడింది. పైగా, ఆ భూములను ఇతరులెవరైనా వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా పోయింది.

ఈ విషయాలను ప్రభుత్వానికి 2010 మార్చిలో తెలపడమైంది (2010 మేలో మరొకసారి గుర్తుచేయడం కూడా జరిగింది); దీనిపై సమాధానం రాలేదు (2010 నవంబరు).

**రెవెన్యూ, ఇంధనం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖలు**

### 3.4.14 పదేళ్లు గడిచినా విద్యుత్ ప్రాజెక్టును నెలకొల్పకపోవడం

**తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నప్పటికీ, విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడంలో విఫలమైన ఓ ప్రైవేటు సంస్థకు చేసిన భూమి కేటాయింపును రద్దు చేసి, సరసమైన ధరకు విద్యుత్తును సరఫరా చేయగలిగే మరే సంస్థకైనా ఆ భూమిని కేటాయించడంలో ప్రభుత్వం విఫలమయ్యింది.**

విశాఖపట్నం జిల్లాలోని దేవాడ గ్రామంలో ఒక థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడంకోసం ప్రభుత్వం 1,122.38 ఎకరాల భూమిని, మెసర్స్ హిందూజా నేషనల్ పవర్ కార్పోరేషన్ లిమిటెడ్ కి, (హెచ్.ఎన్.పి.సి.ఎల్.) కి రూ26.63 కోట్ల మొత్తానికి[101] కేటాయించింది. (1999 ఏప్రిల్ - మే). ఐతే, ఈ మొత్తాన్ని పూర్తిగా వసూలు చేయకుండానే (తక్కువగా వసూలు చేసింది : రూ16.42 కోట్లు) హెచ్.ఎన్.పి.సి.ఎల్. కి భూమిని అప్పగించేసారు.

హెచ్.ఎన్.పి.సి.ఎల్. ప్రతిపాదించిన ఈ పవర్ ప్లాంటు ఇంతవరకూ రానేలేదనీ 2010 ఫిబ్రవరి నాటికి కూడా ఆ భూమిని వినియోగించలేదనీ ఆడిటు పరిశీలన (2010 జనవరి-ఫిబ్రవరి) లో వెల్లడైంది. హెచ్.ఎన్.పి.సి.ఎల్. తో చేసుకున్న ఒప్పందం ప్రకారం, ఒప్పందం జరిగిన తేదీ (1998 ఏప్రిల్ 15) నుండి 12 నెలల్లోగా ఆర్థిక వనరుల సమీకరణ (ఫైనాన్షియల్ క్లోజర్) పూర్తి చేయాలి. ఫైనాన్షియల్ క్లోజర్ తేదీ నుంచి 44 నెలల్లోగా ప్రాజెక్టు పూర్తి చేయాలి. ఐతే ఈ ఫైనాన్షియల్ క్లోజర్ తేదీని పలు దఫాలుగా 2001 మార్చి 31 వరకూ పొడిగించారు. హెచ్.ఎన్.పి.సి.ఎల్. అంగీకరించిన దాని ప్రకారం, ఫైనాన్షియల్ క్లోజర్ తేదీ నుండి ఆరువారాల్లోగా మిగతా భూమి విలువను చెల్లించాలి. భూమి అప్పగింతకు సంబంధించిన నిబంధనలలో ఒక ప్రాథమిక లోపం ఉంది. అదేంటంటే, మిగతా మొత్తం చెల్లింపును ఫైనాన్షియల్ క్లోజర్‌తో ముడిపెట్టడం. ఐతే,

---

[100] చిత్తూరు - 53 కేసులు (242.26 ఎకరాలు), తూర్పుగోదావరి 4 కేసులు (181.91 ఎకరాలు), కరీంనగర్ - 103 కేసులు (729.12 ఎకరాలు), విశాఖపట్నం - 8 కేసులు (3685.88 ఎకరాలు)

[101] భూమి ఖరీదు రూ25.25 కోట్లు (ఎకరానికి రూ2.25 లక్షలు) + అభివృద్ధి ఛార్జీలు రూ1.38 కోట్లు

మొదట్లో నిర్దేశించిన గడువును ఖచ్చితంగా అమలు పరచకపోవడంతో అది జరగనేలేదు. 2007 లో, ఎ.పి.జెన్‌కో[102]/ఎన్.టి.పి.సి.[103] లాంటి ప్రభుత్వ సంస్థలు, విద్యుదుత్పత్తి కోసం అదే భూమిని తమకు కేటాయించాలని కోరాయి. పోటీ లేకుండా అధిక ధరకు హెచ్.ఎన్.పి.సి.ఎల్. ఇచ్చే విద్యుత్తుకి బదులుగా ప్రైవేటు కంపెనీల నుండి బహిరంగ బిడ్లను ఆహ్వానించడం ద్వారా అంతకన్నా తక్కువ ధరలను పొందాలని ఎ.పి.ట్రాన్స్‌కో[104] కూడా ప్రభుత్వాన్ని కోరింది. విద్యుత్ సరఫరా కోసం, రాష్ట్రంలోని నాలుగు డిస్కంలు[105] 2007 ఫిబ్రవరిలో ఎన్.టి.పి.సి.తో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకున్నాయనీ, సింహాద్రి ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు కోసం ఈ భూమిలో కొంత భాగాన్ని తమకు కేటాయించాలని ఎన్.టి.పి.సి. ప్రభుత్వాన్ని కోరడం జరిగిందనీ ఎ.పి.ట్రాన్స్‌కో ప్రభుత్వానికి తెలియజేసింది (2007 ఫిబ్రవరి). అంతేకాకుండా, విద్యుత్ పరిశ్రమలను నెలకొల్పి, తక్కువ ధరలకు విద్యుత్తును సరఫరా చేయడంలో ఎన్.టి.పి.సి.కి చక్కని గత చరిత్ర ఉందని కూడా ఎ.పి.ట్రాన్స్‌కో పేర్కొంది. కానీ, ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణించకుండా హెచ్.ఎన్.పి.సి.ఎల్. వద్దే ఆ భూమిని ఉండనిచ్చింది.

హెచ్.ఎన్.పి.సి.ఎల్. పూర్తి భూమి విలువను ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో పాటు నిర్దేశిత గడువులోగా ఫైనాన్షియల్ క్లోజర్ కూడా సాధించకపోవడం ద్వారా ఆ సంస్థ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించింది కనుక ఆ సంస్థతో చేసుకున్న ఒప్పందం రద్దయినట్లేనని 2005 జూన్‌లో ప్రభుత్వానికిచ్చిన న్యాయ సలహాలో కూడా స్పష్టంగా ఉంది.

ఇదిలా ఉండగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పు[106] (2004 ఫిబ్రవరి) ప్రకారం, ఈ భూమిపై హక్కులు ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డుకు చెందుతాయని తేలింది. ఈ భూమిని 1999 నాటి పాత రేట్లకే హెచ్.ఎన్.పి.సి.ఎల్. కి అమ్మాల్సిందిగా ప్రభుత్వం వక్ఫ్ బోర్డును ఆదేశించింది. తదనుగుణంగా, వక్ఫ్ బోర్డు 2008 ఏప్రిల్ లో ఈ భూమిని పాత (1999) రేట్ల ప్రకారం రూ47.55 కోట్లకు[107] అమ్మేసింది. మార్కెట్ రేట్ల (2007 జనవరి) ప్రకారం దీని విలువ రూ224.47 కోట్లు[108] ఉంది. ఆడిటు ఈ విషయాన్ని ప్రస్తావించగా, 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 97 ప్రకారం, ప్రభుత్వ ఆదేశాల మేరకే ఈ విధంగా చేసామని అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి సమాధానమిచ్చారు (2010 మార్చి).

చట్టంలోని సెక్షన్ 51 ప్రకారం, బహిరంగ వేలం ద్వారా మాత్రమే ఆస్తుల అమ్మకం జరగాలని స్పష్టంగా వుంది కనుక, ప్రభుత్వ సమాధానం ఆమోదయోగ్యం కాదు. సెక్షన్ 97 ని సెక్షన్ 96 తో కలిపి చదివితే, అవి వక్ఫ్‌లకు సంబంధించిన లౌకిక కార్యకలాపాల క్రమబద్ధీకరణ గురించి చెబుతున్నాయని తెలుస్తుంది. అంతేకాక, దేవాడ గ్రామం మొత్తం పూర్వపు ముస్లిం పాలకులు కేవలం మతపరమైన, చారిటబుల్ సేవల కోసం మాత్రమే మంజూరు చేసిన ఈనాం భూమి. బహిరంగ వేలం నిర్వహించకుండా, 1999 సంవత్సరంలో వున్న రేట్లకే హెచ్.ఎన్.పి.సి.ఎల్. కి భూమిని అమ్మాలని ప్రభుత్వం వక్ఫ్ బోర్డుని ఆదేశించటం అనుచితం మాత్రమే కాకుండా, అది 1995 వక్ఫ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా కూడా ఉంది. పైగా, ఎ.పి.జెన్‌కో/ఎన్.టి.పి.సి.

[102] ఎ.పి.పవర్ జనరేషన్ కార్పోరేషన్ లిమిటెడ్

[103] నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్

[104] ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్

[105] డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు

[106] 2004 సంవత్సరపు డబ్ల్యూ. పి.నెం.2364

[107] బకాయి ఉన్న రూ16,41,48,075 పై భూమిని స్వాధీనం చేసుకున్న తేదీ నుండి సొమ్ము చెల్లించిన తేదీ వరకూ, మొదటి ఏడాదికి 9 శాతం చొప్పున రెండవ ఏడాది నుండి 15 శాతం చొప్పున లెక్కగట్టిన వడ్డీ (రూ20.93 కోట్లు) కూడా ఈ మొత్తంలో ఉంది.

[108] జిల్లా కలెక్టరు మదింపు వేసిన దాని ప్రకారం (2007 జనవరి) ఎకరానికి రూ20 లక్షలు X 1,122.38 ఎకరాలు

రేట్లతో సమానంగానే విద్యుత్ సరఫరా చేయాలన్న షరతు లేకుండా అటువంటి లబ్ధిని చేకూర్చడం మరింత అభ్యంతరకరం.

దీనిపై రెవెన్యూ, ఇంధన శాఖల నుండి సమాధానం రాలేదు (2010 నవంబరు).

## 3.5 సాధారణ అంశాలు

### ఆడిటు నివేదికలపై తదనంతర చర్యలు

### 3.5.1 వివరణాత్మక (తీసుకున్న చర్యల) నివేదికలను సమర్పించలేదు

ఆర్థిక మరియు ప్రణాళికా శాఖ 1993 నవంబరులో జారీచేసిన ఆదేశాల ప్రకారం, ప్రజా పద్దుల కమిటీ (పి.ఎ.సి.) నుండి నోటీసు కోసం గానీ, పిలుపు కోసంగానీ ఎదురు చూడకుండా ఆడిట్ నివేదికలను శాసన సభకు సమర్పించిన మూడు నెలల లోపుగానే ఆడిట్ నివేదికలలో పొందుపర్చిన పేరాలు, సమీక్షలపై ప్రతిపాదించిన లేదా తీసుకొన్న చర్యలను సూచిస్తూ సంబంధిత పరిపాలనా శాఖలు వివరణాత్మక నివేదికలను సమర్పించాల్సి ఉంది.

ఐతే, 2010 అక్టోబరు నాటికి 1997-98 నుండి 2008-09 మధ్య సంవత్సరాల ఆడిటు నివేదికల్లోని 68 పేరాలు/సమీక్షలపై 16 ప్రభుత్వ శాఖలు వివరణాత్మక నివేదికలను సమర్పించలేదు. వీటి వివరాలను *అనుబంధం - 3.13* లో ఇవ్వడం జరిగింది.

### 3.5.2 ప్రజా పద్దుల కమిటీ సిఫార్సులపై చర్యలు తీసుకోకపోవడం

ప్రజా పద్దుల సంఘం (పి.ఎ.సి.) చేసిన సిఫార్సులు అందిన తేదీ(ల) నుండి ఆరు నెలల్లోగా ఆ సిఫార్సులపై తీసుకొన్న చర్యల నివేదిక (ఎ.టి.ఎన్.) లను సమర్పించాల్సిందిగా ఆర్థిక, ప్రణాళికా శాఖ అన్ని పాలనా శాఖలకు, శాఖాధిపతులకు ఆదేశాలు జారీ చేసింది (1995 మే). 1962 నుండి 2001-02 మధ్యకాలానికి సంబంధించిన 352 సిఫార్సులపై ఎ.టి.ఎన్. లను సంబంధిత పాలనా శాఖలు 2010 అక్టోబరు నాటికి ఇంకా సమర్పించవలసి ఉంది. వీటిలో, ఒక్క నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ నుంచే 213 ఎ.టి.ఎన్.లు (61 శాతం) రావలసి ఉంది. వివరాలు *అనుబంధం- 3.14* లో ఇవ్వడం జరిగింది.

### 3.5.3 ఆడిట్‌పట్ల కొరవడిన ప్రతిస్పందన

లావాదేవీలను మచ్చుకు తనిఖీ చేయడంకోసమూ, నిర్దేశిత నియమాలు, పద్ధతుల ప్రకారం ముఖ్యమైన అకౌంటింగు, ఇతర రికార్డుల నిర్వహణను పరిశీలించడం కోసమూ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సివిల్ ఆడిట్) (పి.ఎ.జి.) నియతకాలికంగా ప్రభుత్వ శాఖల తనిఖీలను నిర్వహించి, ఆ తర్వాత తనిఖీ నివేదిక (ఐ.ఆర్.) లను జారీ చేస్తారు. పి.ఎ.జి. జారీ చేసిన ఐ.ఆర్.లపై అధికార వర్గం సత్వరమే స్పందించి, నిర్దేశిత నియమాలు, పద్ధతులకనుగుణంగా దిద్దుబాటు చర్యలను తీసుకోవడం లోనూ, తనిఖీలో వెల్లడైన అవకతవకలకూ, లోపాలకూ బాధ్యులైన వారిని గుర్తించే విషయంలోనూ చర్యలు తీసుకునేలా చూడాలని అభ్యంతరాలు/ఐ.ఆర్.ల సత్వర పరిష్కారం కోసం ప్రభుత్వ ఆర్థిక , ప్రణాళిక శాఖ జారీ చేసిన (1995) ఆదేశాల పుస్తకం నిర్దేశిస్తోంది. ఆడిట్ అభ్యంతరాలు, వాటి పరిష్కారాలను పరివీక్షించేందుకు వీలుగా అపరిష్కృతంగా ఉన్న ఐ.ఆర్.ల వివరాలతో ఒక అర్ధ సంవత్సర నివేదికను సంబంధిత శాఖ కార్యదర్శికి పంపించడం జరుగుతుంది. సంబంధిత కార్యాలయాధిపతులూ, వారి పైఅధికారులూ, ఐ.ఆర్.ల లోని పరిశీలనలను పాటించి, అభ్యంతరాలలో లేవనెత్తిన లోటుపాట్లను సత్వరమే సరిచేసి, ఆ దిద్దుబాటు చర్యల వివరాలను పి.ఎ.జి.కి నివేదించాలి.

2008 జూన్, 2009 జూన్, 2010 జూన్ చివరి నాటికి అపరిష్కృతంగా ఉన్న ఐ.ఆర్./పేరాల పరిస్థితి ఈ కింది **పట్టిక - 22** లో చూపిన విధంగా ఉంది :

**పట్టిక - 22**

| | 2008 జూన్ చివరి నాటికి అపరిష్కృతంగా ఉన్నవి | 2009 జూన్ చివరి నాటికి అపరిష్కృతంగా ఉన్నవి | 2010 జూన్ చివరి నాటికి అపరిష్కృతంగా ఉన్నవి |
|---|---|---|---|
| ఐ.ఆర్.ల సంఖ్య | 13669 | 11600 | 9970 |
| పేరాల సంఖ్య | 47345 | 43267 | 41037 |

2010 జూన్ 30 నాటికి అపరిష్కృతంగా ఉన్న 9970 ఐ.ఆర్.లు/41037 పేరాలలో, 914 ఐ.ఆర్.లు/6157 పేరాలకు తొలి జవాబు కూడా రాలేదు. ఇట్టి ఐ.ఆర్.లు, పేరాలకు సంబంధించి సంవత్సరాల వారీ, శాఖలవారీ వివరాలను వరుసగా ***అనుబంధం - 3.15, 3.16*** లలో ఇవ్వడం జరిగింది. అర్ధ సంవత్సర నివేదికల ద్వారా పరిస్థితిని ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులకు తెలియజేసినా, సంబంధిత అధికారులు సకాలంలో సత్వర చర్యలు తీసుకొనేలా వీరు చూడలేకపోయారు. ఐ.ఆర్.ల మీద, పేరాల మీద చర్యలు తీసుకోక పోవడమనేది తీవ్రమైన ఆర్థిక లొసుగులు, ప్రభుత్వానికి నష్టాలు కొనసాగుతూనే ఉండేందుకు ఆస్కారం కల్పిస్తుంది.

**ఆడిట్ కమిటీల ఏర్పాటు**

షక్ధర్ కమిటీ (హై పవర్ కమిటీ) సిఫార్సులను అంగీకరిస్తూ, ఆడిట్ అభ్యంతరాలపై తదనంతర చర్యలను పరివీక్షించేందుకు ప్రతి శాఖలోనూ ఒక అధికారిని నియమించాలని ప్రభుత్వం అన్ని శాఖలనూ ఆదేశించింది (1993 నవంబరు). ఉన్నత స్థాయిల్లో తరచుగా సమీక్షలు జరిపేందుకుగాను సంబంధిత శాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శులతో కూడిన ఒక పరివీక్షణ కమిటీ ఉండాలని కూడా అన్ని శాఖలనూ ఆదేశించడం జరిగింది. ఆడిట్ పరిశీలనలను త్వరగా పరిష్కరించేందుకు మూడు స్థాయిల్లో, అంటే అపెక్స్ స్థాయి, డిపార్టుమెంటు స్థాయి, జిల్లా స్థాయిలలో ఆడిట్ కమిటీలు ఉండే విధంగా ప్రభుత్వం ఆడిట్ కమిటీలను పునర్వ్యవస్థీకరించింది (2004 జూన్). జిల్లా స్థాయి కమిటీలు రెండు నెలలకు ఒకసారి, డిపార్టుమెంటు స్థాయి కమిటీ మూడు నెలలకు ఒకసారి, అపెక్స్ కమిటీ ఏడాదిలో రెండు సార్లు (జనవరి, జూలై) సమావేశం కావాల్సి ఉంది. జిల్లా స్థాయి సమావేశాల్లో కూడా ఐ.ఆర్. లలోని ఆడిట్ పరిశీలనలను శాఖాధికారులు పి.ఎ.జి. కార్యాలయ అధికారులతో చర్చిస్తారు.

2009-10 లో ఆడిట్ కమిటీ సమావేశాల స్థితి ఈ కింది విధంగా ఉంది :.

- నిర్దేశాల ప్రకారం అపెక్స్‌స్థాయి రాష్ట్ర ఆడిట్ - అకౌంట్సు కమిటీ 2009-10 సంవత్సరంలో, రెండుసార్లు సమావేశం కావలిసివుండగా, ఒక్కసారి కూడా అది సమావేశం కాలేదు.
- 34 శాఖలలో, 2009-10లో, ఒకే ఒక్క శాఖ (గిరిజన సంక్షేమ శాఖ) లో మాత్రమే, రాష్ట్రస్థాయి శాఖాపరమైన ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు (2009 మే 15). 20 శాఖలకు సంబంధించి, 2004 జూన్‌లో కమిటీలను పునర్వ్యవస్థీకరణ చేసాక, రాష్ట్రస్థాయి శాఖాపరమైన ఆడిట్-అకౌంట్సు కమిటీ సమావేశం ఒక్కసారి కూడా జరగలేదు. వివరాలు ***అనుబంధం - 3.17*** లో ఉన్నాయి.
- ఎనిమిది జిల్లాలలో (ఆదిలాబాద్, తూర్పుగోదావరి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి) జిల్లాస్థాయి ఆడిట్ - అకౌంట్సు, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగలేదు. మిగతా జిల్లాల్లో కూడా ఏడాదికి ఆరు సమావేశాలను నిర్వహించాల్సి ఉండగా, తొమ్మిది జిల్లాల్లో

(గుంటూరు, కరీంనగర్, ఖమ్మం, కృష్ణా, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, వరంగల్, పశ్చిమగోదావరి) కేవలం ఒక్కసారి, ఐదు జిల్లాల్లో (అనంతపురం, చిత్తూరు, వై.ఎస్.ఆర్., కర్నూలు, ప్రకాశం) రెండుసార్లు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నాలుగుసార్లు మాత్రమే సమావేశాలు జరిగాయి.

ఆడిటు ఎత్తిచూపిన లోపాలను సరిదిద్దుకోవడంలో ఈ శాఖలకు తగినంత శ్రద్ధ లేదని దీన్ని బట్టి తెలుస్తోంది.

ప్రభుత్వం, (i) పి.ఎ.జి. జారీచేసిన ఐ.ఆర్.లపై సకాలంలో తగిన చర్యలను తీసుకొనేలా, (ii) పెండింగులో ఉన్న ఐ.ఆర్.లు/పేరాలను త్వరగా పరిష్కరించుకోవడానికి క్రమం తప్పకుండా ఆడిట్ కమిటీ సమావేశాలు నిర్వహించేలా, (iii) తనిఖీ నివేదికలలో లేవనెత్తిన రికవరీలు సత్వరమే వసూలయ్యేలా - చూడాలని సిఫార్సు చేయడమైంది.

**(జి.ఎన్. సుందర్ రాజా)**

**హైదరాబాదు** — **ప్రధాన మహాగణకాధికారి (సివిల్ ఆడిట్)**

**ఆంధ్రప్రదేశ్**

**ధ్రువీకరించడమైనది**

**(వినోద్ రాయ్)**

**కొత్త ఢిల్లీ** — **భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్**